అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

శనివారం 14-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 256 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50



జేఎన్‌యూలో కామ్రేడ్ ఏచూరి భౌతికకాయం వద్ద విద్యార్థుల నివాళి

# లాల్ సలాం కామ్రేడ్

## మీ ఆశయాలు కొనసాగిస్తాం

**భారీ వర్షంలోనూ తరలివచ్చిన విద్యార్థులు, ప్రొఫెసర్లు, సిబ్బంది**

**విప్లవనేతకు జేఎన్‌యూ ఘన నివాళి**

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

"లాల్ సలాం కామ్రేడ్ సీతారాం", "కామ్రేడ్ సీతారాం ఏచూరి అమర్ రహే" అంటూ వందలాది మంది విద్యార్థులు భారత విప్లవోద్యమ వీరుడికి నివాళులు అర్పించారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) క్యాంపస్‌లో విద్యార్థులు, ప్రొఫెసర్లు, యూనివర్సిటీ సిబ్బంది ఏచూరికి వీడ్కోలు పలికిన తీరు భావోద్వేగానికి గురి చేసింది. జేఎన్‌యూ విద్యార్థి సంఘం హాల్‌లో వారు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.ఎంబామ్ చేసి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో ఉంచిన ఏచూరి భౌతికకాయంపై మృతదేహాన్ని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బృందా కరత్, ఎంఎ బేబి, నీలోత్పల్ బసు అరుణ పతాకాన్ని కప్పి నివాళులు అర్పించారు. అనంతరం భౌతికకాయాన్ని జేఎన్‌యూ క్యాంపస్‌కు అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. ఢిల్లీలో కుండపోతగా వర్షం కురుస్తున్నా.. ప్రియతమ నేతకు నివాళిగా ఆస్పత్రి నుంచి జేఎన్‌యూ వరకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో కదం కదం కలిపారు. జేఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్, టీచర్స్ అసోసియేషన్, ఇతర సంఘాల ప్రతినిధులు పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. ఏచూరి నడిచిన బాటలో తామూ పయనిస్తామని, ఆయన ఏ ఆశయాల కోసం ఉద్యమించారో..వాటిని ఆచరిస్తామని ప్రతిన బూనారు. జోహార్ కామ్రేడ్ ఏచూరి అంటూ నినదించారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, జేఎన్‌యూ మాజీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు విజ్జు కృష్ణన్, ఎంపీలు జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీం, ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు విపి సాను, ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణన్, ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



**నేడు ఏకేజీ భవన్‌కు భౌతిక కాయం**

దేశ రాజధాని శనివారం విప్లవ వీరుడికి నివాళులర్పిస్తుంది. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి, వామపక్ష ప్రగతిశీల ఉద్యమాల నాయకుడు సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏకేజీ భవన్‌లో ప్రజలు, కార్యకర్తలు, నేతల సందర్శనార్థం ఉంచనున్నారు. ఆ తరువాత మెడికల్ స్టడీస్ కోసం ఢిల్లీలోని ...15లో



# వరద నష్టం రూ.10,320 కోట్లు

## ఎస్ఎస్ఆర్ రేట్లను పరిశీలించి విపత్తు సాయం అందించండి

**ఎన్డీఆర్ఎఫ్‌లో రూ.1350కోట్లున్నా నిబంధనలతో వాడుకోలేని పరిస్థితి**

**లక్ష రూపాయలతో కిలోమీటర్ రోడ్డు నిర్మాణం ఎలా? :**

**కేంద్రానికి మరోమారు విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి**

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన తెలంగాణకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి మరోమారు విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు షరతులు లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. విపత్తు నిధుల వినియోగం విషయంలో కేంద్రం అమలు చేస్తున్న కఠినమైన నిబంధనలు సడలించాలని విన్నవించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రాష్ట్రంలో అపార నష్టం సంభవించిందనీ, ఇప్పటి వరకు వివిధ శాఖల నుంచి అందిన అంచనాల ప్రకారం రూ.10,320 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇంకా పూర్తివివరాలు రావాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో వరదలతో వాటిల్లిన నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందంతో ముఖ్యమంత్రి శుక్రవారం సచివాలయంలో భేటీ అయ్యారు. సమావేశంలో సీఎంతో పాటు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కేంద్ర బృందంలో ఎన్డీఎంఏ సలహాదారు కల్నల్ కేపీ సింగ్, శాంతినాథ్, శివప్ప, మహేశ్‌కుమార్, నాయల్ కాన్సన్, రాకేశ్ మీనా, శశివర్ధన్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఇప్పుడున్న నిబంధనలు చూస్తే.. తెలంగాణ మొత్తం మునిగిపోయినా ఎన్డీఆర్ఎఫ్‌లో అందుబాటులో ఉన్న రూ.1350 కోట్లల్లో ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకునే పరిస్థితి లేదని కేంద్ర అధికారుల బృందం దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఒక కిలోమీటర్ రోడ్డు దెబ్బతింటే ఒక లక్ష రూపాయలు మాత్రమే ఖర్చు చేయాలని రేట్లను నిర్ణయించారనీ, దీంతో తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరిగిన నష్టంతో పాటు ఇక్కడ అమల్లో ఉన్న ఎస్ఎస్ఆర్ రేట్ల వివరాలను కూడా నివేదిస్తామని, వాటిని పరిశీలించి విపత్తు సాయం అందించాలని కేంద్ర బృందాన్ని కోరారు. తనతో పాటు మంత్రులు, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించటంతో భారీగా ప్రాణనష్టం తగ్గిందని చెప్పారు. వేలాది ఇండ్లు దెబ్బతిన్నాయనీ, లక్షలాది ...7లో

**ట్రాఫిక్ వాలంటీర్లుగా**

## ట్రాన్స్‌జెండర్లు

ప్రత్యేక యూనిఫాం...స్టైఫండ్

హోంగార్డ్స్ తరహా సేవలు

క్లీన్ సిటీనే లక్ష్యం..

ఇండోర్‌లో అధ్యయనం చేసిరండి..

పనులు చేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు

మున్సిపల్ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

7లో..

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు

# బెయిల్

## షరతులు వర్తింపు

సీబీఐ..పంజరంలో చిలుక కాకూడదు :

సుప్రీం వ్యాఖ్య

సీబీఐ అరెస్టు అన్యాయం :

జస్టిస్ ఉజ్జల్ భుయాన్

అన్యాయంగా సుదీర్ఘ జైలు శిక్ష

స్వేచ్ఛను హరించడమే :

జస్టిస్ సూర్యకాంత్



**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. ఢిల్లీ మద్యం స్కాం కేసులో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసులో సీబీఐ అరెస్టును, సీబీఐ కేసులో ఢిల్లీ హైకోర్టు తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేజ్రీ రెండు వేర్వేరు పిటిషన్లు వేశారు. దీనిపై ఈ నెల 5న విచారణ చేపట్టిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు రెండు పిటిషన్లపైనా శుక్రవారం తీర్పు వెలువరించింది. కేజ్రీవాల్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10లక్షల బాండ్ సమర్పించాలని, కేసు గురించి బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని, కేసు ...15లో


# అదానీ సొమ్ము రూ.2600 కోట్లు జప్తు

## ఖాతాలను సీజ్ చేసిన స్విడ్జర్లాండ్ అధికారులు : హిండెన్‌బర్గ్ వెల్లడి

**న్యూఢిల్లీ :** అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ మరో బాంబు పేల్చింది. స్విస్ బ్యాంక్ అకౌంట్లలో అదానీకి ఉన్న 31 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2600 కోట్లు) సొమ్మును జప్తు చేశారు. స్విస్‌లోని ఆరు బ్యాంక్‌ల్లోని ఈ మొత్తాన్ని అక్కడి ప్రభుత్వ అధికారులు సీజ్ చేశారని అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ వెల్లడించింది. అదానీ గ్రూపు మనీలాండరింగ్‌కు పాల్పడిందని తెలిపింది. బీవీఐ, మారిషెస్, బెర్ముడాల్లో అదానీ స్టాక్స్‌కు చెందిన నిధులను పెట్టుబడిగా పెట్టిందని హిండెన్‌బర్గ్ పేర్కొంది. దీంతో స్విస్ మీడియాలో అదానీ గ్రూప్ చాలా చర్చనీయాంశమైంది. బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్, మారిషస్, బెర్ముడాలో వివాదాస్పద నిధులలో అదానీ అనుబంధ సంస్థ ఫ్రంట్‌మాన్ ఎలా పెట్టుబడి పెట్టింది అనే దానిపై ప్రాసిక్యూటర్లు సమాచారాన్ని అందించారని హిండెన్‌బర్గ్ వెల్లడించింది. ఈ సమాచారాన్ని స్విస్ క్రిమినల్ కోర్టు రికార్డుల నుండి పొందినట్టు పేర్కొంది. 2021 నాటికే అదానీపై మనీలాండరింగ్,

**పడిపోయిన షేర్లు**

సెక్యూరిటీల ఫోర్జరీ విచారణలో భాగంగా స్విస్ అధికారులు బహుళ స్విస్ బ్యాంక్ ఖాతాలలో ఈ సొమ్మును స్తంభింపజేసినట్టు వెల్లడించింది. దాదాపు మూడు ఏళ్లుగా ఈ విచారణ సాగుతోంది. అదానీ గ్రూప్‌నకు సంబంధించిన ఈ మనీలాండరింగ్ కేసు చాలా తీవ్రమయ్యిందని తెలిపింది. కాగా.. నిధుల సమీకరణ కోసం రిటైల్ ఇన్వెస్టర్లను ఆశ్రయించాలని అదానీ గ్రూప్ ఆలోచిస్తున్న ప్రస్తుత సమయంలో హిండెన్‌బర్గ్ ఈ బాంబు పేల్చడంతో ఆ సంస్థ ప్రణాళికలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.



**నిరాధార ఆరోపణలు : అదానీ గ్రూపు**

హిండెబన్‌బర్గ్ చేసిన ఆరోపణలను అదానీ గ్రూపు ఖండించింది. ఆ ఆరోపణలు నిరాధారమైనవని తెలిపింది. అదానీ గ్రూపుకు స్విస్ కోర్టు విచారణలతో సంబంధం లేదని పేర్కొంది. హిండెన్‌బర్గ్ తాజా రిపోర్ట్‌లో శుక్రవారం అదానీ కంపెనీల షేర్లు మరోమారు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అదానీ స్టాక్స్ రెండు శాతం మేర విలువ కోల్పోయాయి. అదానీ పవర్ 2.73 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ...15లో

# ఎమర్జెన్సీని తలపిస్తోన్న రేవంత్ పాలన

## సీఎం డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడులు

- రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- హరీశ్‌రావు హౌస్ అరెస్ట్



**నవతెలంగాణ-గండిపేట్**

సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని, సీఎం డైరెక్షన్, ప్రేరణతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడులు చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన సీఎం, మంత్రులు.. వాళ్ల పార్టీ నేతలను రెచ్చగొడుతున్నారని, వారే అలా ఉంటే కార్యకర్తలు మరెలా ఉంటారని 'యథా రాజా.. తథా ప్రజా' అని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా అని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా కోకాపేటలోని హరీశ్‌రావు నివాసంలో ఆయన్ను శుక్రవారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అయితే తాను ఆస్పత్రికి వెళ్లాలని హరీశ్‌రావు పోలీసులకు చెప్పగా వారు అడ్డుకున్నారు. ఈ క్రమంలో హరీశ్‌రావుకు పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అయితే పోలీసులు హరీశ్‌రావును మాత్రం ఇంటికే పరిమితం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు..సీఎం రేవంత్‌రెడ్డి డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని హరీశ్ అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తే ఇతర విషయాలు తెర మీదికి తెచ్చి అసలు విషయాలను పక్కాదారి పట్టించే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో హైకోర్టు రేవంత్‌కు మొట్టికాయలు వేసిందన్నారు. ఈ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. వరద బాధితుల కోసం ఖమ్మం వెళ్తే అక్కడ తమపై దాడులు చేశారని, దాడి చేసిన వారిపై ఇప్పటికీ ...15లో

**పాడి కౌశిక్..ఒళ్లు దగ్గర పెట్టుకో**

సీపీ ఆఫీస్‌లో రౌడీయిజం చేస్తారా?

కేటీఆర్, హరీశ్‌రావు శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తున్నారు : కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆగ్రహం

వివరాలు 15లో

# ఫార్మా విలేజ్‌తో మంజీరకు ముప్పు?

## తాగు, సాగునీటి జలాలు కలుషితం

ఫార్మా విలేజీ ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న విషయం తెలిసిందే. 9 జిల్లాల్లో 10 ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో సంగారెడ్డి జిల్లా మంజీరా నదికి కూతపెట్టు దూరంలో 2003 ఎకరాల్లో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయనున్నారు. ఫార్మా విలేజ్ ఏర్పాటు చేస్తే మంజీరా నదీ జలాలు పూర్తిగా హానికరంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. హైదరాబాద్ జంట నగరాలు, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు రక్షిత తాగునీరు మంజీరా నుంచే సరఫరా అవుతాయి. సింగూరు, ఘనపూర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు మంజీర నుంచి అందుతాయి. జహీరాబాద్, పటాన్‌చెరు ప్రాంతాల్లోని పరిశ్రమల కాలుష్య వ్యర్థాలతో ఇప్పటికే మంజీరా నదీ జలాలు కాలుష్య కోరల్లో చిక్కాయి. కొత్తగా మంజీరా నది సిగలో వేలాది ఎకరాల్లో ఫార్మా విలేజీ నెలకొల్పడం సరికాదని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.



**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

ఫార్మా విలేజీ కోసం న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మాల్గీ, వడ్డీ గ్రామాల్లో 2003 ఎకరాల పంట భూముల్ని ఫార్మా కంపెనీల కోసం సేకరించాలని కలెక్టర్ ఆధ్వర్యంలో సర్వే పనులు జరుగుతున్నాయి. అయితే రైతులు పంట భూములిచ్చేందుకు ఇష్టపడట్లేదు. పచ్చని పంట పొలాలు, ఊర్లు, మంజీరా నది, అభయారణ్యం, దేవాలయాలు, వాగులు, వంకల్ని విధ్వంసం చేసే ఫార్మా విలేజీ మాకొద్దంటూ రైతులు పోరాడుతున్నారు.

**ఎగువన ఫార్మా కంపెనీలు పెడితే**

**వ్యర్థాలన్నీ సింగూరులోకే..**

**మంజీరా అభయారణ్యం ఉనికికే ప్రమాదం**

**సమీక్ష మాత్రమే జరిగింది : ఐబీ ఈఈ**

**కాలుష్య వ్యర్థ జలాలతో మరింత ప్రమాదం**

ఫార్మా విలేజీ నెలకొల్పితే పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య జలాలు నేరుగా మంజీరలో కలుస్తాయి. డప్పూర్, మాల్గీ, వడ్డీ గ్రామాల నుంచి చాకలివాగు, కోటవాగు, నక్కలవాగు, న్యాల్‌కల్ వాగు ప్రవహిస్తాయి. ఈ వాగులన్నీ చెనెగపల్లి జలాశయంలో కలుస్తాయి. చెనెగపల్లి ప్రాజెక్టు నుంచి వచ్చే నీరంతా పెద్దవాగులో కలిసి మరియాపూర్, హమాపూర్ గ్రామాల శివారు గుండా పారి చాల్కీ సమీపంలోని మంజీరా నదిలో కలుస్తాయి. దీనికి దిగువనే సింగూరు ప్రాజెక్టు ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ జంట నగరాలకు నేరుగా తాగునీరు సరఫరా చేసే హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు మిషన్ భగీరథ పథకాలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 943 ...6లో



# ఐద్వా సీనియర్ నేత

# ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ కన్నుమూత

## సీపీఐ(ఎం), ఐద్వా, ప్రజాసంఘాల సంతాపం

**ప్రజల సందర్శనార్థం నేడు మహబూబ్‌నగర్‌కు భౌతికకాయం**

**ఆ తర్వాత ప్రభుత్వాస్పత్రికి అప్పగించనున్న కుటుంబ సభ్యులు**

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**



(ఫైల్)

ఐద్వా సీనియర్ నాయకురాలు ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ (85)శుక్రవారం హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో ఉన్న తన సొంత ఇంటిలో మరణించారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మధ్యాహ్నం మూడు గంటలకు చనిపోయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త శ్రీహరి ఐదేండ్ల క్రితం చనిపోయారు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు అరుణ, సునీత, ఇద్దరు కుమారులు డాక్టర్ ఉదయ్, అర్జున్. గతంలో అర్జున్ నవతెలంగాణ దినపత్రికకు న్యూస్ ఎడిటర్‌గా పనిచేశారు. లక్ష్మీదేవమ్మ ఐద్వా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేశారు. జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించారు. కరువు కాటకాల్లో ప్రజల ఇబ్బందిని గమనించి అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసి వారి ఆకలిని తీర్చారు. రాష్ట్ర కేంద్రానికి ...7లో

**హైడ్రాపై స్టేకు హైకోర్టు నో**

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

అక్రమ కట్టడాల కూల్చివేత చర్యలు తీసుకునే హైడ్రాను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు విచారించింది. హైడ్రా ఏర్పాటుకు వీలుగా రాష్ట్ర సర్కార్ జారీ చేసిన జీవో ...6లో

**మంకీపాక్స్‌కు తొలి వ్యాక్సిన్**

**డబ్ల్యూహెచ్ఓ ఆమోద ముద్ర**

జెనీవా : ఆఫ్రికా దేశాల్లో కలకలం సృష్టిస్తున్న మంకీపాక్స్ వైరస్‌కు తొలి వ్యాక్సిన్ ఎంవిఎ-బిఎన్ కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ...15లో

## కౌశిక్‌రెడ్డిపై అనర్హత వేటు వేయాలి

- స్పీకర్‌కు కాంగ్రెస్ మహిళా నేతల వినతి

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

మహిళలను కించపరిచేలా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ మహిళా నేతలు కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, సంధ్యారెడ్డి, కార్పొరేటర్ పారిజాత నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు వరలక్ష్మి తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరా శోభన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఓట్ల కోసం ఆంధ్ర సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలతో బీఆర్ఎస్ అసలు నిజస్వరూపం బయటపడిందన్నారు. బతకడానికి వచ్చావంటూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఆయన ఆంధ్ర నుంచి వచ్చినట్టు తెలియదా? ప్రశ్నించారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్‌రెడ్డిపై డీజీపీ చర్యలు తీసుకోవాలని కోరారు.

# పెండింగ్ బిల్లులను ఇప్పించండి

### పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్ ఎదుట సర్పంచుల జేఏసీ ధర్నా




**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సర్పంచుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇదే అంశంపై శుక్రవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్ ఎదుట సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. సర్క్యూలర్ల మీద సర్క్యూలర్లు ఇచ్చి తమతో శక్తికి మించి పనులు చేయించారనీ, దీని కోసం చేసిన అప్పులు తీరక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. నిధులు అడిగితే షోకాజ్ నోటీసులు ఇచ్చిమరీ పనులు చేయించారన్నారు. తమ పదవీ కాలం అయిపోయిన తర్వాత కూడా బిల్లులు విడుదల చేయకుండా నాన్చడం సరిగాదని తెలిపారు. రెండేండ్లుగా పంచాయతీలకు స్టేట్ ఫండ్ రావట్లేదన్నారు. వస్తాయనుకున్న నిధులు రాక అధికారుల భయానికి అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు చాల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని వాపోయారు. తమ పెండింగ్ బిల్లులను విడుదల చేసిన తర్వాతనే గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, రాంపాక నాగయ్య, మెడబోయిన గణేష్, సముద్రాల రమేష్, మల్లయ్య, బీరప్ప నవీన్ రావు, తదితరులు పాల్గొన్నారు

## క్రీమీలేయర్ విధానాన్ని రద్దు చేయాలి

- ఎంపీ ఆర్ కృష్ణయ్య పార్లమెంటులో ప్రస్తావించాలి : బీసీటీఏ



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య జన్మదినం సందర్భంగా బీసీటీఏ అధ్యక్షులు కె కృష్ణుడు శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని సూచించారు. క్రీమీలేయర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనీ, కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఆర్ కృష్ణయ్య పార్లమెంటులో ఈ అంశాలను ప్రస్తావించాలనీ, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి అమలయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీటీఏ నాయకులు బాలగోపాల్, శివకుమార్, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు హైకోర్టు ఆదేశాల మేరకు మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టాలని కోరుతూ మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు శ్రీనివాసాచారిని జాక్టో కోశాధికారి, బీసీటీఏ అధ్యక్షులు కె కృష్ణుడు, నాయకులు విఠల్, చంద్రశేఖర్, కె సారయ్య కలిసి వినతిపత్రం సమర్పించారు.

## మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు చేపట్టాలి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి పీఎంటీఏ వినతి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

హైకోర్టు ఆదేశాల ప్రకారం మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలని పీఎంటీఏ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు శ్రీనివాసాచారిని శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. బదిలీల కోసం సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయులు వేచిచూస్తున్నారని తెలిపారు. గతంలో ఇచ్చిన ఆన్‌లైన్ వెబ్‌ఆప్షన్లపై ఒకరోజు సవరణకు అవకాశం కల్పించాలని కోరారు. ఆ తర్వాత బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.


## హైడ్రాపై ఏపీ నేత కాటసాని భార్య పిటిషన్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సంగారెడ్డి జిల్లా అసింగ్‌పూర్‌లోని తమ వ్యవసాయ భూమిలోని షెడ్, కాంపౌండ్ వాల్‌ను హైడ్రా కూల్చివేయచేయడాన్ని సవాలు చేస్తూ ఏపీకి చెందిన వైసిపి మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి భార్య ఉమామహేశ్వరమ్మ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ వినోద్‌కుమార్ విచారించారు. ఆ చెరువు మ్యాప్ (1970 నాటిది) సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అది అరుదైన చెరువని చెప్పారు. కౌంటర్ వేయాలని ప్రతివాదులను ఆదేశించారు. విచారణను అక్టోబరు 3కి వాయిదా వేశారు.

**ప్రభుత్వానికి నోటీసులు**

పోలీస్ కంప్లయింట్ అథార్టీ ఏర్పాటు చేయకపోవడంపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ(ఎస్‌పీసీఏ), జిల్లా పోలీస్ ఫిర్యాదుల అథారిటీ(డీపీసీఏ)లను ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వ హామీ అమలు చేయలేదంటూ లాయర్ వేణుగోపాల్ వ్యక్తిగత హోదాలో పిటిషన్ వేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బెంచ్ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి విచారణ 3 వారాలకు వాయిదా వేసింది.




## ఎర్ర నక్షత్రం!

ఇపుడు యుద్ధం ముగిసిందనుకొంటే
పొరపాటే...
ఇప్పుడిక ఆ ధైర్యం అస్తమించిందనుకొంటే
గ్రహపాటే...
యోధుడు కూలినా లక్ష్యం గురితప్పలేదు
వీరుడు ఒరిగినా వీరత్వం తొణకలేదు

తూరుపెందుకో దు:ఖంతో మరీ ఎరుపెక్కింది
సమరశంఖం తానే ఒక ఘర్జనై ఎగిసి అతడి
గాథలే దిక్కులు పిక్కటిల్లేల పాడుతోంది...
శ్రామిక రైతాంగ బావుటా సీతారాముడి
వీడ్కోలుగా నింగికెగిసి సెల్యూట్ చేసింది!

ప్రజాతంత్ర లౌకిక శక్తుల్ని ఏకం చేసిన
అసమాన పోరాట పటిమ శతకోటి
ఎర్రసూర్య ప్రభలతో ఉవ్వెత్తున ఎగిసిపడి
నింగిన వెలుగై నిలిచింది

మహోన్నతుడు నేడు భౌతిక కాయమైనా
ఆ స్ఫూర్తి దివ్య నీరాజనా లందుకొంటుంది
లెఫ్ట్ కు రైటన్న పెద్దన్న నడిచిన బాట...
బడుగు బలహీన వర్గాల పాలిట రాచబాటై
అవిశ్రాంత పోరాట లక్ష్యాల్ని సాధించింది

అందుకే ఓ నాయకుడా
అందుకో అఖిలాంధ్రుల
లాల్ సలామ్... లాల్ సలామ్!!

(కామ్రేడ్ సీతారాం ఏచూరికి నివాళి)

- భీమవరపు పురుషోత్తమ్
9949800253



# పోరాట యోధుడు...ఆలోచనాపరుడు



**న్యూఢిల్లీ :** అది 2003 ఆగస్ట్ నెల. అప్పుడు సీతారాం ఏచూరి సీపీఐ (ఎం) సీనియర్ నాయకుడు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో ప్రసంగించవలసిందిగా పార్టీ విద్యార్థి విభాగం ఎస్ఎఫ్ఐ ఆయనను ఆహ్వానించింది. వర్సిటీలో కొత్తగా చేరిన విద్యార్థులు ముందు వరుసలలో కూర్చున్నారు. హాలంతా కిటకిటలాడుతోంది. అప్పటి బీజేపీ విధానాలు మైనారిటీలను మాత్రమే కాకుండా భారతావనిలోని మొత్తం కార్మిక వర్గాన్ని ఏ విధంగా లక్ష్యంగా చేసుకున్నాయో ఏచూరి తన ప్రసంగంలో వివరించారు.

### మంత్రముగ్ధులైన విద్యార్థులు

ఆ సమయంలో ఆయనకు ప్రత్యేకించి అభిమానులు అంటూ పెద్దగా ఎవరూ లేరు. కొంచెం ఆలస్యంగా వచ్చినందుకు ఏచూరి ముందుగా క్షమాపణలు కోరారు. ప్రసంగం ప్రారంభించి ఐదు నిమిషాలు గడిచాయి. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అంశాల వారీగా ఆయన వివరిస్తుంటే వర్సిటీలో కొత్తగా చేరిన విద్యార్థులు ఆసక్తిగా వినడం మొదలు పెట్టారు. సీపీఐ (ఎం) పొడ గిట్టని విద్యార్థులను సైతం ఏచూరి ప్రసంగం ప్రభావితులను చేసింది. ఆయన తన నలభై ఐదు నిమిషాల ప్రసంగంలో ప్రభుత్వ మతతత్వాన్ని, సరళీకరణ- ప్రయివేటీకరణ -ప్రపంచీకరణ విధానాలను తూర్పార పట్టారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలంటే వామపక్షాలే అత్యంత చట్టబద్ధమైన రాజకీయ శక్తి అని వివరించారు. తద్వారా నూతన విద్యార్థులకు భవిష్యత్ మార్గనిర్దేశం చేశారు. ఏచూరి తన ప్రసంగాన్ని ముగించగానే విద్యార్థులు పెద్ద పెట్టున కరతాళధ్వనులు చేశారు. ఈ ప్రసంగం ద్వారా ఆయన విద్యార్థులపై చెరగని ముద్ర వేశారు. అంతేకాదు... ఓ రాజకీయ శక్తిగా విద్యార్థులు వామపక్షాలను గుర్తించేలా చేశారు. ఏచూరి ప్రసంగం విద్యార్థి లోకాన్ని మంత్రముగ్ధులను చేసింది.

### మార్గనిర్దేశకుడిగా...

మరో సమావేశానికి హాజరయ్యేందుకు ఏచూరి బయలుదేరిన సమయంలోనే విద్యార్థులందరూ ఆయన ప్రసంగం గురించి అభిప్రాయాలు పంచుకోవడం ప్రారంభించారు. ఆయన తన ప్రసంగంలో స్పృశించిన కొన్ని ఆలోచనలపై చర్చించుకోవడం మొదలు పెట్టారు. జేఎన్‌యూలో వారి జీవనం అలా ప్రారంభమైంది. ఏచూరి తన జీవితాంతం జేఎన్‌యూ విద్యార్థులను ప్రభావితం చేస్తూనే ఉన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎదిగినా, జాతీయ-అంతర్జాతీయ రాజకీయ అంశాలపై ఆందోళనలు నిర్వహించినా, పార్టీకి తిరిగి పునర్వైభవాన్ని కట్టబెట్టేందుకు కృషి చేసినా...సందర్భం ఏదైనా ఆయన ఎప్పుడూ జేఎన్‌యూ విద్యార్థులను గురించి ఆలోచిస్తూనే ఉండేవారు. వారిని ఆలోచనాపరులుగా, విమర్శకులుగా తీర్చిదిద్దారు. సంఘీభావాలు ఎలా తెలపాలో, కూటములను ఎలా ఏర్పాటు చేసుకోవాలో నేర్పారు.

### స్నేహపాత్రుడుగా...

దేశంలో మైలురాళ్లుగా లిఖించదగిన అనేక ఘటనలలో ఏచూరి కీలక పాత్ర పోషించారు. స్నేహపాత్రుడైన రాజకీయ నేతగా పేరు గడించారు. కమ్యూనిజం విషయంలో ఆయన జీవితకాల నిబద్ధత అందరికీ తెలిసిందే. అయినప్పటికీ అన్ని రాజకీయ పార్టీల నేతలనూ అక్కున చేర్చుకున్నారు. వారి కోసం తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంచే వారు. సామాన్యులు, పాత్రికేయులు ఆయనను కలవడానికి ఎప్పుడూ సంకోచించే వారు కారు. కొన్ని సందర్భాలలో అసౌకర్యం కలిగినప్పటికీ వారందరితో ఆయన తీరుబడిగా ముచ్చటించే వారు. తెలుగు భాష మాట్లాడే కుటుంబంలో జన్మించిన ఏచూరి తన బాల్యాన్ని ప్రభుత్వ ఉద్యోగులైన తల్లిదండ్రులతో గడిపినప్పుడు చిన్న వయసులోనే వైవిధ్యభరితమైన జన జీవనాన్ని గమనించారు. ప్రతిభావంతుడైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్న ఏచూరి తొలుత న్యూఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో, ఆ తర్వాత జేఎన్‌యూలో చేరారు.

**మహోన్నత వారసత్వాన్ని వదిలి వెళ్లిన ఏచూరి**

### పాన్-ఇండియా నేతగా...

ఎమర్జెన్సీ సమయంలో తాత్కాలికంగా అరెస్ట్ చేయడంతో పీహెచ్‌డీని పూర్తి చేయాలనుకున్న ఏచూరి ఆశయం నెరవేరలేదు. దీంతో ఆయన పార్టీకి పూర్తి స్థాయి కార్యకర్తగా మారారు. ఎస్ఎఫ్ఐకి నాయకత్వం వహించారు. జాతీయ స్థాయిలో ఆయన నిర్వహించిన పాత్ర పాన్-ఇండియా నేతగా పరిణితి చెందేందుకు దోహదపడింది. ఏచూరి దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. వేర్వేరు విద్యార్థి ఉద్యమాలతో సంబంధాలు కొనసాగించారు. ఉమ్మడి అంశాలపై సంఘీభావం ప్రకటించారు. ఎస్ఎఫ్ఐని ఒక పెద్ద విద్యార్థి సంఘంగా తీర్చిదిద్దారు.

### చెరగని ముద్ర

ఎమర్జెన్సీ తర్వాత కాలంలో ఆయన నిర్వహించిన నిర్మాణాత్మక పాత్రను పార్టీ సీనియర్ నేతలు గుర్తించారు. విధాన నిర్ణయ యంత్రాంగాలలో యువతకు భాగస్వామ్యం కల్పించే ప్రయత్నంలో భాగంగా ఆయనను పార్టీ కేంద్ర కమిటీలోకి తీసుకున్నారు. పార్టీని విస్తరించేందుకు సీపీఐ (ఎం) ప్రయత్నిస్తున్న సమయంలోనే జాతీయ రాజకీయాలలో ఏచూరి అడుగు పెట్టారు. ఆ ప్రయత్నాలు అర్థాంతరంగా నిలిచిపోయినప్పటికీ ఏచూరి ఓ నేతగా ఎదిగారు. పలువురు పార్టీ నేతలు పార్టీ కంచుకోటలైన కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకే పరిమితమైతే ఏచూరి, కరత్ మాత్రం జాతీయ రాజకీయాలలో తమదైన ముద్ర వేశారు. అదే సమయంలో అంతర్జాతీయ సమావేశాలలో పాల్గొనేందుకు ఏచూరి పార్టీ ప్రతినిధిగా ఎంపికయ్యారు. తూర్పు యూరోపియన్ దేశాలతో పాటు ఇతర దేశాల కమ్యూనిస్టు పార్టీల సమావేశాలకు ఆయన సీపీఐ (ఎం) తరఫున ప్రాతినిధ్యం వహించారు.

పరిశీలనాత్మక అనుభవం కలిగిన ఏచూరి తన రాజకీయ అవగాహనను దేశానికి సంబంధించిన అంశాలకే పరిమితం చేయలేదు. ఎప్పటికప్పుడు అంతర్జాతీయ పరిణామాలను అవగతం చేసుకునే వారు. తద్వారా విదేశాంగ విధాన అంశాలలో ఒక నిర్దిష్టమైన అవగాహన కలిగిన అరుదైన భారత రాజకీయ నాయకులలో ఒకరుగా నిలిచారు.

### సూర్జిత్ మార్గదర్శనంలో...

సోవియట్ యూనియన్ పతనం, బాబ్రీ మసీదు కూల్చివేత, 90వ దశకం ప్రారంభంలో ప్రభుత్వం అనుసరించిన సరళీకరణ-ప్రైవేటీకరణ-ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) విధానాలు...ఈ పరిణామాలతో దేశంలో వామపక్ష ఉద్యమానికి ఎదురు దెబ్బ తగిలింది. ఆ సమయంలో ఏచూరి భాగస్వామిగా ఉన్న సీపీఐ (ఎం) నాయకత్వం బీజేపీని ఓడించడానికి, భారతీయ లౌకికవాదానికి బలమైన పునాదులు నిర్మించడానికి విభిన్నమైన రాజకీయ పార్టీలతో పొత్తులు నిర్మించుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేసింది. అప్పటి పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన హరికిషన్ సింగ్ సూర్జిత్ మార్గదర్శనంలో ఏచూరి క్రియాశీలక పాత్ర పోషించారు. రాజకీయ పార్టీలతోనే కాకుండా పౌర సమాజ గ్రూపులతో కూడా బలమైన లౌకిక కూటమిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. అందుకోసం సీపీఐ (ఎం), ఇతర పార్టీల మధ్య వారధిగా పనిచేశారు. ఏచూరి ఎదుగుదలకు సంకీర్ణ రాజకీయాలలో నిష్ణాతుడైన సూర్జిత్ ఎంతగానో దోహదపడ్డారు. ఎవరూ కలలో సైతం ఊహించని విధంగా వివిధ శక్తుల మధ్య వారధులు నిర్మించేందుకు ఏచూరి తన స్నేహహస్తాన్ని చాటారు. తన నడవడిక ద్వారా అందరికీ ప్రీతిపాత్రుడయ్యారు.

### వ్యక్తిగత అభిరుచులు

పుస్తకాలంటే ఏచూరి చెవి కోసుకుంటారు. ఆయన మంచి హాస్య ప్రియుడు కూడా. పాత హిందీ చలనచిత్ర గీతాలంటే ఎంతో ఇష్టం. 80వ దశకానికి అనేక దశాబ్దాల ముందు వచ్చిన దాదాపు అన్ని పాటల రచయితలెవరో, సంగీత దర్శకులెవరో ఆయనకు బాగా గుర్తుండేదని స్నేహితులు చెబుతారు. ఏచూరి లెక్కలేనన్ని హిందీ పాటలను సేకరించారు. పార్టీ వివిధ పత్రికలకు సంపాదకుడిగా వ్యవహరించినప్పుడు కూడా ఆయన వ్యవహార శైలి మారలేదు. ఆయన పలు రాజకీయ వ్యాసాలను ప్రచురించడమే కాకుండా నవలాకారులు, కవులు, కళాకారులతో ప్రయోగాత్మకంగా ఇంటర్వ్యూలు చేసే వారు. జేఎన్‌యూ విద్యార్థి విభాగం అధ్యక్షుడుగా ఏచూరి గోడ పత్రికలకు శ్రీకారం చుట్టారు. చివరి వరకూ ఆయన తన రచనా వ్యాసంగాన్ని మానలేదు. ముఖ్యమైన అంశాలపై వెంటనే జోక్యం చేసుకునే వారు. తీవ్రమైన సమస్యలను సైతం చమత్కారపూరితమైన వ్యాఖ్యానాలతో తేలిక పరిచేవారు.

పార్లమెంటేరియన్‌గా రెండు దశాబ్దాల రికార్డు నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా ఏచూరి గాంభీర్యానికి నిదర్శనంగా నిలిచింది. అంతేకాదు...నైపుణ్యం కలిగిన సంధానకర్తగా ఆయనను నిలబెట్టింది. ఇతరుల విషయంలో ఏచూరి వ్యవహార శైలి రాజకీయ నేతల గౌరవానికి పాత్రమైంది. బెంగాలీ, మరాఠీ వంటి ప్రాంతీయ భాషలలో కూడా ఆయన మాట్లాడేవారు.

జ్యోతిబసు, ఈఎంఎస్ నంబూద్రిపాద్, పుచ్చలపల్లి సుందరయ్య, సూర్జిత్ వంటి దిగ్గజ నేతలు పార్టీని ఏ విధంగా కరత్, సీతారాం నిర్మించుకుంటూ వచ్చారో వారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ముందుకు సాగారని ఏ సీపీఐ (ఎం) సీనియర్ పరిశీలకుడిని అడిగినా చెబుతారు. లెజండరీ నేతల పదవీ విరమణ లేదా మరణం కారణంగా పార్టీలో ఏర్పడిన శూన్యతను ఈ ఇరువురు నేతలు భర్తీ చేశారు. పార్టీని సంస్థాగతంగా నిర్మించడంలో కరత్ కృషి చేస్తే పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని సంక్లిష్టతలను ఎదుర్కోవడానికి పార్టీని ఏచూరి సన్నద్ధం చేశారు. వీరిద్దరివీ వేర్వేరు పాత్రలు. 90వ దశకంలో పార్టీ కీలక సమయంలో వీరిద్దరూ సీపీఐ (ఎం)కు ప్రాతినిధ్యం వహించారు. 70వ దశకంలో విద్యార్థి ఉద్యమం నుంచి ఎదిగిన వీరిద్దరూ జాతీయ నాయకులుగా ఆవిర్భవించారు.

**వామపక్ష స్థానాన్ని సుస్థిరం చేసి...**

జేఎన్‌యూలో లెజెండరీ ప్రొఫెసర్ కృష్ణ భరద్వాజ్ పర్యవేక్షణలో ఏచూరి విద్యను అభ్యసించారు. ఈ విశ్వవిద్యాలయంలోనే ఏచూరి, ప్రకాష్ కరత్ వామపక్ష రాజకీయాలలో రాటు దేలారు. విద్య, ఆరోగ్యం, అసమానతలకు సంబంధించిన అంశాలపై గళం విప్పారు. ఎమర్జెన్సీని ఎత్తివేసిన తర్వాత ఏచూరి వరుసగా మూడు సార్లు జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. కరత్, డీపీ త్రిపాఠీ వంటి వారితో కలిసి కొత్తగా ప్రారంభించిన విశ్వవిద్యాలయంలో వామపక్షాల స్థానాన్ని సుస్థిరం చేశారు.

---

# నవచిత్రం

## మనసున్న తల్లి కథ



సాత్విక్, సాహిత్య

ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథతో 'తల్లి మనసు' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మాతగా తొలిసారి సినీరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న చిత్రమిది. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులు. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవు తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం రెండు పాటలతో పాటు 80 శాతం పూర్తయింది.

ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల అనంత కిషోర్ మాట్లాడుతూ, 'ఇంకో పాటతో పాటు మిగతా టాకీ పార్ట్ చిత్రీకరించడంతో ఈ నెలాఖరుకు షూటింగ్ మొత్తం ముగుస్తుంది. మా నాన్న చిత్రాల స్థాయికి తగ్గట్టుగా చక్కటి కథ, కథనాలతో తీస్తున్న చిత్రమిది. ఇటువంటి కథాబలం ఉన్న మంచి చిత్రాన్ని తీస్తుండటం పట్ల సోషల్ మీడియాలో విశేషమైన స్పందన, అభినందనలు లభించటం ఆనందంగా ఉంది' అని తెలిపారు.

'ఫ్యామిలీ ప్రేక్షకులతో పాటు యూత్‌ను ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉంటుంది' అని చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య చెప్పారు. దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) మాట్లాడుతూ,'వాస్తవ జీవితానికి దగ్గరగా, ఓ మధ్య తరగతి తల్లి పడే తపన, సంఘర్షను ఇందులో ఆవిష్కరిస్తున్నాం' అని అన్నారు.



ఎన్టీఆర్, జాన్వీకపూర్

## హాలీవుడ్‌లో దేవర ప్రీమియర్

ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. దేవర రెండు భాగాలుగా రూపొందుతోంది. అందులో 'దేవర పార్ట్ 1'లోని సాంగ్స్ అన్నీ చార్ట్ బస్టర్‌గా నిలిచాయి. రీసెంట్‌గా ముంబైలో గ్రాండ్ లెవల్లో ట్రైలర్‌ను రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా ఈ ట్రైలర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అన్నీ భాషల్లో కలిపి మిలియన్స్ వ్యూస్‌తో ట్రైలర్ సెన్సేషన్ క్రియేట్ చేసింది. దీంతో ఇప్పటికే సినిమాపై ఉన్న అంచనాలు నెక్స్ట్ లెవల్‌కు చేరుకున్నాయి.

ఈ నేపథ్యంలో 'దేవర' ప్రీమియర్ షోను సెప్టెంబర్ 26 సాయంత్రం ఆరున్నర గంటలకు బియాండ్ ఫెస్ట్‌లో హాలీవుడ్, లాస్ ఏంజిల్స్‌లోని ఐకానిక్ ఈజిప్షియన్ థియేటర్‌లో ప్రదర్శించనున్నారు. బియాండ్ ఫెస్ట్ ఘనమైన సినిమా చరిత్రను కలిగిన ప్రతిష్టాత్మకమైన సినిమా వేదిక. ఇలాంటి వేదికలో రెడ్ కార్పెట్ ఈవెంట్ జరగటం గొప్ప విషయం. అలాగే ఇక్కడ ప్రీమియర్ కాబోతున్న తొలి భారతీయ సినిమాగా 'దేవర' అరుదైన ఘనతను సొంతం చేసుకుంది.

ఈ రెడ్ కార్పెట్ ఈవెంట్‌కు హాలీవుడ్‌కు చెందిన ప్రముఖ సినీ ప్రముఖులు హాజరు కాబోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 27న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది.

## మన్యం ధీరుడు రిలీజ్‌కి రెడీ

ఆర్.వి.వి. మూవీస్ పతాకంపై ఆర్.పార్వతీదేవి సమర్పణలో నరేష్ డెక్కల దర్శకత్వంలో ఆర్ వి వి సత్యనారాయణ నటించి, నిర్మించిన చిత్రం 'మన్యం ధీరుడు'. అల్లూరి సీతారామరాజు పాత్రలో ఆర్ వి వి సత్యనారాయణ అత్యంత అద్భుతంగా నటన ప్రదర్శించిన ఈ చిత్రాన్ని ఈనెల 20వ తేదీన విడుదల చేయబోతున్నారు.

అరుకు, పాడేరు, హిమాచల్‌ప్రదేశ్, కాశ్మీర్‌లోని అందమైన ప్రదేశాలలో చిత్ర నిర్మాణం పూర్తి చేసుకుంది. అల్లూరి సీతారామరాజు నిజ రూప చరిత్రను వెండి



ఆర్.వి.వి.సత్యనారాయణ

తెరపై ఆవిష్కరించడానికి ఆర్ వి వి సత్యనారాయణ గుర్రపు స్వారీ, కత్తి యుద్ధం, విలు విద్యలో శిక్షణ తీసుకున్నారు. యదార్థ సన్నివేశాలు, యదార్థ సంఘటనలు ప్రజలకి అందించాలనే సంకల్పంతో ఈ చిత్రాన్ని నిర్మించారు. బానిస సంకెళ్ళు తెంచుకుని బ్రిటీష్ తెల్ల దొరల పాలనకు చరమగీతం పాడే సన్నివేశాలు ఒళ్లు గగుర్పొడిచే విధంగా ఉంటాయి. ఈ చిత్రం కోసం భారీ ఖర్చుతో ఒక ఊరినే నిర్మించారు. అక్కడ చిత్రీకరించిన సాహసోపేత సన్నివేశాలు ఎన్నో మన కళ్ళకు కట్టినట్టు చూపించే చిత్రమిది.

అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే రీతిలో ఈచిత్రాన్ని తీర్చిదిద్దారు. ఈ సినిమా అందర్నీ మెప్పింస్తుందనే నమ్మకాన్ని చిత్ర బృందం వ్యక్తం చేసింది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ కుమార్, కెమెరా : వినీత్ ఆర్య, ఫరూక్, ఎడిటర్: శ్యామ్ కుమార్.

---

# ఆటలు

## రూ.25 లక్షల నజరానా

**బుచ్చిబాబు విజేత హైదరాబాద్‌కు భారీ ప్రైజ్‌మనీ : హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు**

నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ క్రికెట్ జట్టుకు హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శినపల్లి జగన్‌మోహన్ రావు భారీ నగదు బహుమతి ప్రకటించారు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఆల్ ఇండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ చాంపియన్‌గా అవతరించింది. గత రంజీ సీజన్‌లో ప్లేట్ డివిజన్‌లో అజేయ విజేతగా నిలిచిన హైదరాబాద్.. బుచ్చిబాబు టోర్నమెంట్‌లోనూ మేటి జట్లను చిత్తు చేసింది. గత సీజన్ నుంచి ఇప్పటివరకు అజేయ రికార్డును కొనసాగించింది. దీంతో సీనియర్ మెన్స్ జట్టుకు రూ. 25 లక్షల నగదు బహుమతి అందజేస్తున్నట్టు జగన్‌మోహన్ రావు ప్రకటించారు. 'సుదీర్ఘ విరామం అనంతరం హైదరాబాద్ జట్టు బుచ్చిబాబు టోర్నమెంట్‌లో విజేతగా నిలువటం సంతోషంగా ఉంది. గత సీజన్‌లో రంజీ ప్లేట్ చాంపియన్‌గా నిలిచాం. ఈ సీజన్లో రంజీ ఎలైట్ చాంపియన్‌గా నిలువాలనేది నా లక్ష్యం. క్రికెటర్లకు, సహాయక సిబ్బందికి అవసరైన సహాయ సహకారాలు హెచ్‌సీఏ అందించేందుకు సిద్ధంగా ఉంది' అని జగన్ అన్నారు. బుచ్చిబాబు ట్రోఫీతో హైదరాబాద్‌కు చేరుకున్న జట్టును శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఓ కార్యక్రమంలో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఘనంగా సత్కరించారు. క్రికెటర్లు, సహాయక సిబ్బందితో అధ్యక్షుడు జగన్, కార్యదర్శి దేవరాజ్ ప్రత్యేకంగ ముచ్చటించారు. భారత మాజీ క్రికెటర్, పేస్ దిగ్గజం వెంకటేశ్ ప్రసాద్, హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు, హెచ్‌సీఏ సీనియర్ సభ్యుడు ఆగమ్ రావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పవర్‌లిఫ్టర్ వంశీకి అభినందన

**శాట్జ్ చైర్మెన్ శివసేనా రెడ్డి**



**హైదరాబాద్ :** యూరప్‌లోపి మాల్టాలో ఇటీవల ముగిసిన ప్రపంచ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన తెలంగాణ పవర్‌లిఫ్టర్ మోడెం వంశీని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాట్జ్) చైర్మెన్ కే. శివ సేనారెడ్డి అభినందించారు. అక్టోబర్4 నుంచి దక్షిణాఫ్రికా వేదికగా జరుగనున్న కామెన్ వెల్త్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన వంశీకి ఆర్థిక సహాయంగా లెసినో ఫౌండేషన్ చైర్మన్ పట్నం అనూష రెడ్డి రూ. లక్ష చెక్ అందజేశారు. క్రీడా మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, శాట్జ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## టెక్నికల్ డెలిగేట్‌గా బాబులాల్



**హైదరాబాద్ :** తెలంగాణ త్వైక్వాండో క్రీడాకారుడు జె. బాబులాల్‌కు అరు దైన గౌరవం లభించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సౌత్ జోన్ క్రీడా పోటీలకు తెలంగాణ నుంచి బాబులాల్‌ను టెక్నికల్ డెలిగేట్‌గా ఎంపిక చేసింది. ఈ నెల 20 నుంచి 23 వరకు నాలుగు రోజుల పాటు మహారాష్ట్రలో జరిగే సౌత్ జోన్ 2 తైక్వాండో పోటీలకు బాబులాల్ సాంకేతిక ప్రతినిధిగా వ్యవహరించనున్నారు. సీబీఎస్ఈ స్పోర్ట్స్ హెడ్ మంజిత్ సింగ్ ఈ మేరకు ఓ లేఖలో సమాచారం అందించారు. సీబీఎస్ఈ క్రీడా పోటీలకు టెక్నికల్ డెలిగేట్‌గా ఎంపికైన బాబులాల్‌ను ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్లు లక్ష్మీ కాంత్‌రాథోడ్, జె.ప్రభాకర్‌రావు, రాజేశ్‌కుమార్, సునీల్‌కుమార్, దీప్లా తదితరులు అభినందించారు.

## ఇండియా-సి 525/10

**దులీప్ ట్రోఫీ మ్యాచ్**

**అనంతపురం :** దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా-సి భారీ స్కోరు చేసింది. ఇషాన్ కిషన్ (111), రుతురాజ్ (58), సాయి సుదర్శన్ (43), పాటిదార్ (40) సహా ఇంద్రజిత్ (78), మానవ్ (82), అన్షుల్ (38) మెరవటంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 525 పరుగులు చేసింది. ఇండియా-బి తొలి ఇన్నింగ్స్‌లో 124/0తో ఆడుతోంది. అభిమన్యు (51), జగదీశన్ (67) అజేయంగా ఆడుతున్నారు. ఇండియా-బి మరో 401 పరుగుల వెనుకంజలో నిలిచింది. ఇండియా-ఏ, ఇండియా-డి మ్యాచ్‌లో వికెట్ల జాతర సాగుతుంది. రెండో రోజు ఆటలో 13 వికెట్లు పడ్డాయి. ఇండియా-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకు ఆలౌట్ కాగా.. ఇండియా-డి తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగులే చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా-ఏ 115/1తో ఆడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-ఏ ప్రస్తుతం 222 పరుగుల ముందంజలో కొనసాగుతుంది.



## గ్రామీణ క్రికెటర్లకు న్యాయం చేస్తాం!

- శాట్జ్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి
- తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం లోగో ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్


దశాబ్దాలుగా తెలంగాణ గ్రామీణ క్రికెటర్లకు తీరని అన్యాయం జరిగింది. జిల్లా కేంద్రాల్లో క్రికెట్ మౌళిక సదుపాయాలు లేకపోవటంతో ప్రతిభావంతులైన తెలంగాణ గ్రామీణ క్రికెటర్లు కనీసం రాష్ట్ర స్థాయి పోటీలకు సైతం దూరమయ్యారు. తెలంగాణ గ్రామీణ క్రికెటర్లకు న్యాయం చేసేందుకు, జాతీయ స్థాయిలో అవకాశాలు అందిపుచ్చుకు నేందుకు తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) ఓ వేదిక కానుంది అని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్) మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. 'తెలంగాణ రాష్ట్రంలో ఆరు సంవత్సరాలు క్రీడాప్రాధికార సంస్థ చైర్మెన్‌గా పని చేశాను. శాట్జ్ చైర్మన్‌గా అన్ని క్రీడలను అభివద్ధి చేయాల్సిన నా బాధ్యత నాపై ఉండేది. నా హయాంలోనే తెలంగాణ నుంచి నిఖత్ జరీన్, ఇషా సింగ్, ఆకుల శ్రీజ, హుస్సాముద్దీన్, వ్రితి అగర్వాల్ వంటి చాంపియన్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటారు. అదేతరహాలో క్రికెట్ లోనూ తెలంగాణ నుంచి చాంపియన్లను తయారు చేసేందుకు తెలంగాణ డిస్ట్రిక్స్ క్రికెట్ అసోయేషన్‌ను ఆవిష్కరిస్తున్నాం. అందరి సహకారంతో త్వరలోనే బీసీసీఐ గుర్తింపు సాధించేందుకు ముందుకు సాగుతామని' వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన టీడీసీఏ లోగో ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు కె.వి. రమణాచారి సహా టీడీసీఏ ఆఫీస్‌బేరర్లు, జిల్లా స్థాయి క్రికెటర్లు పాల్గొన్నారు.

సంపాదకీయం

# తొలి సంవాదంలో ట్రంప్‌కు చావుదెబ్బలు!


కిందపడ్డా నేనే గెలిచా అని చెప్పుకొనే బాపతు గురించి తెలిసిందే. ఇప్పుడు అమెరికా ఎన్నికల్లో పోటీ పడుతున్న డోనాల్డ్ ట్రంప్ తీరు అలాగే ఉంది. తాను గెలవకపోతే ఓటమిని అంగీకరించేది లేదని చెబుతున్న పెద్ద మనిషి ఇప్పుడు సరికొత్త పల్లవి అందుకున్నాడు. అమెరికా ఎన్నికల్లో పోటీ పడుతున్న అధ్యక్ష అభ్యర్థులు బహిరంగ చర్చల్లో పాల్గొనటం ఒక ఆనవాయితీ. వాటిలో వారు చేసే ప్రసంగాలు కొంత మేరకు ఓటర్లను ప్రభావితం చేస్తాయి. మంగళవారం నాడు రిపబ్లికన్ అభ్యర్థి మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, ఉపాధ్యక్షురాలిగా ఉన్న కమలా హారిస్ చేతిలో తొలి సంవాదంలో చావుదెబ్బలు తిన్నట్లు సర్వేలు వెల్లడించాయి. కొందరైతే "ఓడినట్లు " కూడా చెప్పారు. ఏబిసి మీడియా నిర్వహించిన బహిరంగ చర్చ తరువాత ట్రంప్ కంటే కమల 23 పాయింట్ల ఆధిక్యతలో ఉన్నట్లు తేలింది. ఇవన్నీ మీడియాలో చర్చగా మారటంతో సంవాదాన్ని నిర్వహించిన ఏబిసి సంస్థ వీక్షకుల అభిప్రాయాన్ని తారుమారు చేసిందని, తానే ముందున్నట్లు ట్రంప్ ప్రకటించుకున్నాడు.గొప్ప చర్చ చేసినందుకుగాను ఓటర్లు తనకు మద్దతివ్వటం ప్రారంభించారని, సర్వేల్లో అదే వెల్లడైనా కుహనా మీడియా వాటిని వెల్లడించటం లేదు రిగ్గింగు చేసినట్లు గతంలో ట్విటర్‌నుంచి బహిష్కరించిన తరువాత పెట్టుకున్న స్వంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదిక మీద రాసుకున్నాడు.సిఎన్ఎన్, యు గవ్, సోకాల స్ట్రాటజీస్ అనే సంస్థల సర్వే ప్రకారం కమలకు 57,ట్రంప్‌కు 34శాతాల చొప్పున మద్దతిచ్చినట్లు ప్రకటించాయి. మరొక సిఎస్ఎస్ సర్వేలో 63-37శాతాలతో ఉన్నారు. ముదిమది తప్పినట్లుగా తొలుత డెమోక్రాట్ అభ్యర్థిగా ఉన్న జో బైడెన్ చర్చలో విఫలం కావటంతో అనేక మంది విమర్శించారు. ట్రంప్ పలుకుబడిలో ముందున్నట్లు విజయం సాధిస్తారని చెప్పారు. తరువాత జరిగిన హత్యాయత్నంతో గెలుపు ఖాయం అన్నారు. తీరా కమలా హారిస్‌ను రంగంలోకి దింపటంతో తొలి నుంచి ఆమె పోటా పోటీగా లేదా స్వల్ప మెజారిటీతో ఉన్నట్లు సర్వేలు తెలిపాయి.

> **ట్రంపే ఒక పెద్ద కంపు అనుకుంటే అతన్ని సమర్థిస్తున్న ఎలన్‌మస్క్ అంతకంటే సామాజిక మాధ్యమాల్లో ఉన్న అసహ్యకరమైన మనిషి అంటూ మస్క్ కుమార్తె వివియన్ జెనా విల్సన్ విరుచుకుపడింది. టేలర్ స్విఫ్ట్‌ను ఉద్దేశించి ఒక ఎక్స్ చేస్తూ " బాగుంది టేలర్..నేను నీకు ఒక బిడ్డను ఇస్తా... నా జీవితాంతం నీ కుక్కలకు కాపలా కాస్తా" అని పేర్కొన్నాడు. అమెరికా ఎన్నికల ప్రచారం ఎంతలా దిగజారి ఉంటుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.**




ప్రముఖులు, ఓటర్లను ప్రభావితం చేసే వారు ఎన్నికల్లో ఏదో ఒక పక్షాన్ని లేదా అభ్యర్థిని బలపరచటం సాధారణం, వారికి ఉన్న హక్కు. 'ఎక్స్' అధిపతి, ప్రపంచంలోనే పెద్ద కుబేరుడు ఎలన్‌మస్క్ ట్రంప్‌ను సమర్థిస్తున్నాడు. అదే విధంగా గాయని, నటి, రచయిత్రి టేలర్ స్విఫ్ట్ కమలాహారిస్‌ను బలపరుస్తున్నట్లు ప్రకటించింది.ట్రంపే ఒక పెద్ద కంపు అనుకుంటే అతన్ని సమర్థిస్తున్న ఎలన్‌మస్క్ అంతకంటే సామాజిక మాధ్యమాల్లో ఉన్న అసహ్యకరమైన మనిషి అంటూ మస్క్ కుమార్తె వివియన్ జెనా విల్సన్ విరుచుకుపడింది. టేలర్ స్విఫ్ట్‌ను ఉద్దేశించి ఒక ఎక్స్ చేస్తూ " బాగుంది టేలర్..నేను నీకు ఒక బిడ్డను ఇస్తా... నా జీవితాంతం నీ కుక్కలకు కాపలా కాస్తా" అని పేర్కొన్నాడు. అమెరికా ఎన్నికల ప్రచారం ఎంతలా దిగజారి ఉంటుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. టేలర్ వ్యతిరేకతను తట్టుకోలేని ట్రంప్ అందుకు తగిన మూల్యం చెల్లిస్తావంటూ బెదిరింపులకు పూనుకున్నాడు. అంతే కాదు కమలా హారిస్ మీద నోరు పారవేసుకుంటున్నాడు. ఆమెకు కమ్యూనిస్టు ముద్రవేసి ఎరుపంటే భయం ఉన్న ఓటర్లను తనవైపు తిప్పుకొనేందుకు చూశాడు. ఎన్నికలో పోటీ చేస్తున్న కారణంగా ఇటీవలనే ఆఫ్రికన్‌గా మారిందని జాత్యంహంకారాన్ని రెచ్చగొట్టాడు. విధానపరమైన అంశాల మీద చర్చలో ఆమెతో గెలవలేక ఇలాంటి చౌకబారు మాటలతో ఓట్లు రాబట్టుకోవాలని చూస్తున్నాడు. తొలి నాలుగు సంవత్సరాల పదవీ కాలంలో చేసిన నిర్వాకాలను చూసిన అమెరికన్లు రెండోసారి పదవిలోకి ఎన్నుకోకుండా బుద్ధి చెప్పినా మనిషిలో ఎలాంటి మార్పూ లేదు.నోరు లేనిదంటూ ట్రంప్ వర్ణించిన ఒక మహిళ ఒక బండరాయిలా చిదిమివేసిందని వాల్‌స్ట్రీట్ జర్నల్ రాసింది.తమనేత ఇలా చేశాడేమిటని సహాయకులే దిగ్భ్రాంతి చెందినట్లు, ఇక ట్రంప్ ప్రచారంలో పసలేదని తేలిందని రిపబ్లికన్ పార్టీ ఎన్నికల పండితులే పెదవి విరిచినట్లు కూడా విశ్లేషణలు వెలువడ్డాయి. ఎన్నికల సంవాదాలు ఒక సూచిక మాత్రమే. పోలింగ్ నవంబరు ఐదవ తేదీ గనుక ఇంకా చాలా సమయం ఉంది. ఈ లోగా జరిగే పరిణా మాలు కూడా ప్రభావం చూపుతాయి. ఒకటి మాత్రం ఖాయం, నల్లేరు మీద బండిలా తన విజయం ఖాయం అని గొప్పలు చెప్పుకున్న ట్రంప్‌కు అంతసీన్ లేదని వివిధ సందర్భాలలో తేలింది.అనూహ్య పరిణామాలు జరిగితే తప్ప ట్రంప్ గెలిచే అవకాశాలు లేవని చెప్పవచ్చు.

# తెలంగాణ రైతాంగ పోరాటం - కళా సాహిత్యాల వికాసం



నందిని సిధారెడ్డి



తెలంగాణ ప్రపంచ చరిత్రకు పరిచయమైంది రైతాంగ పోరాటంతోనే. బతుకులు ఎల్లీఎల్లని సామాన్యజనం బందూకులు పట్టి నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించిన సాయుధపోరాట చరిత్ర చరిత్రకెప్పుడూ సరికొత్తదే. అధ్యయనా నికెప్పుడూ ఉద్వేగ భరితమే. నిజాం, బ్రిటీష్, ప్రైవేట్ రజాకార్లు, గుండాల సైన్యాలకు వ్యతిరేకంగా, దేశ్‌ముఖ్‌లకు, జాగీర్దార్లకు, జమిందార్లకు తెలంగాణ దొరలకు వ్యతిరేకంగా వీరోచిత సమరం నడిపిన భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ సామాజిక పరిణామక్రమాన్ని ఆధునిక వెలుగుల వైపు పురోగమింపచేసింది. "భారత ప్రజాతంత్ర విప్లవానికి తెలంగాణ పోరాటం డ్రెస్ రిహార్సల్ వంటిది". అని వర్ణించాడు మాకినేని బసవపున్నయ్య.

తెలంగాణ రైతాంగ ఉద్యమ నిర్మాణంలో కళా సాహిత్యాల పాత్ర ప్రత్యేకమైంది. 'కాల్మొక్త బాంచెన్' అనేంతగా లొంగదీసుకున్న ఫ్యూడల్ వ్యవస్థను ఎదిరించేంతగా పేదజనాన్ని కూడగట్టటంలో, మేలుకొల్పటంలో సాహిత్యం, కళలు విశేషంగా వికసించాయి.పోరాటం ఎంత చరిత్రాత్మకమైందో కళాసాహి త్యాలు కూడా అంతగా చరిత్రస్థాయి నందు కున్నాయి. వర్త మానంలో కొన్ని కుసంస్కార శక్తులు తెలంగాణ పోరాట చరిత్రను తారుమారు చేసి, వక్రీకరించి, ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్న సందర్భంలో ఆ ప్రయత్నాల్ని విఫలం చేయగల ఆధారాల్లో కళాసాహిత్యాలే కీలకం. నిజాం సంస్థానం నాటి స్థితి గతులకు, క్రమ పరిణామాలకు అద్దం పట్టేవి, సాక్ష్యంగా నిలిచేవి చరిత్ర గ్రంథా లతో పాటు కళాసాహిత్య రూపాలే. చరిత్రను తమ కోణంలోంచి మార్చి తిరగ రాసుకోగలరేమో కాని - కళా సాహి త్యాల్ని మార్చటం, తిరగరాయటం ఎవరికీ సాధ్యం కాదు.


తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన గుర్తింపువల్ల వివిధ భాషల్లో ఉద్వేగ భరితమైన సాహిత్యం వెలువడింది. తెలుగు, ఉర్దూ, హిందీ, ఆంగ్ల, కన్నడ, మరాఠీ, మళయాళ భాషల్లో సాయుధ పోరాట ప్రభావంతో రచనలు రావడం విశేషం. తెలుగులో యాభైకి పైగా కథలు, పదహారు నవలలు, పదిహేను నాటకాలు, ఇరవైకి పైగా కవితా సంకలనాలు, నాలుగు కావ్యాలు, తొమ్మిది పాటల సంకలనాలు, ఎనిమిది బుర్రకథలు, కళాప్రదర్శనలు ముప్పయి దాకా ఆత్మకథలు వచ్చాయంటే పోరాటం యొక్క ప్రత్యేకత, నిరంతరత, ప్రజల ఆదరణ స్పష్టంగా తెలుస్తుంది. వీటన్నిటిని ఒక దగ్గర క్రోడీకరించడం, లోతుగా విశ్లేషించడం గతం నుంచి నడిచివచ్చిన పరిణామ క్రమాన్ని, కళాసాహిత్యాల్ని ఎప్పటికప్పుడు వర్తమానంలోకి ప్రసరింపజేయటం సులువైన పనికాదు.

> **నిజాం సంస్థాన కాలంలో ఫ్యూడల్ దొరల చేతుల్లో ప్రజలు పడిన బాధలు అన్నీఇన్నీ కావు. వేలాది ఎకరాల భూములు ఆధీనంలో ఉంచుకొని దేశముఖ్‌లు, జాగీర్దార్ల దౌర్జన్యాలకు లెక్కలేదు. గడీలకు బారాఖూన్ మాఫ్. పన్నెండు హత్యల వరకు అడిగేవాడు లేడు. భూమిలేమి, వెట్టిచాకిరి, అడ్డగోలులెవీ, రకరకాల మాల్గుజారి పన్నులు, షాదిపట్టి, సమర్తపట్టి, బైస్‌పట్టి, పుడితే, చస్తే పన్ను, చుట్టాలు వస్తే, పోతే పన్నులు తలచుకుంటేనే భయమేసే ఎనభై రకాల పన్నులు, వీటికి తోడు చదువులేకపోవటం నిజంగా చీకటి బతుకులు. అచ్చంగా బానిసజీవితాలు. భరించలేక రోదన. పంటచేను, పాడిఆవు, పడుచు బిడ్డ ఉంటే పాపం. అన్నీ దొరల పాలే. మనుషులు, కోళ్లు, గొర్లు, సరుకులు వెట్టి కింద సమర్పించుకోవాలి. "హైదరాబాద్ సంస్థానం బందిఖానాను పోలి ఉండేది" అని వర్ణించాడు రాజ్ బహదూర్ గౌర్.**

నిజాం సంస్థాన కాలంలో ఫ్యూడల్ దొరల చేతుల్లో ప్రజలు పడిన బాధలు అన్నీఇన్నీ కావు. వేలాది ఎకరాల భూములు ఆధీనంలో ఉంచుకొని దేశముఖ్‌లు, జాగీర్దార్ల దౌర్జన్యాలకు లెక్కలేదు. గడీలకు బారాఖూన్ మాఫ్. పన్నెండు హత్యల వరకు అడిగేవాడు లేడు. భూమిలేమి, వెట్టిచాకిరి, అడ్డగోలులెవీ, రకరకాల మాల్గుజారి పన్నులు, షాదిపట్టి, సమర్తపట్టి, బైస్‌పట్టి, పుడితే, చస్తే పన్ను, చుట్టాలు వస్తే, పోతే పన్నులు తలచుకుంటేనే భయమేసే ఎనబై రకాల పన్నులు, వీటికి తోడు చదువులేకపోవటం నిజంగా చీకటి బతుకులు. అచ్చంగా బానిసజీవితాలు. భరించలేక రోదన. పంటచేను, పాడిఆవు, పడుచు బిడ్డ ఉంటే పాపం. అన్నీ దొరల పాలే. మనుషులు, కోళ్లు, గొర్లు, సరుకులు వెట్టికింద సమర్పించుకోవాలి."హైదరాబాద్ సంస్థానం బందిఖానాను పోలి ఉండేది" అని వర్ణించాడు రాజ్ బహదూర్ గౌర్.

హైదరాబాద్ సంస్థానంలో 1921 లో మొదలైంది వెలుగు. భాషా చైతన్య ంతో 'ఆంధ్రజనసంఘం' ఏర్పడింది. ఆ క్రమంలో వర్తకసంఘం, రైతుసంఘం, గ్రంథాలయోద్యమం, అట్లావిస్తరించి 1930లో 'ఆంధ్ర మహాసభ' ఆవిర్భవిం చింది. వరుససభల్తో వరుస పనుల్తో అది 'సంఘం'గా ప్రజల గుర్తింపు పొందింది. మరొక పక్క ఆర్యసమాజం కార్యకర్తలు, ఆ వెనుక స్టేట్ కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీ సంస్థానంలో అడుగుపెట్టి ప్రజల్లో అల్లుకుపోయాయి. భువనగిరి సభలనాటికి 'ఆంధ్రమహాసభ'ను అతివాదులు అందుకున్నారు. కడవెండి ప్రజల ఊరేగింపులో దొడ్డికొమురయ్య అమరత్వం తర్వాత 'గుత్పలసంఘం' అవతరించింది. చిట్యాల అయిలమ్మ పోరాటం భూమీ, పంట స్వాధీనం చేసుకున్న తర్వాత ప్రజల్లో ధైర్యసాహసాలు వెల్లువెత్తాయి. కొద్దిరోజుల్లోనే సాయుధ పోరాటం ఊపందుకున్నది. ఎటువిన్నా ప్రజల్లో పోరాటపటిమ. ఎటుచూసినా జనబాహుళ్యంలో "సంఘం" ఒక్కటే. పశువుల కాపరిని "చదువెందుకు" అని అడిగితే - "చదువు సంఘం కరపత్రాలు చదువుకోవటానికి" అని సమాధానమిచ్చేంతగా సంఘం చైతన్య పరిచింది. "సంఘం" తెలంగాణ పోరాట సంకేతం.

ప్రజల్ని మేల్కొల్పటంలో, చైతన్య పరచటంలో, పోరాట భావనలు పెంపొందించటంలో పత్రికల పాత్ర స్మరించవలసిందే. ఒద్దిరాజు సోదరులు నడిపిన 'తెనుగు' పత్రిక, సురవరం ప్రతాపరెడ్డి సంపాదకత్వంలో వెలువడిన గోలకొండ పత్రిక, మందుమాల నరసింగరావు సంపాదకత్వంలో రయ్యత్, అడవి బాపిరాజు సంపాదకత్వంలో 'మీజాన్', షోయబుల్లాఖాన్ సంపాదకత్వంలో 'ఇమ్రోజ్' ఉర్దూపత్రికలు, కాకతీయ, భాగ్యనగర్, దేశబంధు, షౌకత్ ఇస్లాం వంటి పత్రికలు వార్తలు, వివరాలతో పాటు కథలు, కథనాలు, కవితలు, పాటలు ప్రచురించాయి. పత్రికల వైఖరి మీద కన్నెర్ర చేసిన ఉస్మానలీ 'ఎకరార్‌నామా' పద్ధతితోపాటు నిషేధ చట్టాలు తీసుకొచ్చాడు.




గస్తీనిషాన్-53, రాజద్రోహ నేరం, ప్రజారక్షణచట్టం, హైదరాబాద్ రక్షణచట్టం పేర్లతో కళా సాహిత్యాలను, పత్రి కలను, ప్రచురణ సంస్థలను, పుస్తకాలను నిషేధించాడు. అయినా సాహిత్యం ప్రజలను చేరుకున్నది. ప్రచురణలు ఆగలేదు. ప్రదర్శనలు ఆగలేదు.

అణాగ్రంథమాల అణాకొక గ్రంథం అందించింది. దేశోద్ధారక గ్రంథమండలి, ప్రత్యూష ప్రచురణలు, ఆంధ్రకేసరి గ్రంథమాల, స్వశక్తి గ్రంథమాల మరెన్నో సంస్థలు పుస్తకాలు ప్రచురించి ప్రజల్లోకి తీసుకెళ్లాయి. ఆంధ్ర సారస్వత్ పరిషత్ కవిసమ్మేళనాలు ప్రజలకు చేరువయ్యాయి.

**"ఓ నిజామూ పిశాచమా... నా తెలంగాణ కోటి రత్నాల వీణ", "రైతుదే-తెలంగాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబుదక్కునే"** అని దాశరథి అగ్నిధార కురిపించాడు. ఇది పండితుల్ని పామరుల్ని ఆకట్టుకున్నది. ప్రకృతి, పల్లెలు, కూలీలు, సహకరించక పోతే 'ప్రభువులెట్లా ఏలుతారో చూద్దామని' పొట్లపల్లి రామారావు పిలుపు నిచ్చాడు. నలుగురు కలిసిన దగ్గరల్లా పాటలు అల్లుకున్నాయి..**"పల్లెటూరి పిల్లగాడా, పసులగాచే మొనగాడా"** జీతగాళ్ల కన్నీటి గాథలు సుద్దాల హనుమంతు గానం చేశాడు. వెట్టి కథలు పాడుతుంటే ప్రజలు తమ కష్టాలు తడుముకుని, కారణాలు తెలుసుకున్నారు. ప్రజలు తండోపతండాలుగా కదిలారు. గడీలు విడిచిపెట్టి దొరలు పరారీ కాకతప్పలేదు. అప్పుడూ పాటే **"బండెనక బండికట్టి పదహారు బండ్లుకట్టి ఏ బండ్లెపోతవు కొడుకో, నా కొడుక ప్రతాపరెడ్డి"** అంటూ వెంటపడ్డారు జనం. పాటరాసిన యాదగిరి బండి యాదగిరయి బందూక్ పట్టాడు. కొమరయ్య అమరుడయ్యాడు. 'అమరజీవివి నీవు కొమురయ్యా' అని పాడుకున్నారు ప్రజలు. పోరాటం పెరిగిన కొద్దీ నిర్బంధం పెరిగింది. దొరలు నిజాముకు ఫిర్యాదయ్యారు. నిజాం సైన్యాలు, రజాకార్లు పల్లెల మీద పడ్డారు. గృహదహనాలకు, స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. **"నల్లగొండలో నాజీ శక్తుల నగ్న నృత్యమింకెన్నాళ్లు?"** అని కాళోజీ ధైర్యంగా పోలీసుల్ని నిలదీశాడు.

తెలంగాణలో జరుగుతున్న ప్రజాపోరాట ప్రకంపనలు పొరుగు రాష్ట్రాన్ని సైతం కుదిపివేశాయి. ఆరుద్ర 'త్వమేవాహం" రాస్తే కుందుర్తి "తెలంగాణ" రాశాడు. సోమసుందర్ "వజ్రాయుధం" ఝుళిపించాడు. గంగినేని వెంకటేశ్వరరావు స్వయంగా సాయుధపోరులో పాల్గొని యుద్ధరంగం నుంచి ప్రియురాలికి బహిరంగలేఖ రాస్తూ "మహావిప్లవ విజయోత్సవం నాడు మన వివాహ మహోత్సవం జరుపుదాం" అన్నాడు.

తెలంగాణ పోరాటాన్ని ఆవాహన చేసుకొని హరీంద్రనాథ్ ఆంగ్లంలో దీర్ఘ కవిత రాస్తే ఫైజ్ అస్మద్ ఉర్దూలో కవిత రాశా డు. మగ్దుం ఉద్యోగం విడిచి పోరాటంలో కలిసి తెలం గాణను కవిత్వీకరించాడు.గద్దెలింగయ్య సంకలనం చేసిన పాటల పుస్తకం 'క్రాంతిగీతాలు",మరాఠీ పాటల పుస్తకం "సావదా" రెండింటిని నిజాం ప్రభుత్వం నిషేధించింది. సుంకర సత్యనారా యణ రాసిన గెరిల్లా శతకాన్ని పోలీసులు ధ్వంసం చేశారు.

రైతాంగ పోరాట అవసరాలకనుగుణంగా ప్రజల్ని విప్లవీకరించడానికి ప్రదర్శనాకళలు ముందుకొచ్చాయి. తెలంగాణలో శారద కథ జానపద కళారూపం కథ మార్చి రేణికుంట రామిరెడ్డి అమరత్వాన్ని గానం చేశారు. శారద కాళ్ల రజాకార్ ఆకృత్యాలు వర్ణిస్తూ 'రజాకార్లు' కథ, ఆరుట్ల రామచంద్రారెడ్డి సాహసగాథ, కళగా ప్రదర్శించారు.

శారద కథ, జంగం కథ, జమాకుల కథ రూపాలు మేళవించి "బుర్రకథ" ముందుకొచ్చింది. సుంకర సత్య నారాయణ "కష్టజీవి", "తెలంగాణ" బుర్రకథలు రచించాడు. షేక్‌నాజర్ బుర్రకథకు కొత్త సొగసులు అద్ది కొత్త రాగాలు కూర్చి ఉన్నతీ కరించాడు. విశేషాదరణ లభించింది. 'బండ్లనిండాజనం' బుర్రకథను అటు మద్రాస్ ప్రభు త్వం, ఇటు నిజాం ప్రభుత్వం నిషేధించింది. తిరునగరి రామాంజనేయులు పోరాటంలో భాగస్వామిగా మారి దాన్ని "హరికథ"గా మార్చి "తెలంగాణ వీరయోధులు" కళారూపం ప్రదర్శించాడు. ఎక్కడికక్కడ సంచార రాజకీయ బృందాలు బయలుదేరి వివిధ కళారూపాలు రహస్య బుర్రకథలు ప్రదర్శించాయి.

సుంకర సత్యనారాయణ బుర్రకథ 'వీల్లేదుగనుక' నాటకరూపం రూపొందించాడు. "ముందడుగు" "మాభూమి" నాటకాలు రచించి ప్రదర్శింపజేశాడు. మాభూమి బందగీ ఇతివృత్తంతో మొదలై సంఘం అండతో యువకుల పోరాటం, అమరత్వంతో ముగుస్తుంది. 130 బృందాలు 'మాభూమి " నాటకాన్ని రెండువేల ప్రదర్శనలు ఇవ్వటం విశేషం. ఆ తర్వాత మరో పదిహేను నాటకాలు వచ్చాయి. అమిత ప్రజాదరణ పొందాయి. విలీనానంతరం నెహ్రూ పటేల్ సైన్యాలు మరింత విధ్వంసం సాగించాయి. నిరసనగా 'నెహ్రూ భారతం' నాటిక ప్రదర్శించారు.

తెలుగులో విద్యా పరిమితులను ప్రభావితం చేయటం కథ నవల ప్రధానమైనవి. పి.వి.నరసింహరావు 'గొల్లరామయ్య', ఆవుల పిచ్చయ్య "ఊరేగింపులు", "వెట్టిచాకిరి దినచర్య", కేశవ స్వామి "యుగాంతం", ఉప్పల లక్ష్మణ రావు 'గెరిల్లా', ఆళ్వారు స్వామి 'అంతా ఏకమైతే' వంటివి యాభైకి పైగా కథలు ప్రాచుర్యం పొందాయి. వట్టికోట 'ప్రజల మనిషి', 'గంగు', దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్లు', 'జనపదం', తిరునగరి రామాంజనేయులు 'సంగం', మహీధర రామ్మోహన్ రావు 'రథచక్రాలు', లక్ష్మీకాంతమోహన్ 'సింహగర్జన' నవలలు ప్రభావితమైనవి. ప్రఖ్యాత రచయిత కిషన్‌చందర్ ఉర్దూలో రచించిన 'జబ్ ఖేత్ జాగే' నవలకు తెలంగాణ పోరాటమే ఇతివృత్తం.

> **ప్రజల్ని మేల్కొల్పటంలో, చైతన్య పరచటంలో, పోరాట భావనలు పెంపొందించటంలో పత్రికల పాత్ర స్మరించవలసిందే. ఒద్దిరాజు సోదరులు నడిపిన 'తెనుగు' పత్రిక, సురవరం ప్రతాపరెడ్డి సంపాదకత్వంలో వెలువడిన గోలకొండ పత్రిక, మందుమాల నరసింగరావు సంపాదకత్వంలో రయ్యత్, అడవి బాపిరాజు సంపాదకత్వంలో 'మీజాన్', షోయబుల్లాఖాన్ సంపాదకత్వంలో 'ఇమ్రోజ్' ఉర్దూపత్రికలు, కాకతీయ, భాగ్యనగర్, దేశబంధు, షౌకత్ ఇస్లాం వంటి పత్రికలు వార్తలు, వివరాలతో పాటు కథలు, కథనాలు, కవితలు, పాటలు ప్రచురించాయి. పత్రికల వైఖరి మీద కన్నెర్ర చేసిన ఉస్మానలీ 'ఎకరార్‌నామా' పద్ధతితోపాటు నిషేధ చట్టాలు తీసుకొచ్చాడు.**

'చిల్లరదేవుళ్లు' నవల ఆధారంగా అదే పేరుతో వచ్చిన సినిమా, 'జబ్ ఖేత్ జాగే' ఆధారంగా బి. నరసింగరావు తీసిన 'మాభూమి' సినిమా, ఆర్.నారాయణ మూర్తి దర్శకత్వంలో వచ్చిన 'వీర తెలంగాణ' వంటివి తెలంగాణ పోరాట ఇతివృత్తంతో వచ్చి విజయవంతంగా ప్రదర్శించబడ్డాయి. బందూక్, జైబోలో తెలంగాణ, ఇంకెన్నాళ్లు, రాజన్న, మనసు మాంగళ్యం, సినిమాలలో పోరాటం పాక్షికంగా భాగమైంది. ఇటీవల 'రజాకర్' సినిమా పోరాట గాథను వక్రీకరించే ప్రయత్నం చేస్తే తిరస్కరించటం తెలంగాణ సమాజ పరిణతికి నిదర్శనం.

సాయుధ పోరాట కాలం నాటి అరుదైన సన్నివేశాల్ని, శిక్షణా దృశ్యాల్ని ప్రముఖ ఫొటో జర్నలిస్ట్ సునీల్ జనా ఛాయాచిత్రాల్లో ఎక్కించి శాశ్వతత్వం చేకూర్చాడు. ఇవాళ అందుబాటులో ఉన్న ఫొటోలు అవే. అదే విధంగా ప్రముఖ బెంగాలీ చిత్రకారుడు చిత్తప్రసాద్ భట్టాచార్య నాటి పోరాట దృశ్యాల్ని రేఖా చిత్రాలుగా రచించి మాస్కో, అండన్ మ్యూజియాల్లో భద్రపర్చాడు. కాగా-నాటి చిత్రకారుడు యం.రంగాచారి పోరాట చిత్రాలు గీస్తూ పార్టీ సంబంధాలు కొరియర్‌గా పనిచేస్తూ పట్టుబడి అమరుడయ్యాడు. ఆయన చిత్రాలు మాస్కోలో ఉన్నట్లు తెలుస్తున్నది. పోరాటం ఆగినా కళాసాహిత్యాలు ఆకట్టుకుంటూనే ఉన్నాయి. కళా సాహిత్యాలకు జీవం పోసి చారిత్రక విలువను సమకూర్చి పెట్టిన తెలంగాణ పోరాటం తెలుగుజాతికి గర్వకారణం.కళా ప్రమాణాలతో పోరాటానికి శాశ్వతత్వం చేకూర్చిన కళాసాహిత్యాలు జాతికి తరగని సంపద. ■

# మీరు కూడానా...చంద్రచూడ్?

గౌరవనీయులైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ గారికి,

మొన్న బుధవారం నాడు సాక్షాత్తు దేశ ప్రధాని మోడీ మీ ఇంటికి వచ్చి, మీతో పాటు గణేష్ పూజచేసి, హారతులు ఇచ్చినట్టు 'ఎక్స్'లో వచ్చిన వీడియో సందేశాన్ని దేశ ప్రజలందరూ చూశారు. ఈ సందేశం కూడా మీనుంచి గాక, ప్రధాని నరేంద్ర మోడీ ట్విట్టర్ హ్యాండిల్ నుంచి దేశ ప్రజలకు తెలిసింది. న్యాయం కోసం ఎదురుచూపులు చూసే అనేకమందికి ఆశ్చర్యాన్ని, అంతకుమించి దు:ఖాన్ని ఇది కలిగించింది.న్యాయవ్యవస్థ మీద అమితమైన విశ్వాసాన్ని చూపే కోట్లాదిమంది భారతీయులను అయోమయానికి గురిచేసింది. న్యాయవ్యవస్థను ఇంకెవ్వరూ ఈ విధంగా ఇంతవరకు కించపరచలేదనే భావన అనేకమంది బుర్రల్లో తలెత్తింది. అటువంటి ఆలోచన కలడానికి ఆస్కారం మీరు కల్పించారు. మీరు కూడా అటువంటి వీడియోనే పోస్ట్ చేశారేమోనని 'ఎక్స్'లో వెతికితే కనపడలేదు. ఈ సందర్భంలో ఇక్కడ కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



ఒకటి, మీరు ప్రధానిని మీ ఇంటికి ఆహ్వానించారా? లేక పిలవని పేరంటంగా తానే వచ్చారా అనే దాని మీద స్పష్టత లేదు. ఈ రెండిటి మధ్య ఉన్న తేడా మీకు అర్థమయ్యే ఉంటుంది.. స్వయంగా మీరు ఆహ్వానించివుంటే అది మీ తప్పు, పిలవకుండానే ప్రధాని వస్తే అది ఆయన తప్పు. రెండోది, న్యాయమూర్తి, ప్రధానమంత్రిని సాధారణంగా అధికారిక కార్యక్రమాల్లోనూ, అధికారిక సమావేశాల్లోనూ కలుసుకుంటారు. అంతేగాని, వ్యక్తిగత ప్రైవేట్ కార్యక్రమాల్లో కలుసుకోవడం జరగదు. అటువంటివి జరిగితే దేశానికి తప్పుడు సందేశం వెళ్తుందని మీకు తెలుసు. అంతెందుకు- మీరు రామ మందిరం ప్రారంభోత్సవానికి హాజరు కాలేదన్న విషయం దేశ ప్రజలందరి దృష్టిలో ఉంది. లౌకిక రాజ్యాంగాన్ని కాపాడే పదవిలో ఉన్న మీరు అటువంటి మత కార్యక్రమాలకు హాజరు కాకపోవటాన్ని అందరూ హర్షించారు. కానీ ఇప్పుడు ఎందుకిలా జరిగింది?మూడోది, గణేష్ పూజకు ప్రధాని మీ ఇంటికి రావడం చాలా గోప్యంగా జరిగింది. ప్రధానే స్వయంగా 'ఎక్స్'లో పోస్ట్ చేసేదాకా దేశప్రజలకు తెలియదు. ప్రధాని అధికారిక కార్యక్రమాలన్ని ముందుగానే నిర్ణయించబడి ప్రకటిస్తారు. కానీ ఈ సందర్భంలో అలా జరగలేదు. ఎందుకని?నాలుగు, ప్రధాని ఈ వీడియో బయట పెట్టిన తర్వాత రాజకీయ పార్టీలు, న్యాయవాదులు నిస్సంకోచంగా తమ అభిప్రాయాలు వెల్లడి చేశారు. కొంతమంది న్యాయవాదులు, ప్రతిపక్ష పార్టీలనాయకులు మిమ్మల్ని బాగా తప్పుపట్టారు.కానీ బీజేపీకి సంబంధించిన మంత్రులు, నాయకులు బహిరంగంగానే సంతోషం వ్యక్తం చేస్తున్నారు. న్యాయవ్యవస్థ తమకు అనుకూలంగా ఉండబోతుందనే సంకేతంగా వారు దీనిని తీసుకుని సంతోష పడటానికి కారణంగా కనపడుతున్నది. బీజేపీ జాతీయ కార్యదర్శి బి ఎల్ సంతోష్ - (ఈ వీడియో చూసి) ఇక వామపక్ష ఉదారవాదులకు(లెఫ్ట్ లిబరర్స్) ఏడుపు మొదలైంది అని ట్విట్టర్లో వ్యాఖ్యానించారు. వామపక్ష ఉదార వాదులంటే ఆయన ఉద్దేశంలో లౌకిక వాదులనే. ఈ సంఘటన దేశంపై ఎంత ప్రభావం చూపు తున్నదో సంతోష్ చేసిన ట్వీట్ చెబుతుంది. ఐదు, ఒక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాష్ట్ర ముఖ్యమంత్రితో రాసుకు పూసుక తిరిగితే దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా మీరేమంటారు? తప్పు అని చెప్తారా, లేదా? రేపటి నుంచి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో హైకోర్టు న్యాయమూర్తులు కూడా మీబాటలో నడిస్తే మీ సమాధానం ఏమిటి? సామాన్యుడు న్యాయాన్ని ఎక్కడ వెతుక్కోవాలి? న్యాయవ్యవస్థ మీద నమ్మకం అంటే న్యాయమూర్తుల మీద నమ్మకమే. దానిని మాజీ ప్రధాన న్యాయ మూర్తి రంజన్ గొగోయ్ వమ్ము చేశారు. మళ్లీ ఇప్పుడు మీ వల్ల అటువంటి విఘాతం కలగదు కదా.

లౌకిక రాజ్యాంగంలో మతోన్మాద ప్రభుత్వాన్ని కట్టడి చేయగలిగిన వాటిలో ఒకటి న్యాయ వ్యవస్థ. కానీ న్యాయవ్యవస్థే తన స్థాయిని తగ్గించుకుంటే దేశానికి పెద్ద ప్రమాదమే ముంచుకొస్తుంది. ఇప్పటికే కొన్ని తీర్పులు ప్రజల సామాజిక జీవనాన్ని ప్రమాదంలోకి నెట్టాయి. అటు వంటిది జరగకుండా ఉండాలంటే న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహ రించడమే మార్గం. ఆ మార్గాన్ని వీడరని, న్యాయ వ్యవస్థ లౌకిక రాజ్యాంగ పరిరక్షణలో ప్రజల పక్కన నిలబడు తుందని దేశ పౌరులుగా మేమందరం ఆశిస్తున్నాం.

ఇట్లు,

**న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంచిన కోట్లాదిమంది భారతీయులు**

# ఏ వెలుగులకీ పయనం?

- పైడిముక్కల ఆనంద్ కుమార్




ఏ దేశం ఏ కాలంలో
సాధించినదే పరమార్థం?
ఏ శిల్పం? ఏ సాహిత్యం?
ఏ శాస్త్రం? ఏ గాంధర్వం? - (శ్రీశ్రీ)

దేశ పురోగమనానికి బాటవేసేది విజ్ఞాన శాస్త్రమే. సైన్స్ నేర్చుకుంటే ప్రకృతికి అతీతమైన అతీంద్రియ శక్తులేవీ లేవని అర్థం కావాలి. ప్రకృతి సూత్రాలే ప్రపంచ గమనాన్ని, మనిషి మనుగడనూ నిర్ణయిస్తాయని అవగాహన కావాలి.మన దేశంలో సైన్స్ విద్యకు ప్రాధాన్యత ఉంది కానీ సైంటిఫిక్‌గా ఆలోచించడానికి ప్రాధాన్యత లేదు. విద్య నేర్చుకోవడానికి, విద్యాపరంగా ఆలోచించడానికి చాలా భేదం ఉంది. అబద్ధాలు చెప్పడం అపరాధమని చదువుకోవడం వేరు, ఆ ఆలోచనతో అబద్ధాలు చెప్పడం మానుకోవడం వేరు. చదువుకున్న సబ్జెక్టు నుంచి నిర్మాణాత్మకంగా మనం ఆలోచిస్తున్నామా అంటే కచ్చితంగా లేదు. ఎందుకిలా జరుగు తున్నది? సైన్స్‌లో పరిశీలన, ప్రశ్న ప్రశ్నకు సమాధానం ఊహించడం, ప్రయోగం, నిర్ధారణ లాంటి సోపానాలు ఉన్నాయి. వీటన్నింటినీ మన విద్యావిధానంలో బట్టీ పట్టి వాటిద్వారా పరీక్షలు ఉత్తీర్ణులయ్యే పద్ధతి మనం ఆచరిస్తున్నాం. ఇది సహజంగా ప్రశ్నను, తద్వారా ఊహను చంపేస్తుంది. ప్రయోగాలు చాలా పాఠశాలల్లో, కళాశాలల్లో జరగడమే లేదు. చివరకు చిన్నప్పటి నుంచీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడం అదృష్టంతో ముడి వేసి, చూచి రాతలు పరీక్షల్లో ఎక్కువవుతున్న సంఘటనలు చివరకు 'నీట్' పరీక్షల్లో సైతం కనపడుతున్నాయన్న విమర్శలు న్నాయి. గుణాత్మక విద్య కనుమరుగవు తున్నదని కార్పొరేట్ వ్యవస్థలు సైతం ఆరోపిస్తున్నాయి.

మనం కాస్త వెనక్కు వెళ్లితే అసలు మన సంస్కృతిలోనే పిల్లలు పుట్టిన ముహూర్తాలను బట్టి జాతకాలను రాయిస్తారు. పెళ్లిళ్లలో జాతకాలు కలిసే వరకూ జాగ్రత్తలు తీసుకుంటున్న సమాజం మనది. 'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని నన్నయ్య ఏ కాలంలో అన్నాడో గాని ఈ మాట మనం నమ్ముతాం. అభ్యుదయ భావాల గురజాడ 'మంచి గతమున కొంచెమేనోయ్/ మందగించక ముందుకడుగేయ్' అన్న మాట మనం పట్టించుకోం.పైగా మన దేశంలో సంపదలో 40శాతం కేవలం ఒకశాతం వున్న సంపన్నుల వద్ద పోగు పడిందని అంత ర్జాతీయ ఆర్థిక నివేదికలు చెబుతున్నాయి. మరి ఇటువంటి పరిస్థితుల్లో నిరుపేదలు సాంఘికంగా, ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటుంటే వారికి శాస్త్రీయ దృక్పథం అలవడే అవకాశం ఉండదు. తమ అదృష్టాన్ని వారు నిందించుకుంటారు.మనదేశంలో తగినన్ని అత్యాధునిక సాంకేతిక ప్రయోగశాలలు లేకపోవడం వలన చాలా మేధోవలసలు సంభవిస్తున్నాయి. భారత శాస్త్రవేత్తలు కొంతమంది విదేశాలకు తరలి పోతున్నారు. విదేశాలకు వెళ్లి అక్కడ స్థిరపడి నోబెల్ బహుమతులు గెలుచుకున్నారు.చాలా కాలం విదేశీయుల పాలనలో ఉన్నందున కూడా మనదేశంలో సైన్స్ ఒక సబ్జెక్టుగా వృద్ధి చెందలేదు.ఈ పరిస్థితుల్లో కొన్నింటిలోనైనా జోక్యం చేసుకుంటానికి సైన్స్ ప్రచార సంస్థలు ప్రయత్నం చేస్తున్నాయి. కొందరు శాస్త్రవేత్తలు, పరిశోధనా విద్యార్థులు కూడా దేశంలో సైంటిఫిక్ టెంపర్‌ని వృద్ధి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిల్లో జన విజ్ఞాన వేదిక అగ్రగామిగా ఉంది.

ముఖ్యంగా ఈమధ్య కాలంలో పర్యావరణ పరిరక్షణ, భూతాపం మొదలైన అంశాల మీద ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రయత్నం చేస్తున్నది. ప్రజారోగ్యం కోసం పలు సంస్థలతో కలిసి కరోనా సమయంలో సేవాకార్యక్రమాలు చేసింది. హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నది.కుహనా సైన్స్ వాదనలను బట్టబయలు చేస్తున్నది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొం దించడానికి క్విజ్ పోటీలు, చెకు ముకి సైన్స్ సంబరాలనే పేరుతో నిర్వహిస్తున్నది. విశ్లేషణాత్మక ఆలోచనలను విద్యార్థుల్లో పెంపొందించడానికి కృషి చేస్తున్నది. చెకుముకి సైన్స్ పత్రికను గత ముప్పై ఏళ్లుగా ప్రచురిస్తున్నది. విద్యావిధానంలో మార్పులు తీసుకురావడం కోసం ఉద్యమిస్తున్నది. ఒకవైపు సంఘ విద్రోహ శక్తులు కుల,మతాల పేరుతో విద్వేష బీజాలు నాటడాన్ని నిరోధించ డానికి ప్రయత్నాలు చేస్తున్నది. సైన్స్ ఫలాలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చి సైంటిఫిక్ టెంపర్ వ్యాప్తికి కార్యక్రమాలు చేస్తున్నది. తద్వారా సామాజిక అసమానతలను రూపుమాపడానికి కృషి చేస్తున్నది. ఈ కృషిలో అభ్యుదయకాముకు లందరూ భాగస్వాములవు తారని ప్రగాఢంగా విశ్వసిస్తున్నది.

**(సెప్టెంబర్ 14,15 మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసిఐఎల్‌లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు)**

# పత్రికా, భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం నిలబడ్డ ఏచూరి


(ఫైల్)

## వామపక్ష యోధుడు : డీయూజే

న్యూఢిల్లీ : సీపీ(ఐ)ఎం ప్రధాన కార్యదర్శి సీతారాం మృతి పట్ల ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (డీయూజే) సంతాపం వ్యక్తం చేసింది. ఎంపీగా, రాజకీయ కార్యకర్తగా, కాలమిస్టుగా, పీపుల్స్ డెమోక్రసీ, ది మార్క్సిస్ట్ సంపాదకులుగా సీతారాం ఏచూరి ఎల్లప్పుడూ పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం నిలబడ్డారని డీయూజే గుర్తు చేసుకుంది. అనేక సందర్భాల్లో జర్నలిస్టుల కాంట్రాక్టులీకరణ, మీడియా కార్పొరేటీకరణ.. వంటి సమస్యలను ఏచూరి ప్రస్తావించారని తెలిపింది. మీడియాపై, జర్నలిస్టులపైనా దాడి జరిగినప్పుడల్లా న్యాయం చేయాలని నిరసనలకు దిగారని గుర్తు చేసుకుంది.డీయూజేకు ఏచూరి మంచి స్నేహితుడని, డీయూజే నిర్వహించిన అనేక కార్యక్రమాలకు ఏచూరి హాజరయ్యారని తెలిపింది. జర్నలిస్టులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఈ సమస్యను డెట్ రికవరీ ట్రిబ్యునల్ (డిఆర్‌టి) వద్ద లేవనెత్తారని తెలిపింది.

ఏచూరి భార్య సీమా చిస్తి, కుమార్తె అఖిల, కుమారుడు దానిష్, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులుకు డీయూజే హృదయపూర్వక సానుభూతి తెలిపింది.

ఏచూరి మృతి దేశంలోని అభ్యుదయ, ప్రజాస్వామ ఉద్యమాలకే కాకుండా, కార్మిక సంఘాలకు, కార్మికులకు, రైతులకు తీరని లోటని డీయూజే స్పష్టం చేసింది. కాగా, సీతారాం ఏచూరికి నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఎజె) కూడా నివాళిలర్పించింది.

# టెట్ మార్కుల సవరణకు సాంకేతిక సమస్య

- వెంటనే పరిష్కరించాలి : డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ)కి దరఖాస్తు చేసిన అభ్యర్థులు టెట్ మార్కుల సవరణకు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఆందోళన చెందుతున్నారని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. దీంతో టెట్ మార్కులను సవరించుకోవడానికి అవకాశం లేదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది సవరించుకున్నా ఇప్పుడు పాత టెట్ మార్కులే కనిపిస్తున్నాయని వివరించారు. ఇంకోవైపు టెట్ రాతపరీక్షల తేదీలు తప్పుగా చూపిస్తున్నాయని తెలిపారు. సీటెట్ వివరాలు తప్పుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఓ అభ్యర్థి ఈనెల రెండున డీఎస్సీ దరఖాస్తును పరిశీలిస్తే టెట్‌లో 129 మార్కులు వచ్చాయని తెలిపారు. తాజాగా మూడు రోజుల క్రితం చూస్తే అదే అభ్యర్థి మార్కులు 91 చూపిస్తున్నాయని వివరించారు. ఇలా దీంతో వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారని వివరించారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు స్పందించి టెట్ సవరణ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# రెండు చోట్లా కాంగ్రెస్ ప్రభుత్వాలే

- సచిన్ పైలట్

జైపూర్ : జమ్ము కాశ్మీర్, హర్యానా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలే కొలువుదీరుతాయనిరాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత సచిన్‌పైలట్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'హర్యానా, జమ్ముకాశ్మీర్ రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు భారీ మెజారిటీతో విజయం సాధిస్తాయి. ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తాయి' అని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బిజెపికి ఓటమి తప్పదని ఆయన జోస్యం చెప్పారు. హర్యానాలో తన ఓటమిని ముందే గ్రహించి బిజెపి లోక్‌సభ ఎన్నికలకు కొన్ని రోజుల ముందే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని మార్చిందని పేర్కొన్నారు. బిజెపి ఎన్ని ప్రయత్నాలు చేసినా..ఆ పార్టీకి ఓటమి ఇప్పటికే ఖరారు అయ్యిందని, హర్యానా రాజకీయాలను చూస్తే.. అక్కడ కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరడం ఖాయమని సచిన్ తెలిపారు.

# శ్రీవిజయపురంగా పోర్ట్‌బ్లెయిర్

- పేరు మార్చిన కేంద్రం

న్యూఢిల్లీ : అండమాన్, నికోబార్ దీవుల రాజధాని పోర్ట్‌బ్లెయిర్ పేరు శ్రీవిజయపురంగా కేంద్ర ప్రభుత్వం మార్చింది. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. 'వలసవాద ముద్రల నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యొక్క దార్శనికతతో ప్రేరణ పొంది, ఈ రోజు మనం పోర్ట్ బ్లెయిర్‌ను 'శ్రీవిజయపురం'గా మార్చాలని నిర్ణయించుకున్నాం' అని ఎక్స్ పోస్టులో అమిత్ షా తెలిపారు.











# జోక్యం చేసుకోండి

- రాష్ట్రపతి, ప్రధానికి

జూనియర్ డాక్టర్ల విజ్ఞప్తి

కొల్‌కతా : ఆర్‌జి కర్ ఆసుపత్రిలో హత్యాచారం కేసులో నెలకొన్న ప్రతిష్టంభనపై జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇద్దరు నాయకులకు పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ లేఖ రాసింది. నాలుగు పేజీల ఈ లేఖ కాపీలను ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాకు కూడా పంపారు. 'అత్యంత హేయమైన నేరానికి గురైన మా సహోద్యోగికి న్యాయం జరగాలనే ఉద్దేశ్యంతో దేశాధినేతలు, గౌరవనీయులైన మీ దృష్టికి ఈ సమస్యను తీసుకొచ్చాం. అలాగే పశ్చిమ బెంగాల్ ఆరోగ్య విభాగం కింద పనిచేసే ఆరోగ్య రంగ నిపుణులైన మేము భయం, ఆందోళన లేకుండా ప్రజలకు మా విధులు నిర్వర్తించేలా చూడాలి' అని లేఖలో కోరారు. 'ఈ కష్ట సమయాల్లో మీ జోక్యం మాకు వెలుగునిస్తుంది. మా చుట్టూ ఉన్న చీకటి నుంచి బయటపడే మార్గాన్ని చూపుతుంది' అని లేఖలో తెలిపారు. ఆగస్టు 9న ఆర్‌జి కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుంచి వైద్యులు సమ్మెలో ఉన్నారు. సమ్మె విరమించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా వైద్యులు సమ్మె కొనసాగిస్తున్నారు. తమ డిమాండ్లకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అంగీకరించకపోవడంతో చర్చలకు కూడా వైద్యులు నిరాకరిస్తున్నారు.కాగా, మరోవైపు ఈ కేసును ప్రస్తుతం సిబిఐ విచారణ చేస్తోంది. అయితే ఇప్పటికీ విచారణ ఒక కొలిక్కి రాలేదు.

# ఆరుగురు బ్రిటీష్ దౌత్యవేత్తలపై వేటు

## గూఢచర్యం, విధ్వంసక చర్యల ఆరోపణలపై రష్యా బహిష్కరణ

మాస్కో : గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఆరుగురు బ్రిటీష్ దౌత్యవేత్తను రష్యా బహిష్కరించింది. బ్రిటన్ ఎంబసీ సిబ్బంది గూఢచర్యం, విధ్వంసకర కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌బి) పేర్కొంది. రష్యా సుస్థిరతకు విఘాతం కలిగిస్తూ, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు రెచ్చగొట్టే కార్యకలాపాల్లో బ్రిటన్ చురుకుగా పాల్గొంటోందని విమర్శించింది. ఈ మేరకు ఎఫ్ఎస్‌బి ఒక ప్రకటన జారీ చేసింది. అంతర్జాతీయ సైనిక-రాజకీయ పరిస్థితులను రెచ్చగొట్టడంలో లండన్ పాత్రను ధృవీకరిస్తూ తమకు కొన్ని పత్రాలు లభించాయని తెలిపింది.

అలాగే రష్యాను వ్యూహాత్మకంగా ఓడించే ప్రయత్నంలో భాగంగా రష్యాలో విధ్వంసకర విధానాలకు బ్రిటన్ మద్దతిస్తోందని పేర్కొంది. తూర్పు యూరప్, సెంట్రల్ ఆసియా డైరెక్టరేట్ (ఇఇసిఎడి)లో విదేశీ, కామన్వెల్త్ కార్యాలయం ఈ కార్యకలాపాలన్నింటికీ నాయకత్వం వహిస్తోందని ఎఫ్ఎస్‌బి పేర్కొంది. ఉక్రెయిన్ ఘర్షణలు ప్రారంభమైన తర్వాత, మాస్కోకు వ్యతిరేకంగా పనిచేసే స్పెషల్ సర్వీస్‌గా ఇఇసిఎడి మారిపోయిందని ఎఫ్ఎస్‌బి పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆ కార్యాలయం కింద బ్రిటన్ దౌత్యవేత్తల కార్యకలాపాలు భద్రతా ముప్పుగా పరిగణిస్తున్నట్లు రష్యా తెలిపింది. ఈ నేపథ్యం, పైగా బ్రిటన్ అనుసరించే ఘర్షణాయుత చర్యలను పరిగణనలోకి తీసుకుని మాస్కోలోని బ్రిటీష్ ఎంబసీలో రాజకీయ విభాగంలోని ఆరుగురు ఉద్యోగుల అక్రిడిటేషన్లను రద్దు చేసినట్లు మాస్కో అధికారులు ప్రకటించారు. త్వరలోనే వారి కార్యాలయాలను కూడా తొలగించాలని కోరనున్నట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌బి వాదనను రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జకరోవా పూర్తిగా సమర్థించారు. 'మా ప్రజలకు హాని కలిగించేలా వారి చర్యలు వుంటున్నాయి.' అని ఆమె బ్రిటీష్ దౌత్యవేత్తలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వంలో సెప్టెంబర్ 23న నిరసన

- కార్యక్రమాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 23న బ్లాక్ డేను విజయవంతం చేయాలని పలు కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాల్లో భాగంగా అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు పార్లమెంటులో ఏలాంటి చర్చ లేకుండా తీసుకొచ్చి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరుస్తూ కార్మికులకు ఉన్న కనీస హక్కులను కాలరాయటాన్ని తీవ్రంగా నిరసనగా ఈ బ్లాక్ డేను పాటిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, నాయకులు వెంకటేష్, హెచ్ఎంఎస్ నాయకులు రెబ్బా రామారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.కె.బోస్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు వి.నాగేశ్వరరావు, బీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రాంబాబులు మాట్లాడుతూ కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిరచాలని కోరారు.

# 17న శెలవు

## నవంబర్ 9 వర్కింగ్ డే

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గణేష్ నిమజ్జనం సందర్భంగా ఈనెల 17వ తేదీని శెలవుదినంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలకు ఈ శెలవు వర్తిస్తుంది. దీనికి ప్రత్యామ్నాయంగా నవంబర్ 9వ తేదీ రెండో శనివారంను వర్కింగ్ డేగా ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.



## డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించాలి

- సాగు నీరందించే వరకు పోరాటం : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం
- చండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు

**నవతెలంగాణ- చండూరు**

డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించాలని, పర్యావరణ, అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగునీరు అందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల పరిధిలో సుమారు 3.41 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారన్నారు. సింగరాజుపల్లి, గొట్టిముక్కుల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్న గూడెం రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతున్నదన్నారు. గత ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించలేదని, పర్యావరణ అనుమతుల కోసం లేఖ రాయలేదని తెలిపారు. డిండి ఎత్తిపోతల పథకానికి డీపీఆర్ ఆమోదింపజేసి, అధిక నిధులు కేటాయించి ప్రాజెక్టును పూర్తి చేసేవరకు సీపీఐ(ఎం) దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మోగుదాల వెంకటేశం, మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ గౌడ్, సీనియర్ నాయకులు చిట్టి మల్ల లింగయ్య, నాయకులు బల్లెం స్వామి, రాసాల బుగ్గయ్య, రాములు, అంజయ్య, గాలెంక నరేష్, నవీన్, వెంకన్న పాల్గొన్నారు.

## ఏచూరికి ఐప్సో నివాళి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సీపీఐ (ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం(ఐప్సో) ఘనంగా నివాళి అర్పించింది. హైదరాబాద్ ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సీతారాం ఏచూరి సంతాప సమావేశం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు జి.రఘుపాల్ అధ్యక్షతన జరిగింది. ఐప్సో జాతీయ నాయకులు, మాజీ ఎంఎల్ కె.యాదవరెడ్డి, మైనార్టీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామరాజు, కార్యదర్శి జె.కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు, వినోద్, రామచంద్రారెడ్డి, పిఎస్ మూర్తి, సూర్యప్రకాశ్ తదితరులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ శాంతికి విశేష కృషి చేసిన సీతారాం ఏచూరి మరణం శాంతి ఉద్యమాలకే కాకుండా పేద ప్రజలు, వామపక్షవాదులకు తీరని లోటని తెలిపారు. ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఓబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ప్రపంచంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై పూర్తి అవగాహన కలిగిన గొప్ప మేధావి సీతారాం ఏచూరి అని కొనియాడారు. సమాజ శాంతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి భౌతికంగా దూరం కావడం చాలా విచారకరమని కెవిఎల్ అన్నారు. అగస్టు 17న ప్రపంచ శాంతి ఉద్యమ యోధులు రమేశ్‌చంద్ర పీస్ అవార్డును అందుకున్న సీతారాం ఏచూరి జాతీయ అంతర్జాతీయ పరిస్థితులతో పాటు ప్రపంచ శాంతి ప్రాధాన్యతకు సంబంధించి ఆయన చేసిన ప్రసంగం చివరిది అవుతుందని ఎవరూ ఊహించలేదన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పనిచేసిన ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిదని కొనియాడారు.

## మృత శిశువుల జననాలు తగ్గించాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫారసు చేస్తాం : ఎస్‌బీఎస్‌ఐ, ఎఫ్‌హెచ్ఈఆర్ఎఫ్



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

దేశంలో, రాష్ట్రంలో మృత శిశు జననాల సంఖ్యను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సూచనలు చేయనున్నట్టు స్టిల్ బర్త్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఎస్‌ఐ), ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఫ్‌హెచ్ఈఆర్ఎఫ్) ప్రకటించాయి. ఎస్‌బీఎస్‌ఐ, ఎఫ్‌హెచ్ఈఆర్ఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో రెండో వార్షిక స్టిల్ బర్త్ సొసైటీ ఆఫ్ ఇండియా సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సు మూడు రోజుల పాటు జరగనుండగా 200 మందికిపైగా ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విధాన రూపకర్తలు, పరిశోధకులు, కమ్యూనిటీ న్యాయవాదులు చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో స్టిల్‌బర్త్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ నీలమ్ అగర్వాల్, ఆ సొసైటీ ఉపాధ్యక్షుడు, ఫెర్నాండెజ్ ఆస్పత్రి అత్యవసర ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ నుజాత్ అజీజ్ తదితరులు మీడియా సమావేశం మాట్లాడారు. 2030 నాటికి మృత శిశువుల జనన రేటును దేశంలో 10కి తగ్గించడమే సదస్సు లక్ష్యమని తెలిపారు. ఈ మేరకు సదస్సు ప్రతిజ్ఞ చేసిందన్నారు. ప్రస్తుతం ఈ రేటు 13.9గా ఉందని తెలిపారు.

## సీఎం సహాయనిధికి...

## డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీ రూ.5 కోట్లు విరాళం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ముఖ్యమంత్రి సహాయనిధికి డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీ రూ.5 కోట్లు విరాళంగా అందజేసింది. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ల్యాబోరేటరీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.నారాయణరెడ్డి చెక్కును అందజేశారు. వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్స్ రూ.కోటి విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధి ఆర్.సుదర్శన్ రెడ్డి, ఏ.పీ.సంజయ్ రెడ్డి సీఎంకు చెక్కును అందజేశారు. ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఎండీ మహేష్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిని కలిసి రూ.కోటి చెక్కును అందజేశారు. నందమూరి బాలకృష్ణ తరఫున రూ.50 లక్షల చెక్కును ఆయన కూతురు తేజస్విని అందజేశారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసిన వెక్సెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు ప్రవీణ్ కె.పూల రూ.50 లక్షల విరాళం అందజేశారు.

## గుండె సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు

- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

గుండె సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్టు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. వారం రోజుల పాటు ఈ నెల 22 నుంచి 28 వరకు ఆస్పత్రిలోనే పీడియాట్రిక్ డాక్టర్ రమణ దన్నపనేని ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యూకేలో స్థిరపడిన డాక్టర్ రమణ దన్నపనేని ఆధ్వర్యంలో ప్రతీ ఏటా వారం రోజుల పాటు నిమ్స్ భాగస్వామ్యంతో గుండె సమస్యలున్న చిన్నారులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్నట్టు తెలిపారు. గుండెకు రంధ్రం, ఇతర గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు ఎవరైనా ఆస్పత్రికి వచ్చి ఉచితంగా చికిత్స పొందేందుకు ఆస్కారం ఉందని స్పష్టం చేశారు. గుండె సమస్యలున్న చిన్నారులుంటే పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రి కార్డియో థొరాసిక్ వైద్యుల్ని సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

# ఫార్మా విలేజ్‌తో మంజీరకు ముప్పు?

(మొదటిపేజీ తరువాయి)



గ్రామాలు, మెదక్ జిల్లాల్లోని 946 గ్రామాలకు మంజీరా నదీ జలాలనే మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్నారు. సింగూరు బ్యాక్‌వాటర్, ప్రాజెక్టుతో పాటు వందలాది చెరువుల్లో మత్స్య సంపద ఉత్పత్తి అవుతుంది. ఫార్మా సిటీ ద్వారా వెలువడే కాలుష్య వ్యర్థ రసాయన జలాలు చేరితే మంజీరా మరింత కాలుష్య కోరల్లో చిక్కి కనీసం నోట్లో పోసుకునేందుకు కూడా నదీ జలాలు పనికిరాకుండా పోతాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. న్యాల్‌కల్, ఝరాసంఘం, రాయికోడ్ ప్రాంతాల్లో 12 వేల ఎకరాల్లో నిమ్జ్ పేరిట పరిశ్రమల కోసం భూ సేకరణ చేశారు. జహీరాబాద్ ప్రాంతంలో తాజాగా కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ ఇండస్ట్రీయల్ పార్క్‌ను నెలకొల్పాలని ఎంపిక చేసింది. ఇదే ప్రాంతంలో ఫార్మా విలేజీని కూడా ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. అంతేకాదు, మంజీరా నది ఎగువన వేల ఎకరాల్లో ఫార్మా, రసాయన, బల్క్ డ్రగ్స్ కంపెనీలకు అనుమతులిస్తే మంజీరా జలాలు విషపూరితం అయ్యే ప్రమాదముంది.



**ప్రమాదపుటంచులోకి 'మంజీరా అభయారణ్యం'**

మంజీరా నది పక్కనే రాంసర్ గుర్తింపుతో ప్రపంచ స్థాయిలో ప్రాధాన్యత సంతరించుకున్న మంజీరా అభయారణ్యముంది. ఇటీవలే కేంద్ర బృందాలూ పర్యటించాయి. 20 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం, 9 ద్వీపాలతో ఉన్న వన్యప్రాణి అభయారణ్యంలో 303 రకాల పక్షులు, 117 రకాల వలస పక్షులు, 14 జాతుల ఉభయచరాలు, 57 జాతుల చేపలు, 32 రకాల సీతాకొక చిలుకలు, 25 రకాల ఆకేశరుకాలు, 31 రకాల సరీసృపాలున్నాయి. వీటితో పాటు రాతికట్టడాలతో కూడి పురాతన దేవాలయాలు పర్యాటక క్షేత్రంగా ఉన్నాయి. కంపెనీలొస్తే అభయారణ్యం ఆనవాళ్లే మారే ప్రమాదముందనేది ప్రకృతి ప్రేమికుల ఆందోళన.

**సమీక్ష జరిగింది: విజయ్‌కుమార్, ఐబీ ఈఈ**

ఫార్మా విలేజ్ ఏర్పాటు వల్ల మంజీరా నదికి ఏమైన ప్రమాదం ఉంటుందా.. అనే అంశంపై ఇప్పటికే సమీక్ష జరిగింది. ఫార్మా విలేజీ ఇక్కడ ఏర్పాటు చేసే విషయం గురించి పూర్తి స్థాయి స్పష్టత రాలేదు.

**ఫార్మా సిటీ వల్ల మంజీరకు ముప్పే**

ఫార్మా విలేజ్ వస్తే అధిక మొత్తంలో కాలుష్య వ్యర్థాలు వెలువడుతాయి. వాటిని శుద్ధి చేసే విషయంలో నిర్లక్ష్యం జరిగితే మంజీరాకు తీరని ముప్పు తప్పదు. ఇప్పటికే పాత పరిశ్రమల వ్యర్థాలతో కలుషిత జలాలు మంజీరలో కలుస్తున్నాయి. ప్రభుత్వం పునరాలోచించాలి.

- మాణిక్యరావు, ఎమ్మెల్యే, జహీరాబాద్

# ప్రతిభను గుర్తించి గౌరవించాలి

### పొన్నం సత్తయ్యగౌడ్ పురస్కారాల ప్రదానంలో వక్తలు

**నవతెలంగాణ-కల్చరల్**

ప్రతిభకు తగిన గుర్తింపు ఇచ్చి గౌరవించటం ఉత్తమ సంప్రదాయమని పొన్నం సత్తయ్యగౌడ్ పురస్కారాల ప్రదానోత్సవంలో ప్రముఖులు అన్నారు. కనిపెంచిన తల్లిదండ్రులు మృతిచెందినా వారిని స్మరించుకోవడం బాధ్యత అని చెప్పారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో పొన్నం సత్తయ్యగౌడ్ 14వ వర్ధంతి సందర్భంగా ఆయన పేరిట జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు. శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని గీత రచయిత చంద్రబోస్‌కు, శారద కథలు కళాకారులు, బలగం సినిమా ఫేం కొమురమ్మ, మొగులయ్యకు పురస్కారాలు బహూకరించారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. కుమారులు ప్రయోజకులు కావాలని తల్లిదండ్రులు కోరుకుంటారని.. సత్తయ్యగౌడ్ అలాగే ఆశించారని, ఆయన కుమారులు మంచి స్థాయికి ఎదిగారని తెలిపారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నాడు ఉండేదని.. నేడు అది లేకపోవడంతో ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు. బలగం సినిమా తెలంగాణను అద్దంలో చూపిందని చెప్పారు. శారద కథల కళాకారులకు సహాయం అందిస్తామని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సత్తయ్య గౌడ్ పిల్లలు మానవ విలువలు,



కుటుంబ అనుబంధాలు తెలిసిన వారని చెప్పారు. అవార్డ్ గ్రహీతల ఎంపిక సరైన నిర్ణయం అని అభినందించారు. ట్రస్ట్ నిర్వాహకులు పొన్నం రవి చంద్ర స్వాగతం పలుకుతూ.. తండ్రి సత్తయ్యకు పాటలు, రచయితలంటే మక్కువ అన్నారు. అవార్డుగా ఒక్కొక్కరికి రూ.51వేలు, జ్ఞాపిక అందిస్తున్నామని తెలిపారు. వేదికపై మంత్రి పొన్నం ప్రభాకర్ పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొగులయ్య, కొమురమ్మకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తన వేతనం నుంచి లక్ష రూపాయలు ప్రకటించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఉపకార వేతనం మంజూరు చేయిస్తానని తెలిపారు.

# గణేష్ నిమజ్జనం విజయవంతానికి సహకరించాలి

### నిమజ్జనాల సందర్భంగా రాజకీయ ర్యాలీలకు అనుమతి లేదు



- శాంతి భద్రతలను కాపాడటంలో కఠినంగా వ్యవహరిస్తాం
- అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి : రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

హైదరాబాద్ జంట నగరాల్లో గణేష్ నిమజ్జనం ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో విజయవంతం అయ్యేలా ప్రజలందరూ సహకరించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ ఆనంద్‌తో కలిసి మంత్రి మాట్లాడారు. ఈ నెల 17న నిమజ్జన వేడుకలు రాజకీయాలకతీతంగా ప్రశాంత వాతావరణంలో జరగాలని, ఆ దిశగా ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. గణేష్ నవరాత్రి వేడుకల సందర్భంగా ఇప్పటికే ముఖ్యమంత్రి సూచనల మేరకు ఉన్నతాధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో జంట నగరాల్లో జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించారన్నారు. జంట నగరాల్లో ఎక్కడా ట్రాఫిక్‌కి ఇబ్బంది కలగకుండా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని, నిమజ్జన వేడుకల్లో ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులుంటే పోలీస్, రెవెన్యూ శాఖలకు సత్వరమే తెలపాలని ప్రజలకు సూచించారు. శాంతి భద్రతల విషయంలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారమందించాలని కోరారు. 16న జరుపుకోవాల్సిన 'మీలాద్ ఉన్ నబీ' పండుగను ముస్లిం మత పెద్దలు 19న చేసుకునేందుకు అంగీకరించినట్టు మంత్రి తెలిపారు. హైదరాబాద్ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని,పండుగ నేపథ్యంలో ఎక్కడైనా అలజడులు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. స్వేచ్ఛగా మంచి వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరగాలన్నారు. సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే, అపోహలు సృష్టించే వారిని ఉపేక్షించేది లేదన్నారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జన వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి విధివిధానాలపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. బాలాపూర్, ఖైరతాబాద్‌లో భారీ విగ్రహాలు ఉండటంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నిమజ్జనం సందర్భంగా శాంతి భద్రతల నిర్వహణలో పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. మొత్తం.. 15 వేల మంది, ఇతర జిల్లాల నుంచి 3 వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. మరో 8 వేల మంది పోలీసులను విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు.


ట్రాఫిక్ ఇబ్బందులు పడకుండా మళ్లింపు చర్యలు తీసుకుంటామని, ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి కరెంటోళ్లు రెడీ

### కంట్రోల్‌రూం ప్రారంభించిన సీఎమ్‌డీ

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

గణేష్ విగ్రహాల శోభాయాత్రకు విద్యుత్ శాఖ సర్వసన్నద్ధంగా ఉందని తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఈ నెల 17న శోభాయాత్ర జరుగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యాత్ర జరిగే మార్గంలో విద్యుత్‌కు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా హుస్సేన్‌సాగర్ సమీపంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో సంస్థ ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంను శుక్రవారంనాడాయన ప్రారంభించారు. నిమజ్జనం సందర్భంగా ఏర్పడే అదనపు విద్యుత్ లోడ్‌కు సరిపడేలా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు తమ పరిధిలోని పెద్ద విగ్రహాలు ప్రతిష్ఠించిన మండపాలను, శోభాయాత్ర నిర్వహించే వీధుల్ని క్షుణ్ణంగా పరిశీలించి, రోడ్ క్రాసింగ్‌లు, వదులుగా ఉన్న తీగలు సరిచేయడం, ట్రాన్స్ ఫార్మర్ల దగ్గర ఎర్తింగ్, ఇన్సులేషన్‌ల ఏర్పాటు, ఇనుప స్తంభాలు, ఫ్యూజ్ బాక్సులు వున్నచోట పీవీసీ పైపులు, ప్లాస్టిక్ షీట్ల ఏర్పాటు చేయడం వంటి పనులు పూర్తిచేశామన్నారు. సిబ్బంది, అధికారులు విద్యుత్ భద్రతపై దృష్టి పెట్టాలనీ, శోభాయాత్రలో



ఎలాంటి అవాంతరాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్ సరఫరా తీరుతెన్నులను పర్యవేక్షించడానికి డైరెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లను ఇంచార్జిలుగా నియమించామన్నారు. ప్రజలు అత్యవసరంలో 100 / 1912 కు ఫోన్ చేయాలని సూచించారు.

## స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్ గ్రాంట్ నిధులు రూ.48.86 కోట్లు విడుదల

- ఉత్తర్వులు విడుదల

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో స్కూల్ గ్రాంట్ కింద రూ.36.43 కోట్లు, స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంట్ నిధులు రూ.12.42 కోట్లు కలిపి మొత్తం రూ.48.86 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు ఈవి నరసింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంట్ కింద 50 శాతం నిధులు విడుదల చేశామని వివరించారు. ఇందులో ఎస్సీల (24 శాతం) కాంపొనెంట్ నిధులు రూ.11.72 కోట్లు, ఎస్టీల (14 శాతం) కాంపొనెంట్ నిధులు రూ.6.84 కోట్లు, జనరల్ కాంపొనెంట్ (62 శాతం) నిధులు రూ.30.29 కోట్లు కలిపి మొత్తం రూ.48.86 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రాష్ట్రంలో 26,387 ప్రభుత్వ పాఠశాలలున్నాయని వివరించారు. వాటికి స్కూల్ గ్రాంట్ రూ.72.86 కోట్లు విడుదల చేయాలనీ, అందులో 50 శాతం రూ.36.43 కోట్లు ప్రస్తుతం విడుదల చేశామని పేర్కొన్నారు. స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంట్ కింద 26,387 స్కూళ్లకు రూ.24.85 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 50 శాతం చొప్పున రూ.12.42 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఇందులో సున్నా ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు, పీఎం శ్రీ మొదటి విడత, రెండో విడతలో ఎంపికైన పాఠశాలలు కూడా ఉన్నాయని వివరించారు.

## హైడ్రాపై స్టేకు హైకోర్టు నో

(మొదటిపేజీ తరువాయి)

99 అమలును నిలిపివేస్తూ స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. జీహెచ్ఎంసీ యాక్ట్ మేరకు హైడ్రాకు అధికారాలను ఎలా దఖలు పరిచారో చెప్పాలని ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. హైడ్రా ఏర్పాటులో చట్టబద్ధత లోపించినట్లు కనబడుతోందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. చట్టం లేకుండా జీవో ద్వారా ఏర్పాటైన హైడ్రా పని తీరును ప్రశ్నించింది. హైడ్రా ఏర్పాటు, విధులు, బాధ్యతలు, చట్టబద్ధతపై సమగ్ర వివరాలు అందజేయాలని నోటీసులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం హైడ్రాకు అధికారాలను ఎలా బదిలీ చేశారో చెప్పాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైడ్రా ఏర్పాటు జీవో 99 అమలును నిలిపేస్తూ స్టే ఉత్తర్వులను జారీ చేసేందుకు నిరాకరించింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం అలియాపూర్ గ్రామంలోని తమ నిర్మాణాలను కూలగొట్టడాన్ని సవాల్ చేస్తూ డి.లక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌లో జీవో 99ను కొట్టేయాలని కోరారు. దీనిని జస్టిస్ లక్ష్మణ్ శుక్రవారం విచారించి ప్రతివాదులకు నోటీసులు ఇచ్చారు. హైడ్రాకు ఉన్న చట్టబద్ధత, ఏర్పాటు, విధులు తదితర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. విచారణ ఈనెల 19 కి వాయిదా వేశారు.

## ఐసెట్‌లో 30,300 మందికి సీట్ల కేటాయింపు

- ఎంబీఏలో 24,457 మంది, ఎంసీఏలో 5,843 మంది
- సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు 17

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ మొదటి కౌన్సెలింగ్‌లో సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐసెట్‌లో 71,647 మంది అర్హత సాధించారని తెలిపారు. 35,033 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారనీ, వారిలో 34,069 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. రాష్ట్రంలో 266 ఎంబీఏ కాలేజీల్లో 27,951 సీట్లు, 89 ఎంసీఏ కాలేజీల్లో 6,797 సీట్లు కలిపి 34,748 సీట్లున్నాయని తెలిపారు. ఐసెట్ మొదటి విడతలో ఎంబీఏలో 24,457 మంది, ఎంసీఏలో 5,843 మంది కలిపి 30,300 (87.2) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఎంబీఏలో 3,494 సీట్లు, ఎంసీఏలో 954 సీట్లు కలిపి మొత్తం 4,448 (12.8 శాతం)సీట్లు మిగిలాయని వివరించారు. 91 కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 1,130 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు ఈనెల 17 వరకు గడువుందని తెలిపారు. తుది విడత కౌన్సెలింగ్ తర్వాతే కేటాయించిన కాలేజీల్లో ఈనెల 25 నుంచి 28 వరకు ఒరిజినల్ టీసీ, ఇతర ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కోసం https://tgicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు విఘాతం కలగనీయొద్దు

- చట్టాన్ని ఎవ్వరు ధిక్కరించినా ఉపేక్షించొద్దు
- ముగ్గురు సీపీలను ఆదేశించిన డీజీపీ డాక్టర్ జితేందర్

**నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి**

హైదరాబాద్ మహానగరానికి ఉన్న బ్రాండ్ ఇమేజ్‌కు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ముగ్గురు నగర పోలీసు కమిషనర్లను రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లో సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ పోలీసు కమిషనర్లతో నగరంలో నెలకొన్న తాజా పరిణామాలపై సమీక్ష జరిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించొద్దని ఆదేశించారు. రాజకీయపరమైన ఆందోళనలు చట్టపరిధిలో, ప్రజాస్వామ్యయుతంగా సాగితే అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే, చట్టాన్ని ఎవ్వరు ధిక్కరించినా ఉపేక్షించరాదని స్పష్టం చేశారు. చట్టాన్ని ఎవ్వరు చేతుల్లోకి తీసుకున్నా సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరిట సైబర్ నేరాలు

- మహిళ అరెస్టు

**నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి**

విదేశాల్లో ఉద్యోగాల కల్పిస్తామనే పేరిట నిరుద్యోగులను ఆకర్షించి వారిని సైబర్ నేరాల్లోకి దించుతున్న ముఠాకు చెందిన ఒక మహిళను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐడీ డీజీ, సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయెల్ తెలిపిన వివరాల ప్రకారం...ముంబయికి చెందిన ప్రియాంక ముంబయికి చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసేది. అది మూతపడ్డాక ఎలాంటి లైసెన్స్ లేకుండా ఓవరీస్ వీసాలను ఇచ్చే సంస్థను ప్రారంభించింది. కాంబోడియాలో ఉంటున్న జీతెన్‌షా అలియాస్ అమీర్‌ఖాన్‌తో సంబంధాలు ఏర్పర్చుకున్నది. విదేశాల్లో మెరుగైన ఉద్యోగాలను ఇప్పిస్తామంటూ ఆకర్షించి యువతను కాంబోడియాకు తరలించి అక్కడ వ్యూహం ప్రకారం సైబర్‌నేరాల్లోకి వారిని దించే పనికి పూనుకున్నది. జితేన్‌షా వ్యూహం మేరకు ప్రియాంక నడుచుకుంటూ యువతను ఆకర్షిస్తున్నది. పత్రికల్లో విదేశాల్లో ఉద్యోగాల పేరిట ప్రకటనలు ఇచ్చి వాటి ఆధారంగా వచ్చే యువతను మభ్యపెట్టి విజిటింగ్ వీసాల ద్వారా ఆమె కాంబోడియాకు తరలించేది. ఇందుకు ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల ప్రాసెసింగ్ ఫీజును తీసుకునేది. అదే సమయంలో జితేన్‌షా నుంచి దీనికి గానూ ఒక్కో అభ్యర్థిపై ఆమెకు 500 డాలర్ల కమిషన్ అందేది. అందులో భాగంగానే ఉద్యోగం పేరిట మోసానికి గురైన హైదరాబాద్‌కు చెందిన సాయికృష్ణ, ప్రసాద్‌లు కాంబోడియాకు తరలించబడ్డారు. అక్కడ వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం గాక సైబర్ నేరాలకు పాల్పడాలంటూ జితేన్‌షా బృందం వారిని నానా హింసలకు గురిచేసింది. ఏదో విధంగా అక్కడ నుంచి తప్పించుకుని వచ్చిన సాయికృష్ణ, ప్రసాద్‌లు రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రంగంలో దిగిన సీఎస్‌బీ అధికారులు ఇక్కడ నుంచి మోసపూరితంగా తరలిస్తున్న ప్రియాంకను అరెస్టు చేశారు. చైనాకు చెందిన జియాంజే కంపెనీ కోసం జితేన్‌షా పనిచేసేవాడని సీఎస్‌బీ అధికారులు తెలిపారు. అరెస్టు చేసిన ప్రియాంక ద్వారా మరిన్ని వివరాలు రాబట్టి సైబర్ నేరాలకు పాల్పడుతున్న కాంబోడియా ముఠాను అరెస్టు చేసేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## ప్రజావాణికి 576 దరఖాస్తులు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి 576 దరఖాస్తులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య వాటిని స్వీకరించారు. దరఖాస్తుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ శాఖకు 214, రెవెన్యూ శాఖకు 78, విద్యుత్ శాఖకు 56, మైనారిటీ వెల్ఫేర్ శాఖకు 44, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 44, ఇతర శాఖలకు 140 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు.



## 150 మందికి ఒకే టాయిలెట్లా..?

- అదనంగా నిర్మించాలని అధికారులకు ఆదేశం
- ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి

నవతెలంగాణ-మద్దూరు

సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌ను రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న సమస్యలను ప్రిన్సిపల్ సురేష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో విద్యార్థుల వివరాలు, అధ్యాపకుల వివరాలను, మోడల్ స్కూల్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు టాయిలెట్స్ లేకపోవడంతో వెంటనే నూతన టాయిలెట్స్ నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 150 మంది విద్యార్థులకు ఒకే టాయిలెట్ ఉండటం దురదృష్టకరమన్నారు. వెంటనే విద్యార్థుల కోసం రూ.13.80 లక్షలతో నూతన టాయిలెట్స్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట సిద్దిపేట జిల్లా డీఐ ఈవో సురేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

- త్వరలోనే తరలింపునకు చర్యలు : స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- రాంపూర్ గ్రామంలో పర్యటన



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

రాంపూర్‌లోని డంపింగ్ యార్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. హన్మకొండ జిల్లా రాంపూర్ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి పలు సమస్యలపై ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. వరంగల్-కరీంనగర్ పట్టణానికి మధ్యలో ఉన్న నేషనల్ హైవే సమీపంలో 100 ఎకరాల స్థలాన్ని గుర్తించి ఈ డంపింగ్ యార్డును తరలించేందుకు ప్రయత్నాలు మొదలవుతున్నాయని చెప్పారు. రాంపూర్‌కు వచ్చే ప్రధాన రహదారిపై భారీ వర్షాల కారణంగా నీరు నిలిచిపోతున్నాయని, ఇంజనీరింగ్ అధికారులను పంపించి కాజ్ వే లేదా బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు.

రాంపూర్‌లో రెండు శ్మశానవాటికలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా గుడిసెలు వేసుకుని ఆక్రమించుకోకుండా చూస్తానని, త్వరలోనే తహసీల్దార్‌ని పంపించి అర్హులైన వారికి ఇండ్ల స్థలాల పట్టాలు ఇస్తామని తెలిపారు. కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి మిషన్ భగీరథ మంచినీటి సమస్య పరిష్కరిస్తారన్నారు. త్వరలో మున్సిపల్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలన్నీ పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి రండి

- కేంద్ర మంత్రులు అమిత్‌షా, షెకావత్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి సీఎం ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం కార్యక్రమాలకు హాజరుకావాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్‌లను సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం వారికి లేఖలు రాశారు. 1948, సెప్టెంబరు 17న తెలంగాణలో ప్రజాస్వామిక పాలన శకం ఆరంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం వెల్లడించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని వారిని కోరారు.

## విద్యార్థినిపై నుంచి వెళ్లిన పాఠశాల బస్సు

- అక్కడికక్కడే చిన్నారి మృతి
- మేడ్చల్ మల్కాజిగిరి మల్లంపేట్ ఓక్ లీఫ్ హైస్కూల్‌లో ఘటన

నవతెలంగాణ-దుండిగల్



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్లంపేట్‌లోని ఓ పాఠశాలలో తీవ్ర విషాద ఘటన జరిగింది. ఐదేండ్ల చిన్నారిపై నుంచి స్కూలు బస్సు వెళ్లడంతో విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన ఓ కుటుంబం దుండిగల్ మున్సిపాలిటీలోని మల్లంపేట్‌లో డ్రీమ్ వ్యాలీలో నివసిస్తోంది. దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరూ మల్లంపేట్‌లో గల ఓక్ లీఫ్ హైస్కూల్‌లో చదువుతున్నారు. చిన్న కుమార్తె మహాన్విత(5) ఒకటో తరగతి చదువుతున్నది. రోజూ మాదిరిగానే శుక్రవారం ఇద్దరు పిల్లలను స్కూల్ బస్సులో తల్లిదండ్రులు పంపించారు. అయితే, స్కూల్ ఆవరణలో బస్సు ప్రమాదవశాత్తు మహాన్వితపై నుంచి వెళ్లింది. వెంటనే ఆమెను మమత ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.అయితే, బస్సు నుంచి జారి పడి మహాన్విత మృతి చెందినట్టు స్కూల్ యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. దాంతో వారు అక్కడకు చేరుకుని స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు డ్రైవర్‌ను అక్కడి నుంచి పంపించేశారని.. కేసును తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని బంధువులు ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. చిన్నారి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్కూల్‌కు బస్సు చేరుకోగానే పిల్లలను కిందకు దించి క్లాస్ రూమ్‌కు తరలించే క్రమంలో డ్రైవర్ చూసుకోకుండా నడపడం వల్ల ప్రమాదం జరిగిందా లేక బస్సులో నుంచి జారి పడి చిన్నారి మృతిచెందిందా అనేది తెలియరాలేదు.

# ఐద్వా సీనియర్ నేత ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన తర్వాత కూడా ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా, లీగల్ సెల్ కన్వీనర్‌గా పనిచేశారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ మహిళా ఉద్యమానికి సలహాలు సూచనలు ఇస్తూ, మరణించేంత వరకు ముందు తరాలకు స్ఫూర్తిగా నిలిచారు. లక్ష్మీదేవమ్మ భౌతికకాయాన్ని శనివారం ఉదయం పదిగంటల వరకు రామంతాపూర్‌లో ఉంచి, ఆ తర్వాత మహబూబ్‌నగర్‌కు తరలిస్తారు. అనంతరం అక్కడి సీపీఐ(ఎం) కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచు తారు. ఆ తర్వాత వైద్య పరిశోధనల నిమిత్తం ఆమె భౌతిక కాయాన్ని అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి అప్పగిస్తారు.

### సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపం

లక్ష్మీదేవమ్మ మృతి పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపాన్ని ప్రకటించింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, జాన్ వెస్లీ, టీ సాగర్, పి.ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, జె బాబురావు, బుర్రి ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం నేత శోభన్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ డైరెక్టర్ జి బుచ్చిరెడ్డి, బాలోత్సవ కార్యదర్శి ఎస్ సోమయ్య తదితరులు ఆమె భౌతికకాయంపై పూలమాలలేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ప్రజా సమస్యల పట్ల ఆమె స్పందన, సమాజ మార్పుకోసం తపన నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె మృతి మహిళా ఉద్యమాలకే కాకుండా ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నవతెలంగాణ జీఎంలు వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, మొఫిసిల్ ఇన్‌చార్జీ వేణుమాధవరావు, నవీన్, ఐద్వా నేతలు పద్మశ్రీ, గౌరి, ప్రసన్న, విజయలక్ష్మి, వ్యవసాయ కార్మికసంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



### మహిళా ఉద్యమాలకు తీరని లోటు : తమ్మినేని

ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ మరణం పట్ల సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆమె మరణం సీపీఐ(ఎం)కు, మహిళా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొంటూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమె ఆదర్శ భావాలను కలిగిన నాయకులని వివరించారు. ప్రజాతంత్ర ఉద్యమాల్లో పాల్గొంటూనే ఆర్థికంగా శక్తి మేరకు సహకారం అందించారని గుర్తు చేశారు. 1985లో కమ్యూనిస్టు పార్టీలో చేరి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కరువు, కాటకాలు వచ్చినప్పుడు అంబలి కేంద్రాలను నడిపి పేదల ఆకలిని తీర్చారని పేర్కొన్నారు. రాష్ట్ర కేంద్రంలో కుటుంబ న్యాయ సలహా కేంద్రం కన్వీనర్‌గా బాధ్యతలను నిర్వహించారనీ, తుది శ్వాస వరకు మహిళా ఉద్యమానికి సలహాలు, సూచనలు అందిచారని తెలిపారు. ఆమె మరణం పట్ల విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని పేర్కొన్నారు.

### ఆదర్శ కమ్యూనిస్టు : వి. శ్రీనివాస్‌రావు

లక్ష్మీదేవమ్మ ఆదర్శ కమ్యూనిస్టు అని ఆంధ్రప్రదేశ్ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆమె మృతి మహిళా, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఆమె మృతి పట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

### ఐద్వా, ఐలూ సంతాపం

లక్ష్మీదేవమ్మ మరణం.. మహిళా ఉద్యమానికి తీరని లోటని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి తెలిపారు. ఆమె మృతి పట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమె మహబూబ్‌నగర్ ఐద్వా జిల్లా కార్యదర్శిగా పని చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర కేంద్రలో మహిళా ఉద్యమ నిర్మాణానికి తగిన సలహాలు సూచనలిచ్చేవారని పేర్కొన్నారు. లీగల్ సెల్ నిర్వహణలో తన వంతు పాత్రను పోషించారని తెలిపారు. తుది శ్వాస వరకు ప్రజల పక్షపాతిగా ఉన్నారని నివాళులర్పించారు. లక్ష్మీదేవమ్మ మరణం పట్ల ఐలు రాష్ట్ర కార్యదర్శి పార్థసారథి తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఆమె కడదాకా నిలబడ్డారని నివాళులర్పించారు.

### శ్రద్ధాంజలి

నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

మహబూబ్‌నగర్‌లో కమ్యూనిస్టు ఉద్యమంలో లక్ష్మీదేవమ్మ సహకారం గొప్పదని మాజీ ఎంపీ పి.మధు అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మీదేవమ్మ శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమెకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆమె సీపీఐ(ఎం) ఉమ్మడి జిల్లా నాయకురాలిగా, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేశారన్నారు. పార్టీ విధానాలకు కట్టుబడి ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం ఉద్యమాల్లో ఉన్నారని తెలిపారు. అప్పట్లో మహబూబ్‌నగర్ జిల్లా కరువు కాటకాలతో విలవిల్లాడుతున్న సమయంలో అంబలి కేంద్రాలు పెట్టి పేదల ఆకలి తీర్చారన్నారు. భూపోరాటల సమయంలో ఆమె సహకారం మరువలేనిదని కొనియాడారు.ఆమె కుటుంబం, పిల్లలు పార్టీకి చేదోడు వాదోడుగా ఉండటం వారి సిద్ధాంత నిబద్ధతకు నిదర్శనమన్నారు.

### పల్లా సంతాపం

లక్ష్మీదేవమ్మ మృతికి బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆమె భౌతికకాయానికి నివాళి అర్పించారు. అర్జున్‌తో పాటు మిగతా కుటుంబ సభ్యులను ఓదార్చారు. లక్ష్మీదేవమ్మ తన జీవితాంతం ప్రజల కోసం పాటుపడ్డారని గుర్తు చేశారు.

## ఏచూరి మరణం వామపక్ష, కార్మిక ఉద్యమాలకు తీరని లోటు

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. భాస్కర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశ ప్రజలకు నష్టమనీ, వామపక్ష, కార్మిక ఉద్యమాలకు తీరని లోటు అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ. రమ అధ్యక్షతన జరిగిన ఈ సంతాప కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శి జె. చంద్రశేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాలడుగు సుధాకర్, యాటల సోమన్న, ఎ.సునీత, కెవివిఎస్ఎన్ రాజు, సోషల్ మీడియా నాయకులు భానుకిరణ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జరిగిన అనేక ఉద్యమాలలో, దేశవ్యాప్త సమ్మెల సందర్భంగా ఏచూరి ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యమాలకు అండదండగా నిలిచారని గుర్తుచేశారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేశారనీ, బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వ మతోన్మాద విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా సైద్ధాంతిక పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాల్లో కూడా ప్రత్యక్ష అనుబంధం కల్గిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. భూపాల్ మాట్లాడుతూ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సోషలిజం కోసం పోరాడిన యోధుడు ఏచూరి అని చెప్పారు. అట్టడుగు వర్గాల ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో గళమెత్తి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా సేవలందించారని కొనియాడారు. దేశంలోని కమ్యూనిస్టులు, వామపక్షాలు, సామాజిక శక్తులు కలిసికట్టుగా ఉద్యమాలు చేయాలని ఆశించారన్నారు. జమ్మూ-కాశ్మీర్‌ను నిర్బంధ జైలుగా మార్చిన బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి జమ్మూ-కాశ్మీర్‌ను సందర్శించిన మొదటి వ్యక్తిగా నిలిచారని తెలిపారు. యూపీఏ-1 ప్రభుత్వ కాలంలో ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం సాధించారనీ, దేశంలోని ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం కృషి చేశారని కొనియాడారు. అలాంటి నాయకుడ్ని కోల్పోవడం భారత ప్రజలకే తీవ్ర నష్టమన్నారు. ఆయన ఆశయ సాధనలో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గృహ నిర్బంధం

- పోలీసులతో వాగ్వాదం
- ఎమ్మెల్సీ ఇంటి పరిసరాల్లో 144 సెక్షన్
- అంతకుముందే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హౌస్ అరెస్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో/విలేకరులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్తామని పాడి కౌశిక్ రెడ్డి గురువారమే ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ రాజు ఇంటికి కౌశిక్ రెడ్డి వెళ్లారు. అనుచరులు, కార్యకర్తలతో కలిసి అక్కడి నుంచి వివేకానందానగర్‌లోని అరికెపూడి గాంధీ ఇంటికి బయల్దేరారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు.ఇద్దరినీ గృహ నిర్బంధం చేశారు. ఈ క్రమంలో పోలీసులతో పాడి కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజు వాగ్వాదానికి దిగారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అక్కడికి చేరుకుని ఎమ్మెల్సీ ఇంటి పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేశారు. ఇంటి బయట పోలీసులు పహారా నిర్వహించారు.

ఇంట్లోకి ఎవరినీ అనుమతించలేదు. అంతకు ముందు జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టులు చేశారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

### హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి : పాడి కౌశిక్‌రెడ్డి

హైకోర్టు ఆదేశాల మేరకు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను నాలుగు వారాల్లో డిస్ క్వాలిఫై చేస్తూ అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇలా చేస్తే 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవన్నారు.

తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌పై తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి తన ఇంటిపై దాడి చేయాలని చెప్పారని ఆరోపించారు. తాను ఉండే విల్లాల్లో మొత్తం 69 కుటుంబాలు ఉంటే, ఇక్కడే ఏపీ మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు సైతం ఉన్నారని తెలిపారు. ఆంధ్రా వారు అంటే తమకు గౌరవం ఉందని, తాను వ్యక్తిగతంగా అరికెపూడి గాంధీని మాత్రమే అన్నానని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లో రేవంత్‌రెడ్డి హైదరాబాద్ అభివృద్ధిని అమరావతికి తరలిస్తున్నారని ఆరోపించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు గోకుడు ఎక్కువగా ఉందని, దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు.

### కౌశిక్ గత చరిత్ర హీనం : ఎమ్మెల్యే అరికపూడి గాంధీ

ఇదిలా ఉండగా ఎమ్మెల్యే అరికపూడి గాంధీ విలేకరులతో మాట్లాడారు. కౌశికొరెడ్డి లాంటి వారి వల్లే బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిందని తెలిపారు. అమెరికా నుంచి ఫోన్లో హెచ్చరికలు రావటంతోనే.. ఈరోజు కౌశిక్ తగ్గి మాట్లాడాడన్నారు. తాను కూడా నోరు జారింది వాస్తవమేనని చెప్పారు.

## వరద నష్టం రూ.10,320 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. పంట పొలాల్లో బండరాళ్లు, కంకర, మట్టి మేటలు వేయటంతో రైతులు కోలుకోలేనంత నష్టపోయారని వాపోయారు. చాలా చోట్ల రహదారులు, రోడ్లు, కల్వర్టులు, చెరువుల కొట్టుకు పోవటంతో నష్టం ప్రాథమిక అంచనాలను మించిపోయిందని వివరించారు. ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగుతో ఉన్న వరద ముప్పును నివారించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించడమే శాశ్వత పరిష్కారమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కేంద్రం తగినన్ని నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తనవంతుగా నిధుల వాటాను భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాకాసి తండా, సత్యనారాయణ తండాతో పాటు లోతట్టు ప్రాంతాల్లోని తండాల ప్రజలను సమీపంలో సురక్షితంగా ఉండే ప్రాంతంలో ఇండ్లను కేటాయిస్తామని చెప్పారు. ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన సాయం అందించాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. వరదలు, ప్రకృతి విపత్తులు సంభవించిన తర్వాత ఆదుకోవటం కంటే వర్షపాతం, హీట్‌వేవ్ లాంటి వాతావరణ, పర్యావరణానికి సంబం ధించిన విపత్తులపై వీలైనంత ముందుగా హెచ్చరికలు జారీ చేసేలా ఏర్పాట్లపై ఎక్కువ దృష్టిసారించాలని కేంద్ర బృందానికి సూచించారు . వరదలు వచ్చినప్పుడు తక్షణ సహాయం అందించేందుకు వివిధ జిల్లాల్లోని పోలీసు బెటాలియన్లను ఉపయోగించుకుంటా మనే ఆలోచనను కేంద్ర బృందంతో పంచుకున్నారు. ప్రతి బెటాలియన్లో ఎంపిక చేసిన వంద మందికి ప్రత్యేక శిక్షణను అందిస్తామని చెప్పారు. వారికి అవసరమైన పరికరాలు, శిక్షణ, నైపుణ్యం నేర్పేందుకు ఎన్డీఆర్ఎఫ్ సాయం కావాలని కోరారు. మేడారం అటవీ ప్రాంతంలో ఇటీవల దాదాపు 50 వేల ఎకరాల్లో చెట్లు నేలమట్టమయ్యాయని బృందం దృష్టికి తీసుకెళ్లారు. అటవీ ప్రాంతంలో జరిగినం దున పెద్దగా ముప్పు వాటిల్లలేదనీ, మైదాన ప్రాంతంలో జరిగితే భారీ నష్టం వాటిల్లేదని సీఎం అభిప్రాయ పడ్డారు. దేశంలో ఇప్పటివరకు ఇలాంటి సంఘటన జరిగినట్టు తమ దృష్టికి రాలేదని కేంద్ర బృందం చెప్పగా..అందుకే కేంద్రం నుంచి నిపుణుల బృందాన్ని పంపించి శాస్త్రీయంగా అధ్యయనం చేయించాలని సీఎం కోరారు.

## పిల్లల లైబ్రరీకి "ఎల్ఐసీ" కంప్యూటర్ల బహూకరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



తెలంగాణ బాలోత్సవం అధ్వర్యంలో పిల్లల లైబ్రరీకి ఎల్ఐసీ సంస్థ కంప్యూటర్లు ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నది. ఈ సందర్భంగా ఆ సంస్థ సీనియర్ డివిజన్ మేనేజర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్‌గా ప్రస్తుతం మారిన తరుణంలో పిల్లల్లో పఠనం ఒక జీవన విధానంగా మారాలని ఆకాంక్షించారు.ఇదే ఒరవడిలో బాలోత్సవం పుస్తకాలు దారిదీపాలుగా మారుస్తోందని అభివర్ణించారు. మనిషికి, అక్షరానికి విడదీయరాని సంబంధంఉందనీ, జీవితం నుంచి అక్షరాలను, వాటి నుంచి జీవితాన్ని వెతుక్కోవడం ఎప్పటి నుండో వస్తున్నదన్నారు. బాలలకు పుస్తక పఠనం పట్ల ఆసక్తి కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయమన్నారు. కంప్యూటర్ యుగంలో.. పెద్దల నుండి పిన్నల దాకా పుస్తకాలు చదివే అలవాటు గణనీయంగా తగ్గిపోతున్నదని ఆవే దన వ్యక్తం చేశారు. ఎప్పుడైతే విజువల్ సంస్కృతి ప్రారంభమైందో అప్పుడే చదవడం అలవాటు తగ్గిపోయిందన్నారు. ఈ తరుణంలో పిల్లల లైబ్రరీ నిర్వహించడం హర్షణీయమన్నారు. ఎల్ఐసీ మార్కెట్ మెనేజర్ యం ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఒక జాతి సంస్కృతిని, నాగరికతను పది కాలాల పాటు పదిల పరిచే ఆలయం గ్రంథాలయమని చెప్పారు.విజ్ఞానం కావాలంటే విజ్ఞాన కేంద్రానికి రావాలి అన్నట్టు ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ మార్కెట్ సెల్స్ మెనేజర్ టి.రామచంద్రన్, ప్రొడక్ట్ మెనేజర్ రవీంద్ర మైథిలి, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి ఎస్ సోమయ్య ఉపాధ్యక్షులు కే సుజావతి,జి.బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## ట్రాఫిక్ వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లు

- ప్రత్యేక యూనిఫాం..స్టైఫండ్..హోంగార్డ్స్ తరహా సేవలు
- క్లీన్ సిటీనే లక్ష్యం..ఇండోర్‌లో అధ్యయనం చేసిరండి
- పనులు చేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు : మున్సిపల్ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



ట్రాఫిక్ వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమించుకోవాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. వారికి ప్రత్యేక యూనిఫాం ఇవ్వాలనీ, కొంత స్టైఫండ్ కూడా ఇస్తే, ఉపాధి కల్పించినట్టు అవుతుందని చెప్పారు. హోంగార్డ్స్ అందిస్తున్న సేవల తరహాలోనే వారినీ వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న ట్రాన్స్‌జెండర్ల వివరాలు సేకరించి, శిక్షణానంతరం వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారంనాడిక్కడి బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పురపాలకశాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలీ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు పురపాలకశాఖకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, పారిశుద్ధ్యం ఇతర పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పనులు చేపట్టేందుకు టెండర్లు పొంది పనుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్లను ఉపేక్షించవద్దని సీఎం అన్నారు. డిసెంబర్ నాటికి రోడ్డు కాంట్రాక్టర్ల గడువు తీరుతున్న నేపథ్యంలో మరమ్మతులు, నిర్వహణపై వారు పూర్తిగా దృష్టి పెట్టట్లేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అది సరైన పద్ధతి కాదనీ, అలాంటి వారికి సంబంధించిన పనులపై 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని సీఎం కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌ను ఇండోర్ తరహాలో అద్భుతమైన క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం ఇండోర్ కు వెళ్లి అధ్యయనం చేసి, అక్కడ అనుసరిస్తున్న విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు. ఏయే ఏజెన్సీలు, స్వచ్ఛంద సంస్థలు అక్కడ పనుల్లో పాలుపంచుకున్నాయో తెలుసుకొని చర్చలు జరపాలని, వీలైతే వారిని భాగస్వాములను చేయాలని చెప్పారు. క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ఇండోర్ కార్పొరేషన్ ఆదాయ వనరులను ఎలా సమీకరిస్తుందో తెలుసుకోవాలని సూచించారు. చెత్త సేకరణ కోసం జీఐఎస్, క్యూ ఆర్ స్కాన్ లాంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని చెప్పారు. జీహెచ్ఎంసీ ఆస్తుల నుంచి వచ్చే అద్దెలు, ప్రకటనలు, హోర్డింగ్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని సమీక్షించాలని కోరారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలనీ, నిర్వాసితులకు భరోసా కల్పిస్తూ పునరావాసం కల్పించాలని స్పష్టం చేశారు. చెర్లపల్లి రైల్వేస్టేషన్‌ను అధునీకరిస్తున్నందున పరిసర ప్రాంతాల అప్రోచ్ రోడ్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. పరిసరాల్లో ఉన్న అటవీశాఖ, పరిశ్రమల విభాగం భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అక్కడి పరిశ్రమలను మరో చోటికి తరలించాలనీ, స్టేషన్ ముందు పార్కింగ్, కమర్షియల్ జంక్షన్‌కు వీలుగా అప్రోచ్ రోడ్లు డిజైన్ చేసుకోవాలని చెప్పారు.

## బీఆర్ఎస్ నేతల అక్రమ నిర్బంధాలు...

- హౌస్ అరెస్ట్‌లపై కేటీఆర్ ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


బీఆర్ఎస్ నేతల అక్రమ నిర్బంధాలు, హౌస్ అరెస్ట్‌లపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటింగ్ పెట్టుకునే హక్కు కూడా లేదా? ఇందిరమ్మ రాజ్యంలో ఎమర్జెన్సీ రోజులను గుర్తు తెస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలంటే ముఖ్యమంత్రి వెన్నులో ఎందుకంత వణుకు? అని ప్రశ్నించారు. దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను వదిలి బీఆర్ఎస్ నేతల అరెస్టులా? సిగ్గుచేటన్నారు. సీఎం కనుసన్నల్లో సాగుతున్న ఈ అక్రమ విధానాలను తెలంగాణ సమాజం గమనిస్తోందని తెలిపారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

ప్రజాపాలనలో ప్రతిపక్షాలు మీటింగ్ పెట్టుకోవటానికి కూడా అనుమతి లేదా? అని కేటీఆర్ నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ ఆనాటి ఎమర్జెన్సీ రోజులను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల్ని గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేటీఆర్ చెప్పారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన అరికెపూడి గాంధీ అనుచరులైన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని వదిలేసి బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం దిగజారుడు విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని... బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం జులుం చేయటాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు. ప్రశ్నిస్తే చాలు ప్రజాప్రతినిధులపై కూడా దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులకు దిగే సంస్కృతిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేలా ప్రవర్తిస్తామంటే బీఆర్ఎస్ పార్టీ సహించదని స్పష్టం చేశారు. ప్రజలు సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసిన తమ పార్టీ నేతల్ని బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# బిజినెస్

## వడ్డీ రేట్ల తగ్గింపునకు తొందరేంలేదు

- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత వెల్లడి



**న్యూఢిల్లీ :** వడ్డీ రేట్ల తగ్గింపునకు తొందరపడబోమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. దీంతో అక్టోబర్‌లో జరగనున్న ఆర్‌బీఐ మానిటరీ పాలసీ సమావేశంలో కీలక వడ్డీరేట్లను తగ్గిస్తారన్న నిపుణులు అంచనాలకు శక్తికాంత తాజాగా చెక్ పెట్టినట్లయ్యింది. సింగపూర్‌లో బ్రెట్టన్ వుడ్స్ కమిటీ నిర్వహించిన సదస్సులో శక్తికాంత మాట్లాడుతూ.. ద్రవ్యోల్బణాన్ని 2-6 శాతం మధ్య ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎలాంటి ఆర్థిక పరిస్థితుల్లోనైనా ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతంగా ఉంచేలా ప్రణాళికలు వేసుకు న్నామన్నారు. వరుసగా రెండో నెలలోనూ ద్రవ్యోల్బణం నాలుగు శాతం కంటే తక్కువగా చోటు చేసుకుందని గుర్తు చేశారు. అయినప్పటికీ కీలక వడ్డీరేట్ల తగ్గింపు అంశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. పాలసీ విధానకర్తలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. కరోనా కారణంగా తగ్గిపోయిన ఆర్థిక కార్యకలాపాలు క్రమంగా పుంజుకుని వృద్ధిపథంలో కొనసాగు తున్నాయన్నారు. 2021-24 మధ్య కాలంలో భారత జీడీపీ సగటున 7.5 శాతంగా ఉందని.. కాగా 2024 జూన్ త్రైమాసికంలో 6.5 శాతానికి పరిమి తమయ్యిందన్నారు. ఇందుకు సార్వత్రిక ఎన్నికల వల్ల ప్రభుత్వ వ్యయాలు మందగించడమే కారణమన్నారు. కరోనా కాలంలో రుణాలపై వడ్డీ రేట్లను భారీగా పెంచి.. రెపోరేటును 6.5 శాతానికి చేర్చింది. కాగా.. గడిచిన ఏడాదిన్నర పైగా కాలంలో వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తోంది. హెచ్చు వడ్డీ రేట్లతో రుణాలు భారం కావడంతో రుణగ్రహీతలు గత కొంత కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వారివో మోటార్ నుంచి హైస్పీడ్ సీఆర్‌ఎక్స్ స్కూటర్



**న్యూఢిల్లీ :** విద్యుత్ ద్విచక్ర వాహన కంపెనీ వారివో మోటర్ ఇండియా కొత్తగా హైస్పిడ్ స్కూటర్ సీఆర్‌ఎక్స్‌ను విడుదల చేసింది. వినియోగదారులు విభిన్న రోజువారీ ప్రయాణ అవసరాలను తీర్చేలా దీన్ని డిజైన్ చేసినట్టు పేర్కొంది. ఈ అధునాతన ఇ-స్కూటర్ ధరను రూ.79,999గా నిర్ణయించినట్లు తెలిపింది. గంటకు గరిష్ఠంగా 55 కిలోమీటర్లు ప్రయాణించగలదని వెల్లడించింది. ఫైర్‌ప్రూఫ్, బ్లాస్ట్ ప్రూఫ్ బ్యాటరీ భద్రత ఫీచర్‌తో దీన్ని అందుబాటులోకి తెచ్చామని వారివో మోటార్ డైరెక్టర్ రాజీవ్ గోయెల్ తెలిపారు.

## గెలాక్సీ ఎస్ 24 అల్ట్రాపై రూ.20వేలు తగ్గింపు

**న్యూఢిల్లీ :** ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ తన గెలాక్సీ ఎస్ 24 అల్ట్రా స్మార్ట్‌ఫోన్‌పై రూ.20వేల వరకు తగ్గింపు ప్రకటించింది. పరిమిత కాల వ్యవధి ఆఫర్‌లో భాగంగా రూ.1,09,999కి అందుబాటులో ఉంటుందని ఆ సంస్థ పేర్కొంది. దీని అసలు ధర రూ.1,29,999గా పేర్కొంది. ప్రత్యేక ధరలో రూ. 8000 ఇన్‌స్టంట్ క్యాష్ బ్యాక్‌తో పాటు రూ.12000 అదనపు అప్‌గ్రేడ్ బోనస్‌ను అందిస్తున్నట్లు పేర్కొంది. వినియోగదారులు 24 నెలల పాటు నో-కాస్ట్ ఈఎంఐ ప్రయోజనం సైతం పొందవచ్చని వెల్లడించింది.

## నేనేం తప్పు చేయలే

- ఆ ఆరోపణలన్నీ అవాస్తవాలే..:

నోరు విప్పిన సెబీ చీఫ్ మాధబి బచ్ వెల్లడి

**న్యూఢిల్లీ :** సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌పై వచ్చిన తీవ్ర అవినీతి ఆరోపణలపై ఆమె ఎట్టకేలకు స్పందించింది. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలని, అవమానకరమైనవిగా మాధబి పేర్కొన్నారు. ఈ మేరకు తన భర్తతో ధావల్ బచ్‌తో కలిసి ఉమ్మడి ప్రకటనను విడుదల చేశారు. సెబీ నిర్దేశించిన అన్ని నియమాలు, మార్గదర్శకాలకు తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. పలు ఆరోపణలు తనను అవమానించేలా ఉన్నాయన్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి, మహీంద్రా గ్రూపు నుంచి ఆమె పలు ఆదాయాలు పొందుతున్నారని ఇటీవల కాంగ్రెస్ విమర్శించింది. ముంబయిలోని తన ప్రాపర్టీని అవినీతి విచారణ ఎదుర్కొంటున్న వోక్హార్డ్ అసోసియేట్‌కు అద్దెకిచ్చినట్టు ఆరోపించిన విషయం తెలిసిందే. అదానీ విదేశీ ఫండ్ కంపెనీల్లోనూ మాధబి పెట్టుబడులు కలిగి ఉన్నారని హిండెన్‌బర్గ్ తీవ్ర విమర్శలు చేసింది. దాదాపు నెల రోజులుగా సాగుతున్న ఈ విమర్శలపై మాధబి ఇప్పుడు నోరు విప్పడం గమనార్హం.

## వరద బాధిత పాలసీదారులకు మద్దతు

- బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ వెల్లడి

నవ తెలంగాణ - బిజినెస్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో ఇటీవలి వరదలు ప్రజల జీవితానికి, ఆస్తికి భారీ స్థాయిలో నష్టాన్ని కలిగించిన క్రమంలో తమ పాలసీదారులకు బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ సత్వర సహాయాన్ని అందించనున్నట్టు ప్రకటించింది. ఇందుకోసం సకాలంలో సమర్థవంతమైన క్లెయిమ్ సెటిల్‌మెంట్లను అందించి వారి పట్ల తమ నిబద్ధతను ప్రదర్శించనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధి తెలిపారు. వరద బాధిత పాలసీదారుల ప్రశ్నలకు సమాధానాలు అందించడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## 75 శాతం మంది కొత్త విక్రేతలే

- మీషో వెల్లడి

**హైదరాబాద్ :** తమ వేదికలోని విక్రేతల్లో 75 శాతం కొత్త ఔత్సాహికవేత్తలేనని ఇ-కామర్స్ వేదిక మీషో తెలిపింది. ప్రస్తుత పండగ సీజన్‌లో ద్వితీయ శ్రేణి నగరాల వినియోగదారుల్లో 60 శాతం పెరుగుదల నమోదవుతుందని అంచనా వేసింది. ఇన్ఫ్లూయెన్సరర్స్ ద్వారానే ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నామని 50 శాతం మంది పేర్కొన్నట్టు తెలిపింది. పండుగ సీజన్ నేపథ్యంలో వినియోగదారులు కొనుగోళ్లకు తమ బడ్జెట్‌ను పెంచుకుంటున్నారని తెలిపింది.

## ఎన్‌హెచ్‌ఎఐతో హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ ఒప్పందం

**హైదరాబాద్ :** ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) కాంట్రాక్టు సేవల కంపెనీ హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ తాజాగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. కర్నాటకలోని ములవాడలో యూజర్ ఫీజు వసూలు చేసే ఏజెన్సీగా వ్యవహరించినందుకు ఎన్‌హెచ్‌ఎఐ ఆర్డర్‌ను దక్కించుకున్నటు వెల్లడించింది. ఈ ఆర్డర్ విలువ రూ.2.59 కోట్లుగా ఉందని ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో తెలిపింది. కర్నాటక రాష్ట్రంలోని ఎన్‌హెచ్ 218 బీజాపూర్ హుబ్లీ విభాగంలో 4.40 కిలోమీటర్ల నుంచి 56.00 కిలోమీటర్ల వరకు ఈ రహదారి టోలును వసూలు చేయనుంది.

# చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఏడుగురు దుర్మరణం
- 31 మందికి తీవ్ర గాయాలు
- మృతులకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా



**అమరావతి :** చిత్తూరు జిల్లాలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. 31 మంది గాయపడ్డారు. వారిలో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించింది. పోలీసుల కథనం ప్రకారం... బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్‌లో బెంగుళూరు నుంచి వైజాగ్ వెళ్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌ను దాటింది. తిరుపతి నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్‌టిసి బస్సును ఢీకొంది.

ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే ఏడుగురు మృతి చెందారు. వారిలో తిరుపతికి చెందిన ఆర్‌టిసి డ్రైవర్ మనోహరన్ (56), తిరుపతి జిల్లా పాకాల మండలం కంభాలమిట్టకు చెందిన ఎస్.విజయమ్మ (53), మహారాష్ట్రకు చెందిన హన్షిక యాదవ్ (6), తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటకు చెందిన బాలరాజు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ సోనుకుమార్ (31), చిత్తూరుజిల్లా జిడి నెల్లూరుకు చెందిన శంకర రెడ్డి (48) ఉన్నారు. మరొకరి పేర్లు తెలియాల్సి ఉంది. తీవ్రంగా గాయపడిన వారిలో శివ, రిక్కీ, చిరంజీవి, బాబురెడ్డి, మురళి, అస్మిత్ యాదవ్, పద్మావతి, లావణ్య, అమరనాథ్ ఉన్నారు. పలమనేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పలమనేరు, పూతలపట్టు ఎంఎల్‌ఎలు అమరనాథ్‌రెడ్డి, మురళీమోహన్ పరామర్శించారు.

### రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి : సీపీఐ(ఎం)ఏపీ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, వారికీ నష్టపరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# కర్నూలులో అమానుషం

- కుమారుడు కులాంతర వివాహం చేసుకున్నాడని తల్లిపై దాడి
- కరెంటు స్తంభానికి కట్టేసి చిత్రవధ
- దాడికి పాల్పడిన పదిమందిపై కేసు నమోదు



**కర్నూలు :** కర్నూలులో అమానుషం చోటు చేసుకుంది. సభ్య సమాజం తలదించుకునేలా ఓ తల్లిని కరెంటు స్తంభానికి కట్టేసి చిత్రవధ చేశారు. కుమారుడు కులాంతర వివాహం చేసుకున్న నేరానికి యువతి తరపున వారు అమానుషంగా ప్రవర్తించారు. కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత ఈరన్న అదే గ్రామానికి చెందిన రజక యువతిని ప్రేమించి ఈ ఏడాది ఫిబ్రవరిలో కులాంతర వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి యువకుడి కుటుంబం గ్రామంలో నివసించడం లేదు. నాలుగు రోజుల క్రితం యువకుడి తల్లి, సోదరుడు గ్రామానికి వచ్చారనే సమాచారం తెలుసుకున్న అమ్మాయి కుటుంబ సభ్యులు గురువారం రాత్రి యువకుడి తల్లిపై దాడి చేశారు. అనంతరం కరెంటు స్తంభానికి కట్టేసి చిత్రవధ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడి తల్లిని విడిపించారు.

ఆమె ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, నాయకులు పరమేష్, దేవదాసు శ్రీను, అబ్దుల్ శుక్రవారం పరామర్శించారు.

### కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ధర్నా

దాడికి పాల్పడిన వారిని, దాడికి ఉసిగొల్పిన పెత్తందార్లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు కెవిపిఎస్, ప్రజాసంఘాలు శుక్రవారం ధర్నా నిర్వహించాయి. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నగేష్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురు శేఖర్, కెవిపిఎస్ నాయకులు డి.విజయమ్మ మాట్లాడారు. అమ్మాయి తల్లిదండ్రులను పెత్తందార్లు రెచ్చగొట్టారని, యువకుడి తల్లిపై దాడి చేయకపోతే మిమ్మల్ని గ్రామ బహిష్కరణ చేస్తామని బెదిరించారని విమర్శించారు. దీంతో పెత్తందారు లతో కలిసి అమ్మాయి బంధువులు దాడి చేసి అనంతరం కరెంటు స్తంభానికి కట్టేశారని తెలిపారు. ఘటనకు కారణమైన పెత్తందార్లపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## ఉన్నత విద్యకోసం విదేశాలకు శృతిఓజా

- 16 నుంచి ఏడాదిపాటు సెలవు
- ఇంటర్ బోర్డు కార్యదర్శిగా శ్రీదేవసేనకు అదనపు బాధ్యతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా విదేశాలకు వెళ్తున్నారు. ఈనెల 16 నుంచి ఏడాదిపాటు ఆమె సెలవులో ఉంటారు. ఆమె విదేశాల్లో చదివేందుకు సెలవును మంజూరు చేసింది. ఇంటర్ బోర్డు కార్యదర్శిగా కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనకు పూర్తి అదనపు బాధ్యతల (ఎఫ్‌ఏసీ)ని ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం (జీవోనెంబర్ 1210) ఉత్తర్వులు విడుదల చేశారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం బ్లవట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ కోర్సును చదివేందుకు వెళ్తున్నారని తెలిపారు. ఆమెకు ఈనెల 16 నుంచి వచ్చే ఏడాది సెప్టెంబర్ 15 వరకు సెలవును మంజూరు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. సెలవులోనూ ఆమె జీతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. ఈ కాలంలో ఆమె విదేశాల్లో అసైన్‌మెంట్లు, కన్సల్టెన్సీలు, ఎన్జీవోల్లో పనిచేయడం నిషేధమని పేర్కొన్నారు. శృతి ఓజా సెలవులో ఉన్న ఈ ఏడాది కాలంపాటు శ్రీదేవసేన ఇంటర్ బోర్డు కార్యదర్శిగా, ఇంటర్ విద్యాశాఖ సంచాలకులుగా కొనసాగుతారని వివరించారు. ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణ ప్రతిష్టాత్మకంగా మారనుంది. బీఆర్‌ఎస్ హయాంలో ప్రశ్నాపత్రాల లీకేజీలు, ఇతర సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి.

## టీఎక్స్ ఆస్పత్రిలో అరుదైన మెదడు శస్త్రచికిత్స




నవతెలంగాణ - హైదరాబాద్

ఆధునిక వైద్య శాస్త్రంలో మరో ముందడుగుగా, టీఎక్స్ ఆస్పత్రి వైద్యులు 26 ఏండ్ల యువకుడికి అరుదైన, క్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. రోగికి రోజుకు 5 నుంచి 10 సార్లు వచ్చే నిరంతర ఫోకల్ సీసర్స్ (మూర్ఛవ్యాధి)తో బాధపడుతుండేవారు. మెదడులోని ప్రసంగ ప్రాంతానికి సమీపంలో ఉన్న ట్యూమర్ ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. శస్త్రచికిత్స సమయంలో అది దెబ్బతింటే శాశ్వత ప్రసంగలోపం ఏర్పడే ప్రమాదం ఉంది. న్యూరో సర్జన్ డాక్టర్ నరేశ్ కుమార్ గజ్జల నేతత్వంలోని వైద్య బందం 'అవేక్ క్రానియోటమీ' అనే ప్రత్యేక శస్త్రచికిత్సను ఎంచుకుంది. ఈ విధానాన్ని ట్యూమర్లను తొలగించేందుకు ఉపయోగిస్తారు. 'అవేక్ క్రానియోటమీ'లో రోగి పూర్తి మెలకువలో ఉన్నప్పుడే ప్రసంగం, మోటార్ క్రియలను పరిశీలిస్తూ, పరీక్షలు చేస్తూ శస్త్రచికిత్స పూర్తి చేశారు. న్యూరో సర్జన్ డాక్టర్ నరేశ్ కుమార్ గజ్జల టీ ఎక్స్ గ్రూప్ ఆస్పత్రుల చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్ వోద్నాల మాట్లాడుతూ ట్యూమర్ పూర్తిగా తొలగించారని, రోగికి మూడు వారాల పాటు ఎలాంటి సీజర్స్ రాలేదని, పూర్తిగా కోలుకున్నాడని అన్నారు. డాక్టర్ కీర్తికర్ రెడ్డి, డాక్టర్ దీపక్ రాజు, రామిరెడ్డి రవీందర్ రెడ్డిల మేనేజ్‌మెంట్ బందం సహకారంతో ఈ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు.

# ఆత్మీయుల జ్ఞాపకాల్లో ఉత్తమ కామ్రేడ్



**న్యూఢిల్లీ :** కామ్రేడ్ సీతారాం ఏచూరి ఈ లోకాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోయారు. మనల్ని మనమే కొనుక్కుంటున్న గ్లోబలైజేషన్ కాలంలో, మనల్ని మనకి మిగల్చడానికి యుద్ధం చేసి వెళ్ళిపోయారు. స్నేహితులూ, అభిమానులూ ఇంకా కోలుకోలేదు. ఏచూరిది సైద్ధాంతిక బలం మాత్రమే అయితే అంత ఎఫెక్ట్ ఉండకపోయేది. ఏచూరిది అందమైన హృదయం, ఆత్మీయమైన ఆలింగనం, చల్లని కరస్పర్శ. వెరసి ఉత్తమ కామ్రేడ్‌కి ఒక ఫోటో కాపీ. ఏచూరి నిష్క్రమణ చేసిన గాయానికి స్నేహితులు, సన్నిహితులు ఏచూరి జ్ఞాపకాలనే మందుగా రాసుకుంటున్నారు. వాటిని మనతో పంచుకుంటున్నారు.



సిపి చంద్రశేఖర్

### స్నేహితులకు మాత్రమే తెల్సిన పంచ్ అది...

"'ఏదైనా సందర్భం వచ్చినప్పుడు...'వై ఏచూరి?' అంటే. 'వై నాట్ ఏచూరీ' అని నవ్వుతూ కౌంటర్ ఇచ్చేవాడు" అని ఆయన సన్నిహిత మిత్రుడు ప్రొఫెసర్ సిపి చంద్రశేఖర్ తన యూనివర్శిటీ రోజులను గుర్తుచేసుకున్నారు. అపర మేధావిగా, గొప్ప ప్రజాస్వామ్యవాదిగా వెలుగొందిన ఏచూరిలో సన్నిహితులకు మాత్రమే తెలిసిన హ్యూమర్ టచ్ ఇది. విషయం పట్ల అవగాహన కల్పించడంలో ఎంత ముందు ఉంటాడో, ఆ వాతావరణంలో జోష్ నింపడంలోనూ అంతే ముందు ఉంటాడు.

### ఏచూరి పేరు సీత

కామ్రేడ్ ఏచూరిగా, కామ్రేడ్ సీతారాంగా ప్రపంచానికి పరిచయం. కానీ ఆప్తులకు మాత్రం అతనెప్పుడూ సీతానే. స్నేహితులంతా ప్రేమగా సీతా... అనే పిలుస్తారు.' 'సీత' శాస్త్రీయ దృక్పథం ఎప్పుడూ ఛాంపియన్‌గా ఉండేది. మా తరానికి గొప్ప రాజకీయ, మేధో సంపత్తిని అందించడంలో కీలకపాత్ర పోషించాడు' అని జెఎన్‌యులో చదివేటప్పుడు ఏచూరితో హాస్టల్ రూమ్ పంచుకున్న ఆనంద్ కుమార్ అన్నారు.



గౌహర్ రజా

### స్టన్ అయిపోయాం...

"నాకు ఇప్పటికీ బాగా గుర్తు. అది 1970. నేనప్పుడు ఐఐటి ఢిల్లీలో చదువుతున్నాను. విద్యార్థి ఉద్యమం గురించి మాట్లాడేందుకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తరపున కామ్రేడ్ సునీత్ చోప్రా, సీతారాం మా యూనివర్శిటీకి వచ్చారు. ఆయన మాట్లాడుతున్నంత సేపూ అలానే చూస్తుండిపోయాం. ఒకరకంగా స్టన్ అయిపోయాం. ఆ ఆలోచనల్లో స్పష్టత, మార్క్సిస్ట్ అవగాహన, ప్రపంచవ్యాప్తంగా వివిధ ఉద్యమాలపై ఉన్న పరిజ్ఞానం, విప్లవాత్మక ఉత్సాహం అన్నీ ఒకదాన్ని మించి ఒకటి కనిపించాయి. అయితే ఇక్కడే ఇంకో గమ్మత్తు. అదే ఆయన మాటల్లో ఉన్న మరో బెస్ట్ క్వాలిటీ. ప్రసంగం చివరికి వచ్చేసరికి, ఉపన్యాసకుడు కాస్తా మాకు మిత్రుడైపోయాడు." అని శాస్త్రవేత్త, ఉర్దూ కవి, సామాజిక వేత్త, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్ గౌహర్ రజా ఆనాటి సంగతులను గుర్తు చేసుకున్నారు.

### సోషలిస్టు ప్రపంచాన్ని స్వప్నించాడు...

అదే గౌహర్ రజా మరో విషయాన్ని కూడా పంచుకున్నారు."ఎమర్జెన్సీ రోజుల్లో పోలీసు దాడులను ఎదుర్కొన్న విద్యార్థులను ఉద్దేశించి జెఎన్‌యు పాత లైబ్రరీలో ఓ రోజు సాయంత్రం సీతా అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. 'పోలీసుల దౌర్జన్యాన్ని వీరోచితంగా ఎదుర్కొన్న నా తోటి కామ్రేడ్లకు ఇవే నా విప్లవ వందనాలు' అంటూ ఆయన అన్న పలుకులు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. బహుశా అదే ఆయన తొలి నిరసన అనుకుంటా. ఆ తర్వాత దేశ రాజకీయాల్లో మా సీత అంచెలంచెలుగా ఎదిగిపోయాడు. ఎస్ఎఫ్ఐ నేత నుంచి కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా ఆయన ఎదిగిన తీరుకు ఎప్పుడూ గర్వపడుతూ ఉంటాను. మార్క్సిస్టు మేధావులు పి.సుందరయ్య, ఇఎంఎస్ నంబూద్రిపాద్, హరికిషన్ సింగ్ సూర్జిత్ వంటి ఉద్దండుల పక్కన సీతారామ్ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. అపారజ్ఞానం ఉన్న ఏచూరి కావాలనుకుంటే గొప్ప హోదా, దర్జా ఉన్న వృత్తిలో రాణించేవాడు. ఆయన శ్రామికవర్గ నేతృత్వంలో సమసమాజాన్ని విశ్వసించే పార్టీలో చేరాడు. సోషలిస్టు ప్రపంచం గురించి కలలు గన్నాడు. జీవితాంతం అందుకోసం పనిచేసి, కార్యకర్తలకు, మేధావులకు, రాజకీయ నాయకులకు గొప్ప స్ఫూర్తిగా నిలిచాడు. ఎంతోమందికి మార్గనిర్దేశం చేసిన నా కామ్రేడ్ సీతకు రెడ్ సెల్యూట్' ఇలా చెమర్చిన కళ్లతో రజా తన మాటలను ముగించారు.

# ఆఫ్రికాకు గోధుమ ఎగుమతులు పెంచుతున్నరష్యా



రష్యాలోని క్రాస్నోడార్ ప్రాంతం నుంచి 25 ఆఫ్రికన్ దేశాలకు గోధుమ ఎగుమతులు జనవరి - సెప్టెంబర్ 2024 మధ్య 14.4 శాతం పెరిగాయని, అవి మొత్తం 14.8 మిలియన్ టన్నులు అని సెంటర్ ఆఫ్ గ్రెయిన్ క్వాలిటీ అష్యూరెన్స్ బుధవారం ప్రకటించింది. రష్యా గోధుమలను పరిమాణంలో అత్యధికంగా దిగుమతి చేసుకునే మొదటి ఐదు ఆఫ్రికన్ దేశాలలో ఈజిప్ట్ (6.8 మిలియన్ టన్నులు), అల్జీరియా (1.3 మిలియన్ టన్నులు), కెన్యా (1.2 మిలియన్ టన్నులు), లిబియా (1.0 మిలియన్ టన్నులు), సూడాన్ (0.6 మిలియన్ టన్నులు) అని ప్రభుత్వ సంస్థ తెలిపింది.

ఈ సంవత్సరం ఆగస్టు 25-31లో రష్యా గోధుమలు క్రాస్నోడార్ రీజియన్ పోర్ట్‌ల నుంచి డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోకు 17.2 వేల టన్నులు, ఎరిట్రియాకు 31.5 వేల టన్నులు ఎగుమతి అయ్యాయి. "ఈ సంవత్సరం, గాంబియా, జిబౌటి, ఇథియోపియాలకు గోధుమ రవాణా తిరిగి ప్రారంభమైంది" అని సెంటర్ ప్రెస్ సర్వీస్ ప్రకటించింది. ఆ ప్రకటన ప్రకారం గోధుమలను ఎగుమతి చేయడానికి ముందు ప్రయోగశాలల్లో కఠినమైన నాణ్యత, భద్రతా పరీక్షలు చేయటం జరుగుతుంది. సీసం, కాడ్మియం, ఆర్సెనిక్, పాదరసం, మైకోటాక్సిన్లు, మలినాలు నుంచి కలుషితం వంటి విషపూరిత మూలకాలను పరీక్షలు కవర్ చేస్తాయి. సెంటర్ ఆఫ్ గ్రెయిన్ క్వాలిటీ అస్యూరెన్స్ రష్యాలోని ప్రధాన ధాన్యం ఉత్పత్తి చేసే ప్రాంతాల్లో 16 శాఖలను, 18 టెస్టింగ్ లేబొరేటరీలను నిర్వహిస్తోంది. ఇది వివరణాత్మక పరీక్ష ప్రోటోకాల్స్ ప్రకారం ఉత్పత్తి మదింపులను నిర్వహిస్తుంది. ఎగుమతిదారులకు భద్రత, నాణ్యత, జిఎమ్ఓ-రహిత ధృవపత్రాలను జారీ చేస్తుంది. అన్ని షిప్‌మెంట్‌లు దిగుమతి చేసుకునే దేశాల కఠినమైన అవసరాలకు అనుగుణంగా ఉండేలా చూస్తుంది.గత మే నెలలో జరిగిన అంతర్జాతీయ 'రష్యా' ఎగ్జిబిషన్‌లో ఆహార భద్రతపై ప్లీనరీ సెషన్‌లో రష్యా వ్యవసాయ మంత్రి ఒక్సానా లట్ మాట్లాడుతూ 2030 నాటికి ధాన్యం ఎగుమతులు 55 బిలియన్ డాలర్లకు పైగా పెరుగుతాయని, అందుకు అనుగుణంగా అధ్యక్షుడి లక్ష్యాలను చేరుకోవడానికి ఆరేండ్ల లోపు రష్యా రైతులు తమ ఉత్పత్తిని 25 శాతం పెంచుతారని తన మంత్రిత్వ శాఖ ఆశిస్తున్నట్టు ఆయన తెలిపాడు. దేశీయ ధాన్యం ఎగుమతిదారులు ఉత్తర ఆఫ్రికాలోని కీలక మార్కెట్లపై తమ దృష్టిని సారించనున్నట్టు మంత్రి ఆ తర్వాత ప్రకటించాడు. అదే నెలలో రష్యా మొరాకోకు ప్రధాన గోధుమ సరఫరాదారుగా మారింది. 2019 నుంచి ఈ స్థానాన్ని ఆక్రమించిన ఫ్రాన్స్‌ను రష్యా అధిగమించింది. స్థానిక వార్తా సంస్థ ప్రకారం, మొరాకో మేలో రష్యా నుంచి 61,800 టన్నుల గోధుమలను దిగుమతి చేసుకుంది. ఇది మొత్తం గోధుమ దిగుమతుల్లో దాదాపు 26 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. పోలాండ్ రెండవ అతిపెద్ద సరఫరాదారుగా ఉద్భవించగా, ఫ్రాన్స్ మూడవ స్థానానికి పడిపోయింది.

2021లో నమోదైన గణాంకాలతో పోలిస్తే 2030 నాటికి ఎగుమతులను 50 శాతం పెంచాలని దేశ వ్యవసాయ రంగానికి ఏప్రిల్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చాడు. ఆ సంవత్సరంలో రష్యా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 37 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. రష్యా ఆరు తక్కువ-ఆదాయ ఆఫ్రికా దేశాలకు 200,000 టన్నుల గోధుమలను ఉచితంగా పంపిణీ చేసిందని, ఇది రష్యా ఇప్పటివరకు నిర్వహించిన అతిపెద్ద మానవతా చొరవ అని ఫిబ్రవరిలో ప్రెసిడెంట్‌తో జరిగిన సమావేశంలో అప్పటి వ్యవసాయ మంత్రి డిమిత్రి పత్రుషెవ్ నివేదించింది.

ప్రపంచం

ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగింపుకు

# 'చర్చలు' ఏకైక మార్గం : చైనా

ఉక్రెయిన్, గాజా వివాదాలకు చర్చలే పరిష్కారం అని రక్షణ, భద్రతపై బీజింగ్ జియాంగ్‌షాన్ ఫోరమ్ ప్రారంభోత్సవంలో చైనా రక్షణ మంత్రి డాంగ్ జున్ అన్నాడు. ఈ సంవత్సరం మాస్కో, కీవ్‌ల ప్రతినిధులతో సహా దాదాపు 100 దేశాల నుంచి 20 మంది రక్షణ మంత్రులు, 700 మంది ప్రతినిధులకు వార్షిక ఈవెంట్ ఆతిథ్యం ఇస్తున్నది. సంఘర్షణల రాజకీయ పరిష్కారాలను సులభతరం చేయడం ద్వారా శాంతిని ప్రోత్సహించాలని సీనియర్ అధికారి ప్రపంచ శక్తులకు పిలుపునిచ్చాడు. "ఉక్రెయిన్‌లో సంక్షోభం, ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదం వంటి హాట్‌స్పాట్ సమస్యలను పరిష్కరించడానికి, శాంతి చర్చలను ప్రోత్సహించడం ఒక్కటే మార్గం. యుద్ధం, సంఘర్షణలో విజేతలు ఎవరూ ఉండరు, ఘర్షణతో ఫలితం ఏమీ ఉండదు" అని డాంగ్ అన్నాడు. "శాంతియుత అభివృద్ధి, సమ్మిళిత పాలన"ను ప్రోత్సహించాలని అన్ని దేశాలకు ఆయన పిలుపునిచ్చాడు.

సంఘర్షణ ఎంత తీవ్రంగా వున్నా మనం సంప్రదింపులను వదులుకోకూడదు. ఏదైనా సంఘర్షణకు అంతిమంగా ముగింపు సయోధ్యనే ఉంటుంది. డాంగ్ ప్రకారం, ప్రాంతీయ ఉద్రిక్తతలను పరిష్కరించడానికి, పొరుగు దేశాలు "ఐక్యత ద్వారా బలాన్ని వెతకాలి". ప్రపంచ స్థాయిలో, దేశాలు "ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో ఎప్పుడూ జోక్యం చేసుకోకూడదు, ఇతర దేశాల హక్కులు, ప్రయోజనాలను ఎప్పుడూ ఉల్లంఘించకూడదు." "ప్రపంచ భద్రతను పరిరక్షించడంలో ప్రధాన దేశాలు ముందుండాలి. జీరో-సమ్ మైండ్‌సెట్‌ను విడిచిపెట్టాలి. చిన్న, బలహీనులను బెదిరించడం మానుకోవాలి" అని ఆయన అన్నాడు.

రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య వివాదాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చైనా పదే పదే



చెబుతోంది. గత మే నెలలో బ్రిక్స్ భాగస్వామి బ్రెజిల్‌తో కలిసి సంక్షోభానికి దౌత్యపరమైన పరిష్కారంపై ఆరు పాయింట్ల ప్రతిపాదనను సమర్పించింది. ఈ ప్రణాళిక శాంతిని తీసుకురావడానికి ఏకైక మార్గంగా దౌత్యాన్ని సూచించింది. శాంతిని నెలకొల్పటానికి ఉద్దేశింపబడిన ఒక అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశానికి రష్యా ఉక్రెయిన్ రెండూ హాజరయ్యేలా చూడాలని సదరు ప్రణాళిక పేర్కొంది. ఈ వేసవిలో స్విట్జర్లాండ్‌లో జరిగిన సమావేశం రష్యా లేకుండానే నిర్వహించబడింది. ఈ సమావేశం కేవలం ఉక్రెయిన్ డిమాండ్లపై దృష్టి పెట్టటంతో వాటిని రష్యా పూర్తిగా తిరస్కరించింది.

ఉక్రెయిన్ వివాదాన్ని దౌత్యపరంగా పరిష్కరించడానికి తరచుగా ఆసక్తిని వ్యక్తం చేసే రష్యా సంభావ్య శాంతి పరిష్కారానికి పునాదిగా చైనా-బ్రెజిలియన్ ప్రణాళికను స్వాగతిస్తున్నట్టు గతంలో సంకేతాలు ఇచ్చింది. అయితే, కీవ్ చొరవను పరిగణనలోకి తీసుకోవడానికి నిరాకరించింది. ఈ వారం ప్రారంభంలో మెట్రోపోల్స్ న్యూస్‌తో మాట్లాడుతూ ఉక్రేనియన్ నాయకుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ ఈ ప్రతిపాదనను "విధ్వంసకరం" అని, బీజింగ్, బ్రెసిలియాలు రష్యాతో "కుమ్మక్కయ్యాయని" ఆరోపించాడు.

# పేకాట రాయుళ్ల అరెస్ట్

### 7 ఫోన్లు, రూ.20,550 నగదు స్వాధీనం

**నవతెలంగాణ-హయత్‌నగర్**

పేకాట ఆడుతున్న ఏడు గురిని ఎల్బీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున మన్సూరాబాద్ లో ఉన్న మారుతి రెసిడెన్సిలో చింతల ధనరాజ్ రెడ్డి, షెగి రెడ్డి పవన్ రెడ్డి, చేగురి వెంకట్ రెడ్డి, బుద్దుల శ్రీనివాస్ రెడ్డి, వంగురు మన్యం రెడ్డి, గొండి శ్రీనివాస్ రెడ్డి, గోండి రాజశేఖర్ రెడ్డిలు గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 52పేకాల కార్డులు, 7 సెల్ ఫోన్లు, రూ.20,550 నగదును స్వాధీనం చేసుకున్నారు. తదనంతరం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# ‘ సీఎంఆర్ఎఫ్ పేదలకు ఎంతో ఆసరా’

**నవతెలంగాణ-తుర్కయంజాల్**



నిరుపేదలకు సీఎం సహాయనిధి పథకం ఎంతో ఆసరా అని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య అన్నారు. పురపాలిక పరిధిలోని కమ్మగూడలో వివిధ సమస్యలతో చికిత్స పొందిన నలుగురు లబ్దిదారులకు రూ.1.75లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఐలయ్య శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే సదావకాశం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా దక్కిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, వెంకటేష్ యాదవ్, గౌని రాము గౌడ్, సురేష్, మహేష్, వార్డు ఆఫీసర్ గంగాధర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటాం



- దున్నేవాడిదే భూమి
- భుక్తిదారులకు న్యాయం చేస్తాం
- భూ బాధితులతో మల్లాపూర్‌లో ప్రత్యేక సమావేశం
- మంత్రి శ్రీధర్ బాబు

**నవతెలంగాణ-బడంగ్‌పేట్**

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు అండగా ఉంటామని, దున్నేవాడికే భూమిని దక్కే విధంగా కృషి చేస్తున్నారని రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మల్లాపూర్ గ్రామంలోని ఏ.వై.ఆర్.గార్డెన్‌లో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఇందిరమ్మ హయాంలో ఇచ్చిన భూములను బీఆర్ఎస్ పాలనలో లాక్కున్నారని భూ బాధితులు తమ గోడును విన్నవించుకున్నారని తెలిపారు. కాసువాగు భూములకు దొంగ డాక్యుమెంట్స్ సృష్టించి కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని నాదర్ గుల్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. దశాబ్దాలుగా సాగు చేసిన భూములను లాక్కొని ప్రభుత్వ బిల్డింగ్స్, లేఅవుట్ వేస్తూ.. మా కుటుంబాలను రోడ్డు పాలు చేశారని బడంగ్‌పేట, కుర్మల్‌గూడ, గుర్రంగూడ దళితులు ఆందోళన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. స్థలాల పట్టాలు ఇచ్చి పోజిషన్ చూపించకుండా సర్టిఫికెట్లతో సరిపెడుతున్నారని లబ్దిదారులు వాపోతున్నారని చెప్పారు. అయితే ఈ విషయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి.. రైతులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కబ్జాదారులపై ఉక్కుపాదం మోపేందుకే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా హైడ్రాను తీసుకొచ్చామని అన్నారు. చెరువులు, పార్కులు ఎక్కడెక్కడ కబ్జాలు అయ్యాయో రిపోర్టు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పీసీసీ కార్యదర్శి యల్మేటి అమరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, పుట్టగళ్ల జగన్, బొక్క జంగా రెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, గుడ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అథ్లెటిక్స్‌లో

# సుధీర్ ఫౌండేషన్ విద్యార్థులకు పతకాల పంట



**నవతెలంగాణ-హయత్ నగర్**

రంగారెడ్డి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ టోర్నమెంట్‌లో హయత్ నగర్‌కు చెందిన సుధీర్ ఫౌండేషన్‌లో ఉంటూ లిటిల్ స్టార్ స్కూల్‌లో చదువుతున్న పిల్లలు పతకాలు సాధించారు. కేటగిరిలో పి. సుబ్బు లాంగ్ జంప్ 6 మీటర్లు జమ్ చేసి స్వర్ణ పతకం సాధించారు. దివ్య అండర్ 14 విభాగంలో లాంగ్ జంప్‌లో స్వర్ణ పతకం, ఆర్. హర్ష అండర్ 12 విభాగంలో 400 మీటర్ రజిత పతకం, కార్తీక్ అండర్ 10 లాంగ్ జంప్ విభాగంలో రజిత పతకం సాధించారు.

సుధీర్ ఫౌండేషన్‌లో ఉంటున్న ఈ యొక్క ఫౌండేషన్ నుండి పి.సుబ్బు ఈ నెల19, 20 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీకి అర్హత సాధించాడు. రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయి నుండి జాతీయస్థాయి లో సాధించాలని స్కూల్ అథ్లెటిక్స్ కోచ్ నినావత్ గణేష్ అన్నారు.

# విప్లవ కెరటం ఏచూరికి ఘన నివాళులు



**నవతెలంగాణ-పెద్దఅంబర్‌పేట్**

20 దశాబ్దాలుగా భారత కమ్యూనిస్టు మార్క్సిస్ట్ పార్టీలో ఎన్నో ఉద్యమాలు నిర్మించి..కార్మిక, కర్షక మధ్యతరగతి ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు పరితపించే మహా నాయకుడు సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. తర్వాత సీపీఐ భూ పోరాట కేంద్రం రావి నారాయణరెడ్డి కాలనీ పేస్ 3లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బతి లక్ష్మణ్, కౌన్సిల్ సభ్యులు అజ్మీర్ హరిసింగ్, నవనీత, అరుణ, పొన్నాల యాదగిరి, మధు, దాసరి ప్రసాద్, దూపం నిరంజన్, సైదులు సుజాత, దేవమ్మ ఆవుల యాదగిరి, భూక్యా వినోద్ వీరేష్, క్రాంతి, సుభద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ -ఎల్బీనగర్**



సాగర్ రింగ్ రోడ్డు బస్టాండ్ వద్ద సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి సీఐటీయూ నాయకులు నివాళులర్పించారు. తర్వాత సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మనాయక్ హాజరై మాట్లాడారు.కామ్రేడ్ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండి చనిపోయే వరకు వామపక్ష భావాలతోనే నడిచారని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమాల్లో, పార్లమెంటరీ ఉద్యమాల్లో ఆయన ఎప్పుడూ ప్రజల పక్షామే వహించారని అన్నారు. పేద ప్రజల ఐక్యత కోసం కుల, మత వైశ్యామ్యాలు లేని భారత సమాజం కోసం కృషి చేశారని కొనియాడారు. వారి మృతి కమ్యూనిస్టు పార్టీల అనుబంధ సంఘాలకు, కార్మిక సంఘాలకు, ప్రజానీకానికి తీరనిలోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ అడ్డా అధ్యక్షులు లాట్ల లక్ష్మణ్, హమాలీ కార్మికుల నాయకులు కృష్ణ, యాదయ్య, వెంకటయ్య, సుధాకర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు నల్ల వెంకటయ్య, శాంతి కుమారి పాల్గొన్నారు.

**నవతెలంగాణ - ఎల్బీనగర్**



రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ సర్కిల్ ఆధ్వర్యంలో బోడిపూడి వెంకటేశ్వరరావు స్మారక కేంద్రం దిల్‌సుఖ్ నగర్‌లో సీపీఐ(ఎం) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. తర్వాత ఏచూరి చిత్రపటానికి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్, సర్కిల్ కమిటీ కార్యదర్శి సిహెచ్ వెంకన్నలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్, క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మల్లేష్, సీఐటీయూ కార్యదర్శి మల్లెపాక వీరయ్య, రజక సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సి మల్లేష్, కల్లిగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గాజుల అంజయ్య, కేవీపీఎస్ సర్కిల్ కార్యదర్శి ఎం కృష్ణ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - చంపాపేట్**

భారత కమ్యూనిస్టు పార్టీలకు, వామపక్ష ఉద్యమాలకు మార్గదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి



అని సీపీఐ(ఎం) పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ కొనియాడారు. గ్రేటర్ హైదరాబాద్ సౌత్ కమిటీ అండ్ మలక్‌పేట్ యాకుత్‌పురా జోన్ కమిటీ ఆధ్వర్యంలో అలం ఖుంద్ మీరి భవన్, సంతోష్ నగర్‌లో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ నాయకులు ఎం బాలు నాయక్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.విటల్, పి.నాగేశ్వర్, ఎల్.కోటయ్య, ఎం మీనా, జిల్లా కమిటీ నాయకులు, ఎం.శ్రావణ్ కుమార్, ఎస్.కిషన్, అబ్దుల్ సత్తార్, ఎం.లక్ష్మమ్మ పాల్గొన్నారు.

**నవతెలంగాణ - చంపాపేట్**



సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతరాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జె. వెంకటేశ్, ఎండి అబ్బాస్, ఈశ్వర్ రావు, పద్మశ్రీ, సీఐటీయూ హైదరాబాద్ సౌత్ సీఐటీయూ కార్యదర్శి శ్రావణ్ కుమార్, మీనా, కిషన్, సత్తయ్య, మురళి, కోటయ్య, జంగయ్య, రంకుమార్, సురేష్, బాబా పాల్గొన్నారు.

**నవతెలంగాణ - బడంగ్‌పేట్**



మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ చౌరస్తా, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కేంద్రంలో బాలాపూర్ మండల సీపీఐ (ఎం) పార్టీ కార్యదర్శి ఎం.యాదయ్య ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు



లర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు రాజలింగం, మీర్ పేట్ శాఖ కార్యదర్శి బి.ప్రకాష్, సీనియర్ నాయకులు యాదగిరి చారి, దాసరి బాబు, కార్మిక నాయకులు మల్లికార్జున్, మల్లేష్, యాదయ్య, దాసరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - వనస్థలిపురం**



సీపీఐ(ఎం) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు అని హయత్ నగర్ సర్కిల్ కమిటీ సభ్యులు తిరుమల సంధ్య, సాహెబ్ నగర్ శాఖ కార్యదర్శి కొత్త గణేష్ గౌడ్‌లు అన్నారు. బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లోని జెండా వద్ద ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎం కృష్ణ, పి నాగేందర్, బిక్షమయ్య గౌడ్, సుధాకర్ రెడ్డి, బి సంతోష, ఎం కవిత, సరిత, ముత్యాలు పాల్గొన్నారు.

### మెడికల్ కళాశాలను

# మంజూరు చేయించిన ఘనత సబితమ్మదే

### కార్పొరేటర్ బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి

**నవతెలంగాణ- బడంగ్‌పేట్**



మహేశ్వరం మండల కేంద్రంలో నూతనంగా మెడికల్ కళాశాలను మంజూరు చేయించిన ఘనత మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికే దక్కిందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో ఎంతో కృషి చేశారని, ఆయనను ఆ సమయంలోనే ఒప్పించి మహేశ్వరం మండలం కేంద్రంలో నూతనంగా మెడికల్ కళాశాలను మంజూరు చేయడం జరిగిందని గుర్తుచేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో నూతనంగా మెడికల్ కళాశాలను మంజూరు చేయడం వలన పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు.

# ‘బీసీ కులగణనను వెంటనే చేపట్టాలి’




**నవతెలంగాణ- నాగోల్**

రాష్ట్రంలో బీసీ కులగణనను వెంటనే చేపట్టాలని తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని శుక్రవారం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టకపోవడం వలన కొన్ని సంవత్సరాల నుంచి నిధుల కేటాయింపు, ఉద్యోగాల కేటాయింపు, విద్యారంగంలో, ఉపాధి రంగంలో, వెనుకబడి పడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కులాలు అట్టడుగు వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పురోగతి చెందడానికి ఈ కులగణన ఎంతో అవసరం అని రాష్ట్ర కమిటీ భావిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును పరిగణలోకి తీసుకొని వెంటనే కులగణన జరపడానికి శాఖా పరమైనటువంటి చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంపీటీసీ పగిళ్ల జోజీ, రజక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి బి. చుక్కయ్య, నరసింహారావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలి’



**నవతెలంగాణ - చంపాపేట్**

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ “ఏక్ పేడ్ మా కే నామ్” పిలుపు మేరకు హార్టికల్చర్ డిపార్ట్మెంట్ వారు ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీ నగర్ కాలనీలో అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి, దానికి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, హార్టికల్చర్ మేనేజర్ యమున, హార్టికల్చర్ సుష్మ, ఆనందమార్గ స్కూల్ స్టూడెంట్స్, సీఎస్ రెడ్డి, రమేష్, వేణు, మధు, రవి, యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.

**నవతెలంగాణ -నాగోల్**

తమ తమ పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నేను మా అమ్మ పేరిట ఒక మొక్క నాటాను, మీరు కూడా మీ అమ్మకి గుర్తుగా ఒక మొక్కను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఏఈ మేధ, సూపర్వైజర్ మానస, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, కాలనీ వాసులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




### పెద్ద అంబర్‌పేట్

# మున్సిపాలిటీ చైర్ పర్సన్‌పై అవిశ్వాస వేటు

- 24 మంది కౌన్సిలర్లలో 17 మంది అవిశ్వాసానికి మద్దతు
- పదవి కోల్పోయిన చెవుల స్వప్న
- ఇన్‌చార్జి చైర్ పర్సన్‌గా చామ సంపూర్ణ రెడ్డి





**నవతెలంగాణ-పెద్దఅంబర్‌పేట్**

రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై శుక్రవారం సొంత పార్టీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో చెవుల స్వప్న తన చైర్ పర్సన్ పదవిని కోల్పోయారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు తన సొంత పార్టీకి చెందిన చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు తట్టి అన్నారంలోని వార్డు కార్యాలయంలో అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నిరూపణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లకు 17 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి చేతులు ఎత్తి తమ మద్దతు తెలిపారు. దీంతో చైర్ పర్సన్ చెవుల స్వప్న తన పదవిని కోల్పోయారని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు.

తదుపరి కార్యాచరణ అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో కొనసాగుతుంది. కాబోయే నూతన చైర్మెన్ ఎవరు అనేది వేచి చూడాల్సి ఉంది. ఇప్పటివరకు వైస్ చైర్మెన్‌గా ఉన్న చామ సంపూర్ణ రెడ్డి ఇంచార్జి మున్సిపల్ చైర్మెన్‌గా ఉంటారని ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. అవిశ్వాసానికి మద్దతు తెలిపిన కౌన్సిలర్లలో వడ్డేపల్లి విద్యావతి, గ్యారాల శ్రీనివాస్, పండుగుల జయశ్రీ, పసలు రాజేందర్, జోర్కా గీత, ఓరుగంటి సుజాత, చల్లూరు మురళీధర్ రెడ్డి, చెవుల హరిశంకర్, సిద్ధంకి కృష్ణారెడ్డి, తొండపు రోహిణి, కందాడి అనుపమ, పాశం అర్చన, మండలి కోటేశ్వర రావు, దండెం కృష్ణారెడ్డి, పబ్బతి లక్ష్మణ్, మద్ది నరేందర్ రెడ్డి, పరశురాంలు తమ మద్దతు పలికారు.

మహేశ్వరం నియోజక వర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల అర్జున్, తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు అక్రమ అరెస్టు చేసి, పహడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**నవతెలంగాణ - బడంగ్‌పేట్**





గోల్నాక డివిజన్ పరిధిలోని తిరుమల్ నగర్‌లో వెంకటాద్రి హైట్స్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలినేని రామ్మోహన్ రావు, నిర్వాహకులు రాజ్ కుమార్, రామారావు, శీను, ప్రశాంత్, జయేష్ పీటర్, రాజు, వర్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట


నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
హైదరాబాద్
శనివారం | సెప్టెంబర్ 14, 2024 | www.navatelangana.com


## వినాయకునికి ప్రత్యేక పూజలు..

**నవతెలంగాణ-సుల్తాన్ బజార్**

అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్- 14 డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకునికి కంప్యూటర్ ఆపరేటర్‌లు రాజేష్, రంజిత్, నాగరాజు, రాజన్ కుమార్, ఓఎస్ మహేందర్ కుమార్, రాజేష్, టి.ఐ కైలాష్, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## పేదల ఇండ్లను తొలగించడం ఆపాలి



- సీపీఐ(ఎం) అంబర్‌పేట్ జోన్ కన్వీనర్ మహేందర్

**నవతెలంగాణ-అంబర్‌పేట**

మూసీ డెవలప్మెంట్ పేరుతో పేదల ఇండ్లను తొలగించడం వెంటనే ఆపాలని లేనియెడల ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సీపీఐ(ఎం) అంబర్పేట్ జోన్ కన్వీనర్ మహేందర్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట ఎమ్మార్వో కార్యాలయం ముందు పార్టీ ఆధ్వర్యంలో మూసీ పరివాహక ప్రాంత బాధితులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధి పేరుతో మూసీ పరివాహక ప్రాంత ప్రజానీకాన్ని భయాందోళన గురి చేస్తున్నారని తెలిపారు. మూసీ నదిని లండన్ తరహా సింగపూర్ తరహా అభివృద్ధి చేసి ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి తహతహలా డుతున్నారని, ఈ నది పరివాహక ప్రాంతంలో నివాస ముంటున్న పేదలందరి ఇండ్లు తొలగించి సిటీ బయటకి గెంటేసి ఇక్కడ అభివృద్ధి చేయాలని చూస్తున్నారని అన్నారు. ఇప్పటికే ప్రపంచ బ్యాంకు ఒప్పందంలో భాగంగా 58 వేల కోట్ల రూపాయలు మంజూరు చేసుకొని మూసి నదిలో స్వచ్ఛమైన నీటిలో పడవలు షాపింగ్ మాల్స్ పార్కులు అభివృద్ధి చేయాలని చూస్తూ మనల్ని అభివృద్ధికి దూరంగా గెంటివేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. దీన్ని ప్రజలందరూ గమనించి పేద ప్రజానీకాన్ని అభివృద్ధికి దూరంగా ఉంచే కుట్రను బట్టబయలు చేయాలని పిలుపునిచ్చారు. పేదలు కార్మికులు రూపాయి, రూపాయి కూడబెట్టి వారి చెమటనంత ధారపోసి 50 గజాలు, 100 గజాలలో ఇల్లు కట్టుకొని నివాసం ఉంటుంటే మూసీ నది డెవలప్మెంట్‌కు ఆటంకంగా ఈ మురికివాడలు ఉన్నాయని తొలగించడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. వెంటనే ఈ చర్యలను ఉపసంహరించుకోవాలని అభివృద్ధిలో మూసి పరివాహక ప్రాంత ప్రజానీకాన్ని భాగస్తులు చేయాలని కోరారు. వారికి అన్ని అభివద్ధి ఫలాలు అందాలని ప్రభుత్వానికి సూచించారు, మూసి పరివాహక ప్రాంత ప్రజల ఇండ్లు తొలగించే ప్రతిపాదన విరమించుకోకపోతే భవిష్యత్తులో అనేక పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజల సమస్యను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ అంబర్‌పేట జోన్ కమిటీ సభ్యులు జి రాములు, షబానా, అఖిల్, వరలక్ష్మి, బస్తీ వాసులు మహేష్, ఉమాదేవి, దుర్గా, శివ, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రుల కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలి



- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మెన్ జి.చెన్నయ్య

**నవతెలంగాణ-హిమాయత్ నగర్**

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మెన్ జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జి.చెన్నయ్య మాట్లాడారు. వర్గీకరణ అమలు కోసం మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడాన్ని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా వర్గీకరణ అమలు పేరుతో కమిటి వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తమ సమితి భావిస్తుందన్నారు. ఏకపక్షంగా ఉన్న ఈ మంత్రుల కమిటితో తెలంగాణలో మాల, మాల అనుబంధ కులాలకు ఏమాత్రం న్యాయం జరగదన్నారు. ఏ ఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియస్తారని ఆయన ప్రశ్నించారు. వర్గీకరణ కోసం ప్రభుత్వ డబ్బులు ఖర్చు పెట్టి దగ్గరుండి కథ నడిపించిన మంత్రి దామోదర రాజ నర్సింహ కమిటీలో ఉండగా మాలలకు ఎలా న్యాయం జరుగుతుందన్నారు. అసలు ప్రభుత్వం ఏకపక్షంగా వర్గీకరణ అమలు చేయాలనుకున్న ప్పుడు మంత్రుల కమిటీ ఎందుకు అని ప్రశ్నించారు. ఇదంతా మాలలను, మాల ఉప కులాలను మోసం చేయడానికే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. తెలంగాణలో మాదిగల జనాభా కంటే మాల, మాల ఉపకులాల జనాభా ఎక్కువగా ఉంటుందని, కాబట్టి ఉత్తమ్ కుమార్ రెడ్డి కమిటీతో మాలలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మంత్రుల కమిటీని వెంటనే రద్దు చేసి సిట్టింగ్ న్యాయమూర్తి నేతత్వంలో కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్సీల జనాభా లెక్కలు సేకరించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఇలాగే మొండిగా నిర్ణయాలు తీసుకుంటే గతంలో చంద్రబాబుకు పట్టిన గతి తెలంగాణ కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. పోరాట సమితి కో-కన్వీనర్లు బూర్గుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, బత్తుల రాంప్రసాద్, గోపోజు రమేష్, బేరా బాలకృష్ణ, జంగా శ్రీనివాస్, ఆవుల సుదీర్, మారుతి ఉన్నారు.

## ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు..



**నవతెలంగాణ-ధూల్ పేట్**

సీతరాం ఏచూరి మరణం కార్మిక, వామపక్ష, ప్రజా ఉద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎం) నగర నాయకులు జె. వెంకటేష్, ఎండీ అబ్బాస్, ఈశ్వర్ రావు, పద్మశ్రీ లు అన్నారు. సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో.. ఆయన చిత్ర పటానికి కమిటీ నాయకులతో కలిసి పులమాలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి కమ్యూనిస్టు నాయకున్ని సీపీఐ(ఎం) కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో జరిగే రాజకీయాలకి పోరాటం ముమ్మరం చేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సౌత్ కార్యదర్శి శ్రావణ్ కుమార్, మీనా, కిషన్, సత్తయ్య, మురళి, కోటయ్య, జంగయ్య, రంకుమార్, సురేష్, బాబా తదితరులు పాల్గొన్నారు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి : సీపీఐ(ఎం) నేత పి.నాగేశ్వర్

**ధూల్ పేట్ :** భారత దేశ కమ్యూనిస్టు యోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సీపీఐ(ఎం) హైదరబాద్ సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నాగేశ్వర్ అన్నారు. ఆయన అకాల మరణం యావత్ కార్మిక, ఉద్యమకారులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. శుక్రవారం ఏచూరి చిత్రపటానికి మహారాజ్ గంజిలోని కార్మికుల సమక్షంలో కార్మిక నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి దేశ కమ్యూనిస్టు యోధుడుగా ఘనమైన పాత్ర పోషించారన్నారు. విద్యార్థి దశ నుండే మెరుగైన సమాజం నిర్మాణం కోసం పోరాటం ప్రారంభించిన ఆయన ఇటీవలి కాలం వరకు దేశం లోని అన్ని రాజకీయ పార్టీలు మెచ్చుకునే పాత్ర పోషించారని కొనియాడారు. "బెస్ట్ పార్లమెంటేరియన్" అవార్డు పొందిన అరుదైన వ్యక్తుల్లో ఆయన ఒకరని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు మరింత పట్టుదలగా ప్రజా ఉద్యమాలు చేయడమే ఆయనకు అర్పించే నివాళి అని చెప్పారు. స్థానిక సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శి ఆర్.సాయిలు, కార్మిక నాయకులు పి.కర్మయ్య, ఉప్పలయ్య కార్యకర్తలు శివాజీ, బంధేశ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



### ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు: బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్

**ముషీరాబాద్:** ఏచూరి మరణం పేదలకు, కమ్యూనిస్టు ఉద్యమాని కి లౌకికవాదానికి తీరనిలోటని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ అన్నారు. శుక్రవారం బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ సమాజం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. ఏచూరి రాజకీయ నిబద్ధత అందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి మారయ్య, రాష్ట్ర కార్యదర్శులు మరతి, వి.రాంబాబు యాదవ్, రమేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.





గాంధీనగర్ డివిజన్ లోని గణేష్ మండపాలను కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బీజేపీ నాయకులు మదన్మోహన్, సాయి కుమార్, సత్యం, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ముషీరాబాద్

# ఏచూరి మరణం దేశానికి తీరని లోటు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు
- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ఎస్ఎఫ్ఐ పూర్వ జాతీయాధ్యక్షులు సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని ఎస్ఎఫ్ఐ పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం రత్నా జూనియర్ కాలేజీలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి జోహార్లు తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ 1974లో ఎస్ఎఫ్ఐలో చేరిన సీతారామ్ ఏచూరి జేఎన్‌యూలో యూనివర్సిటీ సమస్యలపై పోరాడారని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థి హక్కులపై పోరాడుతూనే.. ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ ముందు ధైర్యంగా నిలబడి కొట్లాడారని గుర్తుచేశారు. 1977-78లో వరుసగా 3 సార్లు జేఎన్‌యూ



విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తు చేశారు. 1984లో జాతీయ అధ్యక్షులుగా పనిచేశారని ఆ కాలంలో దేశంలో ఎస్ఎఫ్ఐ ఎన్ని నిర్బంధాలు ఎదుర్కొని బలమైన విద్యార్థి సంఘంగా అన్ని విశ్వవిద్యాలయాలలో విజయ బహుట ఎగురవేసిందని తెలిపారు. విద్యార్థి సంఘంలో పనిచేస్తున్న సమయంలో అనేక ఉద్యమాలు, పోరాటాల గురించి అధ్యయనం చేస్తూనే ప్రపంచ దేశాలలో కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమాలకు అండగా నిలిచారన్నారు. దేశంలో అణగారిన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, సామాజిక తరగతుల హక్కులకు అలుపెరగని ఉద్యమాలు చేశారన్నారు. పార్లమెంటులో హక్కుల కోసం , రాజ్యాంగ రక్షణ కోసం పోరాడారని కొనియాడారు. దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందన్నారు. వారి మరణానికి తీవ్ర సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, చరణ్ శ్రీ, సహాయ కార్యదర్శి ప్రశాంత్, నాయకులు భగత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాలుగా క్రీడాకారులకు అన్యాయం



- తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం అధ్యక్షులు, మాజీ సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర రెడ్డి
- తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) ఆవిర్భావం, లోగో ఆవిష్కరణ

**నవతెలంగాణ-హిమాయత్ నగర్**

రాష్ట్రంలో క్రికెట్ క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం, సౌకర్యాలు లేక దశాబ్దాలుగా అన్యాయం జరుగుతున్నదని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం అధ్యక్షులు, మాజీ సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర రెడ్డి అన్నారు.శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) ఆవిర్భవ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా క్రికెట్ సంఘం లోగోను సభకు ముఖ్య అతిథులుగా హాజరైన వెంకటేశ్వర రెడ్డితో పాటు ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ కె.వి.రమణాచారి, రాష్ట్ర పేట్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవరెడ్డి కలిసి ఆవిష్కరించారు.అనంతరం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ క్రికెట్ క్రీడాభివృద్ధికి, ప్రతిభ కలిగిన క్రీడాకారులు అంతర్జాతీయ వేదికల్లో ఆడే విధంగా అన్ని రకాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం నుంచి టీడీసీఏ సాధించడానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. మాజీ రిటైర్డ్ ఐఏఎస్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, అధికారులకు టీడీసీఏ ఆవశ్యకత, ప్రత్యేకతను వివరించి గ్రామీణ క్రికెట్ క్రీడాకారులకు అన్ని రకాల ప్రోత్సాహం అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల నుంచి 300 మంది క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిరంకుశ పాలనపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు..



- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్

**నవతెలంగాణ-ముషీరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలనపై రాష్ట్ర ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్ అన్నారు. ఆయనను శుక్రవారం రామ్ నగర్‌లోని ఆయన నివాసంలో వారాసిగూడ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నిరంకుశ పాలన కొనసాగిస్తున్నారని సరైన అవగాహన లేకుండా పరిపాలిస్తున్నారన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేల విషయంలో ప్రభుత్వ పక్షం ఉన్న ఎమ్మెల్యేను అరెస్టు చేయకుండా ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యేను హౌస్ అరెస్ట్ చేయడం, ఎమ్మెల్యే ఇంటిపై దాడులకు పాల్పడడంలో ప్రభుత్వ అంతర్యం ఏమిటో రేవంత్ రెడ్డి తెలపాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై గుడ్లు, టమాటాలు రాళ్లతో దాడి చేయడం బాధాకరమన్నారు. ఆ ఘటనలో పోలీసుల వైఫల్యం స్పష్టమవుతున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఈ వ్యవహారాన్ని గమనిస్తున్నారని ప్రజలే కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తారన్నారు. ప్రభుత్వం ప్రజాపాలనని పక్కదారి పట్టిస్తూ పథకాల అమలు అందరూ మరిచిపోయే విధంగా చేయాలన్న ఉద్దేశంతో ఇలా చేస్తోందన్నారు. ఇకనైనా ప్రభుత్వం దాడుల పైన దృష్టి కాకుండా ప్రజాపాలన పైన దృష్టి పెట్టాలని కోరారు.

## బీసీ జాగృతి సేన తెలుగు రాష్ట్రాల అధ్యక్షులుగా కృష్ణ యాదవ్



**నవతెలంగాణ-ముషీరాబాద్**

బీసీ జాగతి సేన తెలుగు రాష్ట్రాల అధ్యక్షులుగా బూరుగుపల్లి కృష్ణ యాదవ్ ఎన్నికయ్యారు. శుక్రవారం విద్యానగర్ బీసీ భవన్‌లో బూరుగుపల్లి కృష్ణ యాదవ్‌కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండు తెలుగు రాష్ట్రాల బాధ్యతలను అప్పజెప్పిన కృష్ణయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. చట్టసభల్లో రిజర్వేషన్లతో పాటు విద్యా ఉద్యోగ ఉపాధి హార్దిక పారిశ్రామిక ప్రయివేటు రంగాలలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల సాధనకై బీసీ జాగతి సేన ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తెలిపారు.

## బీసీలకు రాజకీయంగా వాటా ఇవ్వాలి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

**నవతెలంగాణ-ముషీరాబాద్**

బీసీలకు జనాభాకు అనుగుణంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పాటు రాజకీయంగా వాటా ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్. కృష్ణయ్య అన్నారు. శుక్రవారం విద్యానగర్ బీసీ భవన్‌లో ఎంపీ ఆర్. కృష్ణయ్య జన్మదిన వేడుకలు బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గువ్వల భరత్ కుమార్ ఆధ్వర్యంలో.. ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లపై చర్చ జరుగుతున్నదని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. లేనిపక్షంలో దేశంలో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీసీ జాతి అభివృద్ధి కోసం పోరాడు తూనే ఉన్నానని ఇకముందు కూడా వారి హక్కుల కోసం పోరాడుతానని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశంలో బీసీలు కూడా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మోడీ చొరవ తీసుకుని వెంటనే పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఉన్నత విద్య ప్రమాణాలను మెరుగుపరిచి బీసీలకు విద్య



అందే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీల ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఆర్ కష్ణయ్య జన్మదినం సందర్భంగా రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని మోడీ, కేంద్రమంత్రి అమీషా, కేంద్ర మంత్రులు, రెండు రాష్ట్రాల మంత్రులు, ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బి.సి సంఘం నాయకులు ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ, గోరేగే మల్లేశ్ యాదవ్, గవ్వల భరత్, గుజ్జ సత్యం, లాల్ కృష్ణ, నీల వెంకటేష్, నందా గోపాల్, రాజేందర్, అనంతయ్య, బర్క కృష్ణ, కృష్ణుడు, పర్థీవ గౌడ్, రమాదేవి, లక్ష్మి, నిఖిల్ పాల్గొన్నారు.

## మద్యానికి బానిసైన వారికి కౌన్సిలింగ్..

- ఉచితంగా వైద్యం మందులు అందిస్తున్నాం..
- కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ నివేదిత

**నవతెలంగాణ-సుల్తాన్ బజార్**

మద్యానికి బానిసైన వారికి కౌన్సెలింగ్ అందించి వారిలో మార్పును తీసుకు వస్తున్నామని కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ నివేదిత అన్నారు. శుక్రవారం ఆమె చాంబర్ మాట్లాడుతూ.. ఆల్కహాల్ (మద్యం, మందు కల్లు) సేవించడం వల్ల జ్ఞాపకశక్తి కోల్పోతారని తెలిపారు. మద్యం సేవించిన వారిలో ఎముకలు బలహీనపడడం, రక్త విరోచనాలు, గుండె జబ్బులు, ఊపితిత్తులు దెబ్బతినడం, పెరాలసిస్ లాంటి వ్యాధులు వస్తాయన్నారు. మద్యానికి బానిస కాకూడదని సూచించారు. ఇప్పుడు ఎక్కువగా మందు కల్లు సేవించి దానికి బానిసై మానలేక తీవ్ర మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళ రోగులు ఎక్కువగా వస్తున్నారని తెలిపారు. స్త్రీలు గర్భంతో ఉన్నప్పుడు మందు కల్లు, మద్యం సేవించడం వల్ల అది నేరుగా బిడ్డపై ప్రభావం పడి బిడ్డ బలహీనం గా, బుద్ధిమద్యం, ఎదుగుదల లోపం ఉంటుందన్నారు. మద్యాన్ని సడన్‌గా మానేయడం వల్ల కూడా ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి వారికి కుటుంబం అండగా నిలవాలని కోరారు. తమ వద్దకు వచ్చిన రోగులకు కౌన్సిలింగ్ నిర్వహించి, వారికి మందులను ఉచితంగా అందిస్తున్నా మన్నారు. ప్రతి ఒక్కరూ పోషకాలతో కూడిన బలమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. వైద్యుని సలహాలు పాటిస్తూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని కోరారు. ఇప్పటివరకు 80 శాతం మద్యాహ్నానికి బానిసై మానసిక రుగ్మతులతో తమ వద్దకు వస్తున్న రోగులను పరీక్షించి మందులను అందిస్తున్నామన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని ప్రజలకు సూచించారు.



## విజ్ఞానం కావాలంటే విజ్ఞాన కేంద్రానికి రావాలి



- ఎల్ఐసీ సీనియర్ డివిజన్ మేనేజర్ ప్రమోద్ కుమార్
- పిల్లల లైబ్రరీ కి "ఎల్ఐసీ" కంప్యూటర్ బహుకరణ

**నవతెలంగాణ-ముషీరాబాద్**

విజ్ఞానం కావాలంటే సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి రావాలని ఎల్ఐసీ సినియర్ డివిజన్ మేనేజర్ ప్రమోద్ కుమార్ అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పిల్లల లైబ్రరీకి ఎల్ఐసీ సంస్థ కంప్యూటర్‌లను అందజేసింది. ఈ సందర్భంగా ఎల్ఐసీ సినియర్ డివిజన్ మేనేజర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ బాలోత్సవం బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్‌గా మారిన తరుణంలో పిల్లలో పఠనం ఒక జీవన విధానంగా పుస్తకాలు దారి దీపాలుగా వెలిగిస్తున్న తెలంగాణ బాలోత్సవాన్ని అభినందించారు. మనిషికి అక్షరానికి విడదీయరాని సంబంధం ఉందని జీవితం నుండి అక్షరాలను అక్షరాల నుండి జీవితాన్ని వెతుక్కోవడం ఎప్పటి నుండో వస్తున్నదన్నారు. బాల్యంలో పుస్తక పఠనను ఆసక్తి కలిగించే నిర్ణయాలు తీసుకోవడం తెలంగాణ బాలోత్సవం ఎనలేని కృషి సాధించిందని తెలిపారు. పుస్తక పఠనం చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని అటువంటి తరుణంలో చిన్నారుల లైబ్రరీ ప్రారంభించడం పఠనాసక్తి పెంపొందించడంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. అందుకు అభినందనీయంగా బారతీయ జీవిత బీమా సంస్థ కంప్యూటర్లు ఇచ్చి ప్రొత్సహిస్తున్నామని తెలిపారు. ఎల్ఐసీ మార్కెట్ మేనేజర్ ఎం.ప్రసాద్ రావు మాట్లాడుతూ ఒక జాతి సంస్కతిని, నాగరికతను పది కాలాల పాటు పదిల పరిచే ఆలయం గ్రంథాలయం అని మౌన విద్యాలయం అని అన్నారు. విజ్ఞానం కావాలంటే విజ్ఞాన కేంద్రం కు రావాలి అన్నట్టు ఉందన్నారు. బావి భారత పౌరులను తయారు చేసే తెలంగాణ బాలోత్సవంనకు భవిష్యత్తులో తప్పకుండా సహాయం చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ మార్కెట్ సెల్స్ మెనేజర్ టి.రామచంద్రన్ ఎల్ఐసీ ప్రొడక్ట్ మేనేజర్ రవీంద్ర మైథిలి, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్ సోమయ్య, ఉపాధ్యక్షురాలు కే సుజావతి, జి.బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ గుండు వద్ద విశాల్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గల్లీ వాలా గణేష్ మండపంలో అన్నదాన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్ పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-ముషీరాబాద్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
11
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శనివారం | సెప్టెంబర్ 14, 2024 | www.navatelangana.com

# పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 129 డివిజన్ పరిధిలోని సూరారం విశ్వకర్మ కాలనీలో ఓ ఇంటిపై సివిల్ సప్లై విజిలెన్స్.. స్థానిక సూరారం పోలీసులు ఓ ఇంటి పై దాడి చేసి దాదాపు 60 - 80 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ బియ్య అక్రమ రవాణా కొనసాగుతుందన్న సమాచారం మేరకు.. దాడులు నిర్వహించినట్లు పోలీసులు వెల్లడించారు. విశ్వకర్మ కాలనీలో అర్జున్ పాండే అనే వ్యక్తి కొంతమంది వ్యక్తుల ద్వారా ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నాడన్నారు. పేదలకు అందే పీడీఎస్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా తరలించిన, కొనుగోలు చేసిన, అమ్మిన కఠిన చర్యలు తప్పవని సూరారం పోలీసులు హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ- కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్‌ని శుక్రవారం షాపూర్ నగర్‌లోని తన నివాసం వద్ద పలు కాలనీలు, బస్తీల నుంచి ప్రజలు కలిశారు. వినాయక నిమజ్జనం, ఇతర శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేశారు. పలువురు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. వాటిని స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

బౌరంపేట 11కేవీ ఫీడర్‌లో కొత్త సర్వీస్ కనెక్షన్ మెయింటెనెన్స్ పనుల కోసం.. నేడు ఉదయం 11 :30 గం॥ నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ప్రణీత్ నేచర్ బౌంటీ, కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్ వుడ్, జేఎస్ఎస్ విల్లాస్, స్టెర్లింగ్ హోమ్స్, శంభీపూర్ విలేజ్ ప్రాంతాలలో అలాగే బొల్లారం సబ్‌స్టేషన్ నుంచి మధ్యాహ్నం 1.00 గం॥ నుంచి 1.30 గం వరకు బాలాజీ వెంచర్, ప్రణీత్ రత్నాలు, కోటక్ నిర్మాణం, ఆంధ్రా బ్యాంక్ వెనుక వైపు, సీవీఆర్ నిర్మాణం బౌరంపేట్ కేబుల్ విలేజ్ ఫీడర్ లో మధ్యాహ్నం 12.00 నుండి 12.30 ని వరకు బౌరంపేట్ విలేజ్, ప్రణీత్ బ్లూమ్స్, ఆకాశ డెవలపర్స్, డీజే హోమ్స్, ల్యాండ్‌మార్క్, సుకృతి హోమ్స్, ఎస్ ఆర్ కే హోమ్స్‌లో ఉదయం 10.00 గం॥ నుంచి 11.30॥ని ల వరకు డిఆర్‌కె ఇంజినీరింగ్ కళాశాల, కేఎల్ విశ్వవిద్యాలయం, డాలర్ డ్రీమ్స్, సింహపురి కాలనీ, గోకుల్ బృదావనం, నెస్ట్ విల్లాస్, ఎస్‌బిఐ కాలనీలో ఉదయం 11.30 ॥ని నుండి మధ్యాహ్న 1.00 గం॥ వరకు లక్ష్మీనగర్ ఫీడర్లో లక్ష్మీనగర్, సూరారం గ్రామం, అయ్యప్ప సొసైటీ, విశ్వకర్మ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఈ విద్యుత్ అంతరాయనికి ప్రజల సహకరించాలని బౌరంపేట విద్యుత్ శాఖ ఏఈ బి.సాయికిరణ్ తెలిపారు.

# సీతారాం ఏచూరి మరణం.. వామపక్ష ఉద్యమానికి తీరని లోటు







నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా షాపూర్ నగర్ సీపీఐ(ఎం) కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ... భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అఖిలభారత ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం దేశ ప్రజా ఉద్యమాలకు, వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. ఎమర్జెన్సీ టైంలో ఇందిరాగాంధీని వైస్ ఛాన్సలర్‌గా ఉండొద్దని విద్యార్థినేతగా ప్రశ్నించిన యోధుడని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ, సీపీఐ(ఎం) జాతీయ రాజకీయాల్లో దేశ సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుకు బీజం వేసిన నాయకులు కామ్రేడ్ సీతారాం ఏచూరి అన్నారు. దేశ ప్రజలను సంఘటితం చేస్తూ... ఉపాధి హామీ చట్టం తెచ్చి కార్మిక వర్గాలల్లో వెలుగు నింపిన మహెూన్నత వ్యక్తి ఏచూరి అని పేర్కొన్నారు. సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు ప్రధానంగా సీపీఐ(ఎం) ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు ఈ.దేవదానం, ఆర్.స్వాతి, కె.శ్రీనివాస్, టీవీఎస్ రమణ, జి.వెంకన్న, సైదులు, మైసయ్య, మల్లారెడ్డి, శ్రీశైలం, పార్టీ కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

### సీతారాం ఏచూరి మరణం దేశ ప్రజల ఉద్యమానికి తీరని లోటు : సీపీఐ కార్యదర్శి ఉమా మహేష్

జగద్గిరిగుట్ట : కమ్యూనిస్టు ధ్రువతార, సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం దేశ ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నం, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్‌లు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, జగద్గిరినగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఐ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పేద ప్రజల వైపు మాట్లాడుతూ ఈ దేశంలో వామపక్ష పార్టీల ఐక్యత కోసం పాటుపడ్డారని, అనేక పోరాటాలకు నాయకత్వం వహించి గొప్ప వక్తగా, పార్లమెంటేరియన్‌గా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కమ్యూనిస్టు కృషి చేయాలని వ్యాఖ్యానించారు. జోహార్ సీతారాం ఏచూరి.. జోహార్.. జోహార్..అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు వి.హరనాథ్ రావు, ఏఐటీయూసీ కార్యదర్శి వంగాల శ్రీనివాస్, శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, మునిసిపల్ అధ్యక్షుడు చర్లపల్లి రాములు, ప్రజానాట్య మండలి అధ్యక్షులు బాబు, సీపీఐ నాయకులు ఇమామ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### సీతారాం ఏచూరి దేశానికి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి, ఎనలేని సేవలు అందించారు :సంతాప సభలో సీపీఐ(ఎం) నాయకులు..

కేపీహెచ్‌బీ : సీపీఐ (ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి పార్టీకి, రాజకీయాలకు, దేశానికి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి, ఎనలేని సేవలు అందించారని సీపీఐ (ఎం) సీనియర్ నాయకులు కామ్రేడ్ బి.ఎస్ సుదర్శన్, హైదర్ నగర్ శాఖ కార్యదర్శి వి.శివప్రసాద్, సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్‌లు అన్నారు. శుక్రవారం హైదర్ నగర్ సీపీఐ(ఎం) శాఖ ఆధ్వర్యంలో.. హెచ్ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్ వద్ద సంతాప సభ నిర్వహిం చి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి వారితో పాటు సీపీఐ (ఎం) సీనియర్ నాయకులు రాజారావు, లక్ష్మీ నరసయ్య, ఎల్‌డి ప్రసాద్, నాగేశ్వ రావు, పి.ధర్మారావు ప్రసాద్‌లు పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ సీతారామ ఏచూరి చిన్నతనం నుంచే జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు.

### సీతారాం ఏచూరి మరణం వామపక్ష పార్టీలకు తీరని లోటు..

కేపీహెచ్‌బీ : కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు సీతారాం ఏచూరి మరణం వామపక్ష పార్టీలకు తీరని లోటని కూకట్ పల్లి మండల నాయకులు కృష్ణా నాయక్ అన్నారు. కూకట్‌పల్లి మండల కేపీహెచ్‌బీ సీపీఐ(ఎం) పార్టీ శాఖ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో గొప్ప ప్రతిష్ఠుడిని కోల్పోయమన్నారు. దేశం కోసం ఇచ్చిన మార్క్సిస్టు మేధావి చిన్నప్పటినుంచి కమ్యూనిజం భావజాలంతో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నుంచి ఆయన పయనం మొదలై దేశ రాజకీయాల్లో చెరగనిముద్రని వేసిన గొప్ప ఆర్థిక సామాజిక తత్వవేత్తగా ప్రజల్లో నిలిచిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. దేశానికి పీడిత ప్రజలకి కార్మిక రంగానికి తీరని లోటుగా భావిస్తున్నాము నిజాయితీ నిబద్ధత కలిగిన సిద్ధాంత కార్యకర్త రాజకీయ కర్తవ్యంలో దూరదృష్టి కలిగిన నాయకుడుగా కొనియాడారు.



## మహాసభలను విజయవంతం చేయాలి



• పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్ ప్రయివేటు మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ (ఏఐటీయూసీ యూనియన్)సెప్టెంబర్ 22,23న కొత్తగూడెంలో జరుగు రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్ నియోజకవర్గ కార్యదర్శి వి.హరినాథ్ ఆధ్వర్యంలో... శుక్రవారం రంగారెడ్డినగర్ డివిజన్ ఐడీపీఎల్ చౌరస్తాలో ఆటో కార్మికులతో కలిసి గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటో క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని, అర్హులైన ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని పేర్కొన్నారు. 60 సంవత్సరములు నిండిన డ్రైవర్లకు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో మహాసభల్లో చర్చించి, భవిష్యత్ పోరాటాలకు ఆటో కార్మికులు అందరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## గణనాథునికి ప్రత్యేక పూజలు కొలన్ హన్మంత్ రెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం కాలనీ 60 గజాల వాసులు నిర్వహించిన వినాయక ఉత్సవాలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయువు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో, స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ వారిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 130 డివిజన్ అధ్యక్షులు సోమన్నాగారి శ్రీధర్ రెడ్డి, కరణ్, రాజు చరీ, రమ్య, గుణశేఖర్, హరి, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి హుండి లెక్కింపు



• ఆదాయం రూ. 2.85 లక్షలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి (శ్రీవారి)హుండీ దేవాలయంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో.. పర్యవేక్షణఅధికారి కే.అంజయ్య నేతృత్వంలో ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో లెక్కించారు.గడిచిన ఆరు నెలలు నుంచి రూ.2.85 లక్షలు వచ్చిందని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మాడభూషిని రామాచార్యులు, సహాయ అర్చకులు మాడభూషిని విజయకుమార్ చార్యులు, దేవాలయ మాజీ చైర్మెన్ జి.సుధాకర్ రావు, వేద పాఠశాల నిర్వాహకులు ఎం.మల్లికార్జున్ రెడ్డి, ఎం.ప్రభాకర్, బి.శ్రీనివాస్, నాయకులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్‌లోని ఐదవ వార్డ్‌లో సంజీవయ్య నగర్ సెక్షన్ గణనాధునికి బస్తీవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నవతెలంగాణ-బేగంపేట

## ఎంఎల్ఆర్ఐటీలో 'ఐసీఏఎస్ఎంఎంటీ-2024' సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంఎల్ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సస్టెయినబుల్ ఎనర్జీ, మెటీరియల్స్, మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలో (ఐసీఏఎస్ఎంఎంటీ-2024) పురోగతిపై ఒకటో అంతర్జాతీయ సదస్సును ప్రారంభించింది. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో 380కి పైగా పరిశోధనా పత్రాలు సమర్పించగా.. 250 పత్రాలను సమీక్షించారు. కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్‌లలో ప్రచురించడానికి ఆమోదించబడ్డాయి. ఈ సదస్సు లాంఛనప్రాయ ప్రారంభానికి ప్రతీకగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కాన్ఫరెన్స్ చైర్, ఎంఎల్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ రావు అధ్యక్షత వహించి, సుస్థిర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో సహకార ప్రయత్నాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. కో-చైర్ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్ చైర్ డాక్టర్ ఎం.సత్యనారాయణ గుప్తా, కన్వీనర్ డాక్టర్ బలరామ్ యెలమశెట్టి సైతం పాల్గొని ప్రసంగించారు, సదస్సు అందించిన మెలుకువలు పంచుకునే అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకునేలా పరిశోధకులను ప్రోత్సహించారు. ఎంఎల్ఆర్ఐటీ వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఇలాంటి అంతర్జాతీయ సదస్సును నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గతంలో మాదిరిగానే అంతర్జాతీయ సదస్సులు నిర్వహించేందుకు తమ కాలేజీ ముందుంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీకి చెందిన డాక్టర్ అమిత్ కుమార్ గుప్తా, డాక్టర్ జయప్రకాష్ శర్మ ముఖ్య ప్రసంగాలు చేశారు. డా.గుప్తా ఆధునిక తయారీలో షేప్ మెమరీ అల్లాయ్‌ల ప్రాముఖ్యతను చర్చించారు, అయితే డాక్టర్ శర్మ అధునాతన ఉత్పాదక పద్ధతుల పరివర్తన సంభావ్యతపై సంభాషించారు. సమావేశంలో వర్చువల్ కీనోట్ సెషన్‌లు కూడా ఉన్నాయి. నాన్-డిస్ట్రక్టివ్ టెస్టింగ్ ఆఫ్ ఫుడ్ క్వాలిటీపై ప్రొఫెసర్ డాక్టర్ నోర్హశిలా హషీమ్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌లో చేరడంలో సవాళ్లు, అవకాశాలపై డాక్టర్ వి.బాలసుబ్రమణియన్ ప్రసంగించారు.

## కాంగ్రెస్ ది రాక్షస పాలన : కార్పొరేటర్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడంతో పాటు దాడులు చేస్తూ రాక్షసంగా పాలిస్తుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ విమర్శించారు. హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై కాంగ్రెస్ మూకల దాడులను నిరసిస్తూ శుక్రవారం జగద్గిరిగుట్ట బస్టాప్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్, కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట ఎస్సై శంకర్ నేతృత్వంలో కార్పొరేటర్ జగన్‌తో పాటు పార్టీ శ్రేణులను, అనుచరులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 8 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కొంటుబడిపోయిందని అవినీతి అరాచకాలతో పాలిస్తున్నారని ఆరోపించారు. శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆయన అనుచరులు కాంగ్రెస్ శ్రేణులు వ్యవహరించిన అమానుషమని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి పోలీసులు అన్ని విధాలుగా తొత్తులుగా మారిపోయారన్నారు. ఇటువంటి ధోరణి కాంగ్రెస్ కొనసాగిస్తే భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీతో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను పక్కదోవ పట్టిస్తూ మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్, పార్టీ శ్రేణులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

పాతబస్తీ జంగంమెట్ బీఆర్ అంబేద్కర్‌నగర్ నాగులబండ బస్తీ సంఘం అధ్యక్షుడు జి.శివకుమార్, జి.ఈశ్వర్‌తో కలిసి వినాయకుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ - ధూల్ పేట్



# అంగన్వాడీ బడి - తల్లిలాంటి ఒడి



• కుత్బుల్లాపూర్ సీడీపీఓ రేణుక

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అంగన్వాడి బడి చిన్నారులను తల్లుల్లా ఆడించి ఓనమాలు నేర్పే ఒడి అని కుత్బుల్లాపూర్ (సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ)సీడీపీఓ రేణుక అన్నారు."పోషణ్ మహా ప్రోగ్రాం"కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి,కుత్బుల్లాపూర్ ప్రాజెక్ట్ రంగారెడ్డి నగర్ సెక్టార్, ఇందిరా గాంధీనగర్, 1,2 గుడెన్ మెట్, అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించిన "అన్నప్రాసన తోపాటు అక్షరాభ్యాసం, గర్భిణి స్త్రీలకు శ్రీమంతాలు" సెక్టార్ సూపర్‌వైజర్ జె.జ్యోతితో కలిసి ఆమె చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారు లతోపాటు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు అంగన్వాడి కేంద్రాల నుండి అందజేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సూచించారు. చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో తప్పక చేర్పించాలని వారి సంరక్షకులుగా కేంద్రాలు నిరంతరం పనిచేస్తాయని అని తెలిపారు. గర్భిణీలు, బాలింతల తల్లులతోపాటు, చిన్నారులు గూర్చి తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు, సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు జ్యోతి, సుజాత, శిల్ప, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# గణనాధుని సన్నిధానంలో అన్నదానం



• ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పార్శి ప్రకాష్ గుప్తా

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గణనాధుని ప్రతిమను ఏర్పాటు చేసి నవరాత్రులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలుస్తూ చేపట్టే వేడుకల్లో భాగంగా విఘ్నేశ్వరుని సన్నిధానంలో అన్నదానం ఏర్పాటు చేయడం మహాభాగ్యమని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, జగద్గిరిగుట్ట శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పార్శి ప్రకాష్ గుప్తా అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట ఆర్య వైశ్య సంఘంలో యూత్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 2006 నుండి ప్రతి యేడు వినాయక మండపంలో అన్నదాన కార్యక్రమంతో పాటుగా ఇతర పూజ కార్యక్రమాలకు సహకరిస్తున్న బాదం కుటుంబసభ్యులను ఈ సందర్భంగా ప్రకాష్ గుప్తా అభినందించారు. గణనాధుని ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో సంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తేరల శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి దొంతుల అన్నయ్య గుప్తా, మహిళా విభాగం మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు కొత్తూరు రజిని, జగద్గిరిగుట్ట సంఘం అధ్యక్షురాలు డి. జయశ్రీ, ప్రధాన కార్యదర్శి మేఘమాల, కోశాధికారి లత, యూత్ విభాగం అధ్యక్షులు పబ్బ నరేష్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ గుప్తా, సంఘం వివిధ విభాగాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌కే సమాజ్‌లో వినాయక పూజలు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకొని ఎస్ఎస్‌కే సమాజ్‌లో జరిగిన పూజలకు ముఖ్య అతిథిగా ఎస్ఎస్‌కే సమాజ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగరి లక్ష్మి నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్ల సంవత్సరాల పురాతనమైన సనాతన ధర్మం వైపు నేడు ప్రపంచ దేశాలు ఆకర్షితులు అవుతున్నారని కాని భారత దేశంలో మాత్రం ప్రజలు పాశ్చాత్య సంస్కృతికి బానిసలై సనాతన సంస్కృతిని కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై తల్లి తండ్రులు తమ పిల్లలకు బాల్యం నుండి సనాతన ధర్మంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలోహెచ్.కుమార్, తులసి, గణపతి పవార్ తదితరులు పాల్గొన్నారు

## కౌశిక్ రెడ్డి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి



- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తేజ గౌడ్

**నవతెలంగాణ - ముషీరాబాద్**

మహిళలను కించపర్చే విధంగా మాట్లాడిన కౌశిక్‌రెడ్డి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తేజాగౌడ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇటు మహిళలను, అటు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. మహిళలంటే చాతకాని వాళ్లు అని కౌశిక్‌రెడ్డి ఉద్దేశ్యంలా ఉందన్నారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడడంతో పాటు చర్చకు వస్తా అని సవాల్ చేసి దాక్కుని బీఆర్ఎస్ పార్టీ గుండాలతో ఎమ్మెల్యే గాంధీ పై దాడికి పూనుకున్న కౌశిక్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ పిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్ కాదా అని అన్నారు. అందులో భాగంగానే బీఆర్ఎస్‌లో కౌశిక్‌రెడ్డి చేరలేదా అని ప్రశ్నించారు.

## బోరబండలో రేపు ఉచిత వైద్య శిబిరం.

- ముఖ్యఅతిథిగా పాల్గొననున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

**నవతెలంగాణ- జూబ్లీహిల్స్**

బోరబండ సైట్ త్రీలో గల నాట్కో ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం(రేపు) ఉదయం 9 గంటల నుండి రెండు గంటల వరకు ఉచితంగా వైద్య పరీక్షలు అందించి, మందులు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని స్వర్ణ భారత్ ట్రస్ట్ హైదరాబాద్ చాప్టర్ వారు, ఏఐజీ హాస్పిటల్ యాజమాన్యం సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథులుగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పాల్గొననున్నారు. విశిష్ట అతిథిగా డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి పాల్గొంటారు. ఈ వైద్య శిబిరంలో గుండె, నరాలు, ఊపిరితిత్తులు, జీర్ణ కోశ , స్త్రీ సంబంధిత, సాధారణ వ్యాధులకు అన్ని పరీక్షలు చేయనున్నారు. బీపీ, రాండం షుగర్, ఈసీజీ , 2డీ ఎకో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరానికి వచ్చేవారు వారి పాత మెడికల్ రిపోర్టులను తీసుకొని రావలసినదిగా కోరారు. ఈ కార్యక్రమం డాక్టర్ కామినేని శ్రీనివాస్ చైర్మెన్, ఐ. దీపా వెంకట్ మేనేజింగ్ ట్రస్ట్, డాక్టర్ సి.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

## క్యాపిటల్ విద్యా సంస్థల చైర్మెన్‌కు డాక్టరేట్



**నవతెలంగాణ-ఓయూ**

హైదరాబాద్‌కు చెందిన క్యాపిటల్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు చైర్మెన్ దాయక సత్యనారాయణకు ప్రతిష్టాత్మక ఓయూ కామర్స్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈయన యూజీసీ జె.ఆర్ఎఫ్‌లో అర్హత సాధించడం ద్వారా ఓయూలో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందిన విషయం తెలిసిందే. ఓయూ ప్రొఫెసర్ ఎ. ప్యాట్రిక్ పర్యవేక్షణలో "చిన్న, మధ్యతరహ పరిశ్రమలకు ఆర్థిక తోడ్పాటు అందించటంలో రాష్ట్ర ఆర్థిక సంస్థ పనితీరు "అనే అంశంపై సత్యనారాయణ సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ లభించినట్టు పేర్కొన్నారు. ఈ పీహెచ్‌డీకి ముందు ఆయన ఓయూ నుంచి ఎం.కాం, ఎల్ ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎమ్, ఎంబీఏ, ఎం.ఫిల్ పూర్తి చేశారు.ఈయన తల్లిదండ్రులు జయలక్ష్మి, కష్టయ్య చేనేత, మధ్య తరగతికి చెందిన వ్యవసాయ కుటుంబీకులు. స్వస్థలం నారాయణ పురం గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా. ప్రస్తుతం తెలగవరం గ్రామం, కల్లూరు మండలం, ఖమ్మ జిల్లాలో నివాసం ఉంటున్నారు.

ఓయూ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం. గంగాధర్, డీన్ డి. చెన్నప్ప, చైర్‌పర్సన్ ప్రొఫెసర్ కష్ణ చైతన్య, ప్రొఫెసర్ ఎ. ప్యాట్రిక్, ప్రొఫెసర్ నవీన్ రెడ్డి, ప్రొఫెసర్ జె.రవి తదితరులు సత్యనారాయణను అభినందించారు. క్యాపిటల్ విద్యా సంస్థలకు చెందిన పలువురు అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, మిత్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దాయక సత్యనారాయణ మాట్లాడుతూ తన ఉన్నతికి కారణమైన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గురువులు, సహ విద్యార్థులు, మిత్రులు, తోటి ఉద్యోగులు, అధ్యాపకులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తన భార్య, క్యాపిటల్ విద్యా సంస్థల డైరెక్టర్ హేమలత ప్రోత్సాహం గొప్పదని కొనియాడారు. డాక్టరేట్ సాధిస్తే నేర్చుకున్న జ్ఞానాన్ని మరింత మంది విద్యార్థులకు పంచొచ్చు అని.. సమాజంలో మరెంతో మందికి ప్రేరణ కూడా కల్పిస్తుందనే ఈయన మాటలు విద్యార్థులందరికీ ఎంతో స్ఫూర్తి 'దాయకం' .

# సీతారాం ఏచూరికి ఘన నివాళులు..



**నవతెలంగాణ-ఓయూ**

ఓయూలో శుక్రవారం సీతారాం ఏచూరికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ. ఎస్ఎఫ్ఐ పూర్వ జాతీయ అధ్యక్షులు సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు, ప్రగతిశీల ఉద్యమానికి, దేశానికి తీరని లోటన్నారు. ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థి హక్కులపై పోరాడుతూనే నాటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు ధైర్యంగా నిలబడి కొట్లాడారని తెలిపారు. దేశంలో అణగారిన వర్గాలకు రాజ్యాంగ ఇచ్చిన హక్కులు, సామాజిక తరగతుల హక్కుల కోసం అలుపెరగని ఉద్యమాలు చేశారని, పార్లమెంటులో హక్కుల కోసం, రాజ్యాంగ రక్షణ కోసం పోరాడారని కొనియాడారు. ప్రపంచంలోనే అత్యుత్తమ యూనివర్సిటీలలో అనేక అంశాలపై సీతారాం ఏచూరితో ఉపన్యాసాలు ఆయనను ఆహ్వానించి మరీ ఇప్పించేవారని, అందుకే దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోట శ్రీనివాస్ గౌడ్, ఓయూ కార్యదర్శి రవి నాయక్, ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు లెనిన్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆజాద్, రామకష్ణ, ఎస్ ఎస్ యు ఐ ఓయూ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు ఆంజనేయులు, మల్సూర్, ఉదయ్,సాయి భగత్, అనిల్, ప్రవీణ్, నాగేశ్వరి, స్నేహిత పవన్ రాజ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

### సీతారాం ఏచూరి విప్లవ నేత



సీతారాం ఏచూరి విప్లవ నేత, ప్రజ్ఞశాలి, ప్రపంచ మేధావుల్లో ముందు వరుసలో ఉండే నాయకుడు అని సీపీఐ(ఎం) సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఎం.అజయ్ బాబు కొనియాడారు. అడ్డగుట్టలో ఏచూరికి పార్టీ ఆధ్వర్యంలో నివాళ్లర్పించారు. పార్టీ జోన్ నాయకులు ఏ బాలయ్య ఆరు మల్లేష్, ఎం గోపాల్, ఆర్ అనిల్, ఎర్ర బాలయ్య, ఫాతిమా రమాకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో

**జూబ్లీహిల్స్ :** ఎస్‌పీఆర్ హిల్స్ చౌరస్తాలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ జోన్ నాయకుడు టి.సాయి శేషగిరిరావు మాట్లాడుతూ గొప్ప మేధావి, గొప్ప ఉపన్యాసి విద్యాధికుడు, ఆదర్శ మార్క్సిస్టు నాయకుడిని తమ పార్టీ కోల్పోవడం చాలా బాధాకరమైన అంశమని తెలిపారు. ఢిల్లీ విశ్వవిద్యాలయానికి మూడుసార్లు విద్యార్థి సంఘం నాయకుడిగా, తదుపరి కేంద్ర కమిటీ సభ్యుడుగా, ఆ తరువాత పార్టీ అఖిలభారత కార్యదర్శిగా దాదాపు 50 సంవత్సరాలు ఎర్రజెండా నీడలో తన జీవితం కొనసాగించారని, సిద్ధాంతం విషయంలో ఏనాడు రాజీ పడలేదని, అన్ని పార్టీ నాయకులు కూడా గౌరవించి, కామ్రేడ్ అని పిలిపించుకునే ఉన్నత వ్యక్తిత్వం అని కొనియాడారు. జాకటి స్వామి, లక్ష్మణ్, బాలయ్య, భాగ్యరాజ్, సత్యనారాయణ ,సామ్యేల్, సోమలా నాయక్ ,బాలరాజ్, రహమత్ నగర్





బోరబండ డివిజన్ ల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఎస్ఎఫ్ఐ-డీవైఎఫ్ఐ జూబ్లీహిల్స్ జోన్ కమిటీల ఆధ్వర్యంలో..

సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని ఎస్ఎఫ్ఐ–డీవైఎఫ్ఐ జూబ్లీహిల్స్ జోన్ కమిటీల నాయకులు అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ–డీవైఎఫ్ఐ జూబ్లీహిల్స్ జోన్ కమిటీల ఆధ్వర్యంలో సైట్ 3 చెన్నకేశవ ఆలయం వద్ద ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి జోహార్లు తెలిపారు. ఏచూరికి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974 లో ఎస్ఎఫ్ఐ లో చేరిన సీతారాం ఏచూరి జేఎన్‌యూ సమస్యలపై పోరాడారని తెలిపారు. ఆ కాలంలో దేశంలో ఎస్ఎఫ్ఐ ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొని, బలమైన విద్యార్థి సంఘంగా అన్ని విశ్వవిద్యాలయాలలో విజయ బహుట ఎగురవేసిందని తెలిపారు. దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందన్నారు. వారి మరణానికి తీవ్ర సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జూబ్లీహిల్స్ కార్యదర్శి సునీల్, డీవైఎఫ్ఐ కార్యదర్శి కష్ణ, ప్రజసంఘాల నాయకులు టీ.సాయి శేషగిరి రావు, నాయకులు వెంకట్ మోహిద్ పాల్గొన్నారు.

### ఏచూరిది దేశ రాజకీయాలలో చెదరని ముద్ర

**ఓయూ :** సీతారం ఏచూరి సాధారణ కార్యకర్త నుంచి అంచలంచెలుగా ఎదిగి దేశ రాజకీయాలలో చెదరని ముద్ర వేశారని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కొనియాడారు. సీతారాం ఏచూరీ చిత్రపటానికి సీపీఐ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు నిలబడి పాలక వర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు నిర్వహించారని తెలిపారు. అదేవిధంగా వామపక్షాల ఐక్యత, బలోపేతానికి అహర్నిశలు కృషి చేశారన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజు, శ్రీహరి, గువ్వల మల్లేష్, రవికాంత్, సయ్యద్ గౌస్, యాదగిరి, రవి, వెంకట్ గౌడ్,పాల్గొన్నారు.



ఫైల్ ఫొటో

## గృహ నిర్బంధంలో ఎమ్మెల్యేలు

**నవతెలంగాణ-ఓయూ**

ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మోండా మార్కెట్ టకార బస్తీలోని ఆయన నివాసం వద్దకు శుక్రవారం ఉదయం పోలీసులు చేరుకొని ఎమ్మెల్యే వెలుపలికి వెళ్ళకుండా నిరోధించారు. అదే విధం గా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీ.ఆర్.ఎస్. కార్పొరేటర్లు లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్ (అడ్డగుట్ట), రాసూరి సునితా రమేష్ (మెట్టు గూడ), సామల హేమ (సితాఫలమండీ), కంది శైలజ (బౌద్ధనగర్) లను కూడా పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఎన్నో వత్తిళ్ళు, శాంతీయుత ఉద్యమాలతో తెలంగాణాను సాధించిన తమకు అరెస్టులు కొత్త కాదని, ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



**కంటోన్మెంట్ :** మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలను పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. బోయిన్‌పల్లిలో నివాసం ఉంటున్న ఆ ఇద్దరి ఎమ్మెల్యేల ఇండ్లను ఉదయం నుండే పోలీసులు చుట్టుముట్టారు. అలాగే వారి ముఖ్య అనుచరులకు కూడా పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఎలాంటి ఆందోళనకు దిగినా అరెస్టు తప్పవని చెప్పారు.

## 'స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని' విజయవంతం చేయాలి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. స్వచ్ఛత కోసం ఈ కార్యక్రమం ఈ నెల 17 నుండి గాంధీ జయంతి అక్టోబర్ 2 నాటికి ముగుస్తుందని తెలిపారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో స్వచ్ఛత పై కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క సంవత్సరం ఒక్కో అంశంపై పరిశుభ్రతపై దృష్టి సారించిందని, అందులో స్వచ్ఛత సాధనలో నూతనంగా ఏర్పడిన తెలంగాణలో జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు పొందిన విషయం తెలిసిందేనన్నారు. కేంద్ర పట్టణ గృహ నిర్మాణ శాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా పరిశుభ్రత ఫోకస్ పెట్టిందన్నారు. ఈ క్రమంలో 2024 సంవత్సరం ప్రత్యేకంగా స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత (4ఎస్)లో భాగంగా ప్రధాన మూడు అంశాలు ఉన్నాయన్నారు. స్వచ్ఛత భాగి దారి, సంపూర్ణ స్వచ్ఛత, సురక్ష మిత్ర - సురక్షశివరీ కార్యక్రమాలను జీహెచ్ఎంసీలో పెద్ద ఎత్తున హెూల్ ఆఫ్ సొసైటీ భాగస్వామ్యంతో చేపట్టాలని నిర్ణయించిందని.. అందులో భాగంగా ప్రజలను, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వయం సహాయక సంఘాలు, యువజన సంఘాలు, విద్యాసంస్థలు, ఎన్.ఎస్.ఎస్ పాల్గొని పరిశుభ్రత పై దృష్టి పెట్టే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ మూడు అంశాలలో 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు వివిధ రకాల ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని జోనల్ కమిషనర్లను కమిషనర్ ఆదేశించారు. నగర వాసులు గ్రేటర్ హైదరాబాద్ పరిశుభ్రమైన నగరంగా ప్రసిద్ధికి తోడ్పడాలని కమిషనర్ కోరారు.



## హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీయవద్దు

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**నవతెలంగాణ-బేగంపేట్**

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బ తీయవద్దని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను ముందస్తు చర్యలలో భాగంగా మారేడ్ పల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అయితే తన హెల్త్ బాగోలేదని, డాక్టర్ వద్ద అపాయింట్ మెంట్ ఉన్నదని వెళ్లాలని ఎమ్మెల్యే వివరించినా పోలీసులు వినలేదు. కారు ఎక్కకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడులు, ప్రతిదాడులు ప్రజాస్వామ్యంలో సరైనవి కావన్నారు. దాడులు చేయడం, రెచ్చగొట్టడం వంటి చర్యలతో ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో శాంతిభద్రతలకు విఘాతం కల్పించవద్దని అన్నారు. సమస్యకు పరిష్కారం చూడకుండా అరెస్టులు, అడ్డుకోవడాలు తగదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే హైదరాబాద్ నగర ప్రతిష్ట దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. హౌస్ అరెస్ట్ అయిన వారిలో రాంగోపాల్ పేట, బీఆర్ఎస్ మోండా మార్కెట్ డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, కిషోర్ తదితరులు ఉన్నారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పలువురు పార్టీ నాయకులను కూడా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

## పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయండి






- ఓయూ ప్రొఫెసర్ చింతకింది కాశీం, అసిస్టెంట్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావులు
- 50 వసంతాల స్వర్ణోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-ఓయూ**

ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేయడం ద్వారానే విద్యారంగ సమస్యలు పరిష్కారం అవుతాయని ఓయూ ప్రొఫెసర్ చింతకింది కాశీం, అసిస్టెంట్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావులు పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ పోస్టర్లను పీడీఎస్‌యూ నేతలతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ కోట్లాది మందిలో చలనాన్ని అందించి పోరుబాటలో నడిచిన సంస్థ పీడీఎస్‌యూ అన్నారు. ఉస్మానియా గడ్డ మీద జార్జ్ రక్తంతో తడిసిన బిగి పిడికిలి పతాకం జె.సి. ఎస్. ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, చేరాలు, కోలా శంకర్, చాంద్ పాషా, స్నేహలత, రంగవల్లి, రమణయ్య, సాంబయ్య, తదితరుల త్యాగమయ చరిత్రతో విద్యార్థి ఉద్యమాన్ని ఉదతం చేసిన పీడీఎస్‌యూ కోట్లాది విద్యార్థులకు మార్గదర్శి అయ్యిందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని ఉద్యమాలు కొనసాగిస్తున్న విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ అని వారు అన్నారు. ఈ దేశంలో పేదలు అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ సమానమైన, శాస్త్రీయమైన విద్యను అందించాలని, విద్యార్థి ఉద్యమాలను కొనసాగిస్తున్నదన్నారు. సభకు విద్యార్థులు, పూర్వ, ప్రస్తుత పీడీఎస్ఈయు నాయకులు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, ఉపాధ్యక్షులు అనిల్, నరేందర్, భాస్కర్, సహాయ కార్యదర్శులు ప్రవీణ్, రాష్ట్ర నాయకులు కావ్య, పూర్వ విద్యార్థి నాయకులు ఎం. హన్మేష్, ఎస్.ఎల్. పద్మ, కె.ఎస్. ప్రదీప్, పి. అరుణ్ కుమార్, రవికుమార్, పాల్గొన్నారు.

## ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన జంపన ప్రతాప్

**నవతెలంగాణ-కంటోన్మెంట్**



కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ శుక్రవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. మినిస్టర్ క్వార్టర్స్‌కు వెళ్లి మంత్రిని శాలువాతో సత్కరించారు. సంహిత స్నేహితులు కావడంతో ప్రతాప్ కాసేపు గత జ్ఞాపకాలను మంత్రితో నెమరేసుకున్నారు.కంటోన్మెంట్‌లోని పలు విషయాలపై చర్చించారు.



## మహిళలను సన్మానించిన ప్రతాప్

**నవతెలంగాణ-కంటోన్మెంట్**

గణేష్ నవరాత్రుల సందర్భంగా పలు మండపాలలో విష్ణు సహస్రనామ పారాయణము, ప్రత్యేక పూజలు చేసిన మహిళలను కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ శుక్రవారం సన్మానించారు. బోయిన్ పల్లి లోని రాణా ప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి మండపంలో సంచార పురి, వాయు నగర్ కాలనీ మండపాలలో మహిళలు లలిత సహస్ర నామములు పఠించారు. కాగా జంపన ప్రతాప్ వీరిని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మంజుల,



## కామన్ రిక్రూట్ మెంట్ బోర్డును రద్దు చేయాలి

- ప్రొ. కోదండరాంకు ఓయూ విద్యార్థుల వినతి పత్రం

**నవతెలంగాణ-ఓయూ**

కామన్ రిక్రూట్ మెంట్ బోర్డు ను రద్దు చేయాలని ఓయూ విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలంగాణ విశ్వ విద్యాలయాల అటానమస్‌కు తీవ్ర ఆటంకం అని అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ చెప్పిందని,, నాటి కాంగ్రెస్ ఎమ్మెల్యే లు అసెంబ్లీ లో కూడా మాట్లాడారని గుర్తు చేశారు. అయితే తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కామన్ రిక్రూట్ మెంట్ బోర్డుకు అనుకూలంగా ఉన్నారనే వాదనలు ప్రముఖ దినపత్రికలలో ప్రచురితమయ్యాయన్నారు. తక్షణమే ఆ ఆలోచనలు విరమించుకోవాలని, బోర్డును రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.నాగేశ్వర రావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్ మూర్తి,కోట శ్రీనివాస్ ,నిజ్జన రమేష్,ఎస్.సుమంత్, ఎం. రవి నాయక్ ,సలీం పాష, ఆశప్ప,రుక్మత్ పాషా, మాల్సూర్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ ఎమ్మెల్యేకు అదనపు రక్షణ



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన నేపథ్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఇంటి ముందు పోలీస్ శాఖ అదన రక్షణ కల్పించింది. బీఆర్ఎస్ నాయకులు ఎక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యేలను ఇంటికి పై దాడికి వస్తారా అన్న ముందు జాగ్రత్త చర్యగా శుక్రవారం అదనపు రక్షణ కల్పించే చర్యలు చేపట్టారు. ప్రస్తుతం గన్‌మెన్‌లతోపాటు మరో నలుగురు పోలీసులను అదనంగా ఏర్పాటు చేశారు



కాచిగూడ లో ఏర్పాటు చేసిన గణపతి పూజా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, డాక్టర్ ఓం ప్రకాష్ యాదవ్, డాక్టర్ శిరీష యాదవ్, రవీందర్ యాదవ్, జగ్గు యాదవ్, మణికంఠ యాదవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

## చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించవద్దు

- సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు

**నవతెలంగాణ- జూబ్లీహిల్స్**



చిరు వ్యాపారస్తుల దుకాణాలను తొలగించవద్దని, వారికి అండగా సీపీఐ(ఎం) ఉంటుందని పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు అన్నారు. బోరబండ పోలీస్ స్టేషన్‌లో పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. సీఐ వీరశేఖర్ ఆ సమయంలో ఆఫీసులో లేక పోవడం వల్ల ఆయన ఆదేశాలు మేరకు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్ కు వినతి పత్రం ఇచ్చారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 9న ఎస్పిఆర్ హిల్స్ చౌరస్తాలోని చిరు వ్యాపారస్తుల దుకాణాలు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు జేసీబీతో వచ్చి కూలగొట్టారని తెలిపారు. వ్యాపారులకు జీహెచ్ఎంసీ వారు అనుమతి, ఐడి కార్డులు కూడా ఇచ్చారని, అలాంటి వారి దుకాణాలు తొలగించడం వల్ల నిరుపేదలు నష్టపోతారని, వారిని అక్కడే దుకాణాలు పెట్టుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పార్టీ నాయకులు టి సాయి శేషగిరిరావు సీఐ వీరశేఖర్ తో ఫోన్‌లో మాట్లాడి వినతి పత్రంలోని అంశాలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వారు వెంటనే స్పందించి చిరు వ్యాపారస్తులు, ప్రజలు మనకి ముఖ్యమని తెలిపారు. అంబులెన్స్ పో వటానికి కూడా రోడ్లమీద ఇబ్బంది కలుగుతుందని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రజలకు ఇబ్బంది లేకుండా పెట్టుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా చిరు వ్యాపారస్తులు వ్యాపారాలు చేసుకుంటే వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించబోమని బోరబండ ఇన్‌స్పెక్టర్ హామీ ఇచ్చారు. వారు కూడా నిబంధనలను పాటించాలని, ఆ ప్రాంతంలో యాక్సిడెంట్లు జరగకుండా చూసుకునే బాధ్యత వారిదేనని, చిరు వ్యాపారస్తులకు అనుమతిని ఇచ్చారు. జీహెచ్ఎంసీ పోలీస్ డిపార్ట్మెంట్ కలిసి రూట్ వెరిఫికేషన్ చేసినప్పుడు, ఇవన్నీ అడ్డంగా ఉన్నాయని తమ దృష్టికి వచ్చింది కాబట్టే తీసివేసామని తెలిపారు. వెంటనే స్పందించి అనుమతిచ్చిన, సీఐ వీరశేఖర్ కు టి. సాయి శేషగిరిరావు ధన్యవాదాలు తెలియజేశారు. కార్మిక సంఘం నాయకుడు, జాకటి స్వామి, భాగ్యరాజ్, సత్యనారాయణ, చిట్టి, గాబ్రియల్, అర్జున్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో ఏచూరికి నివాళి



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

కమ్యూనిస్టు దిగ్గజం కామ్రేడ్ సీతారామ్ ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ నగర కార్యాలయంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ దేశ రాజకీయాలలో ఒక నాయకుడు అస్తమించాడని తెలిపారు. హైదరాబాద్ నగరంతో ఏచూరికి అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేశారు. ఆబిడ్స్‌లోని హై స్కూల్ విద్యాభ్యాసం చేశారన్నారు. నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతూ 69 ఉద్యమ సమయంలో ఢిల్లీలో విద్యాభ్యాసం చేశారన్నారు. చదువుకునే రోజుల నుంచి రాజకీయాల పట్ల ఆకర్షితులై కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి అనేక మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షులు కుమారస్వామి, నగర ఉపాధ్యక్షులు డి.ఎల్. మోహన్, నగర నాయకులు సోమయ్య బాలుమియా, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి వద్ద ఉద్రిక్తత

- పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హౌస్ అరెస్టు

**నవతెలంగాణ-సిటీబ్యూరో/బేగంపేట/ఓయూ/కంటోన్మెంట్/ కుత్బుల్లాపూర్/దుండిగల్**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలోని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి అరికెపూడి ఇంటికి శుక్రవారం వెళ్తామని పాడికౌశిక్ రెడ్డి గురువారమే ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ రాజు ఇంటికి కౌశిక్ రెడ్డి వెళ్లారు. అనుచరులు, కార్యకర్తలతో కలిసి అక్కడి నుంచి వివేకానందానగర్‌లోని అరికెపూడీ గాంధీ ఇంటికి బయల్దేరారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఇద్దరినీ ఇంట్లోనే గృహ నిర్బంధం చేశారు. ఈ క్రమంలో పోలీసులతో పాడి కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజు వాగ్వాదానికి దిగారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అక్కడికి చేరుకుని ఎమ్మెల్సీ ఇంటి పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేశారు. ఇంటి బయట పోలీసులు పహారా నిర్వహించారు. ఇంట్లోకి ఎవ్వరినీ అనుమతించలేదు. కాగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తున్న విషయం తెలిసిందే.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హౌస్ అరెస్టు

ఇక ఎమ్మెల్యే అరికెపూడీ గాంధీ నివాసంలో పార్టీ కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేశారు. సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్టు చేశారు. తనకు ఆరోగ్యం బాగా లేదని, డాక్టర్ అపాయింట్ మెంట్ ఉన్నదని ఎమ్మెల్యే వివరించినా పోలీసులు వినలేదు. కారు ఎక్కకుండా అడ్డుకున్నారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మోండా మార్కెట్ టకార బస్తీలోని ఆయన నివాసం వద్దకు ఉదయం పోలీసులు చేరుకుని ఎమ్మెల్యే ఇంట్లోకి ఎవ్వరూ వెళ్లకుండా నివారించారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బోయిన్‌పల్లిలో నివాసం ఉంటున్న వీరిద్దరి ఇండ్లను ఉదయం నుంచే పోలీసులు చుట్టుముట్టారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. శాంతియుతంగా ఎమ్మెల్యే గాంధీ నివాసానికి వెళ్తామని చెప్పినా వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు.



## హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి : పాడి కౌశిక్‌రెడ్డి

హైకోర్టు ఆదేశాల మేరకు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను నాలుగు వారాల్లో డిస్ క్వాలిఫై చేస్తూ అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇలా చేస్తే 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవన్నారు. ఎమ్మెల్యే గాంధీ తన సంగతి చూస్తానుంటున్నారనీ.. తెలంగాణ కోసం చావడానికైనా రెడీ అన్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్‌పై తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి తన ఇంటిపై దాడి చేయాలని చెప్పారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు రక్షణ లేకపోతే ఎలా అనీ, తాను చేసిన తప్పేంటని ప్రశ్నించారు. అరికెపూడీ గాంధీ భాషను శేరిలింగంపల్లి ప్రజలు గమనించాలన్నారు. తాను ఉండే విల్లాల్లో మొత్తం 69 కుటుంబాలు ఉంటే, ఇక్కడే ఏపీ మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు సైతం ఉన్నారని తెలిపారు. ఆంధ్రావారు అంటే తమకు గౌరవం ఉందని, తాను వ్యక్తిగతంగా అరికెపూడీ గాంధీని అన్నానని తెలిపారు. ఎక్కడైనా అంధ్రా అనే పదం వాడితే అది తనకు గాంధీకి మాత్రమే వ్యక్తిగతం అన్నారు. చిల్లర రాజకీయాల కోసం ఆంధ్ర, తెలంగాణ అని రెచ్చగొడుతున్నారని తెలిపారు. అంధ్రా సెటిలర్స్‌ను బీఆర్ఎస్‌కు దూరం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను భయపెడుతున్నారని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లో రేవంత్‌రెడ్డి హైదరాబాద్ అభివృద్ధిని అమరావతికి తరలిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యం చేస్తుందన్నారు. పోలీసు రాజ్యంతో ప్రభుత్వాన్ని నడుపలేరన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ నాయకులు రోడ్డు మీద తిరిగే పరిస్థితి ఉండదు అన్నారు. హైకోర్టు తీర్పు తర్వాత పార్టీ మారిన ఎమ్మెల్యేలు గజగజ వణుకుతున్నారన్నారు. ఇప్పటికైనా పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం ఉంటే వెంటనే రాజీనామాల చేయాలన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు గోకుడు ఎక్కువ ఉందనీ, దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు.

**కౌశిక్ గత చరిత్ర హీనం : ఎమ్మెల్యే అరికపూడి గాంధీ**

ఇదిలా ఉండగా ఎమ్మెల్యే అరికపూడి గాంధీ విలేకరులతో మాట్లాడారు. కౌశిక్ రెడ్డి లాంటి వారి వలనే బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిందని తెలిపారు. కౌశిక్ రెడ్డి భాషను కేసీఆర్, హరీశ్ సమర్థిస్తే తాను సమర్థిస్తానన్నారు. అమెరికా నుంచి ఫోన్లో హెచ్చరికలు రావటంతోనే.. ఈరోజు కౌశిక్ తగ్గి మాట్లాడాడన్నారు. తానూ నోరు జారింది కూడా వాస్తవమేనని చెప్పారు. అయితే తన భాష గురించి మాట్లాడుతోన్న హరీశ్.. గతంలో ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఆయన మాటలను గుర్తుచేసుకోవాలని సూచించారు. తన ఇంటిపై జెండా ఎగరవేయడానికి కౌశిక్ ఎవడని ప్రశ్నించారు. కౌశిక్ గత చరిత్ర హీనమన్నారు. ప్రాంతీయ విభేదాలు తీసుకొచ్చి ఇప్పుడు తప్పించుకుంటున్నాడని చెప్పారు. కౌశిక్ మాటలతో ఆంధ్ర వాళ్ళ మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈటల రాజేందర్ రెండు చోట్ల పోటీచేయటం వలనే కౌశిక్ రెడ్డి హుజూరాబాద్ లో గెలిచాడన్నారు.

# ఎఫ్ఆర్ఎస్ హాజరులో హైదరాబాద్ జిల్లాకు ద్వితీయ స్థానం

- ప్రధానోపాధ్యాయులు కృషి చేసి ప్రథమ స్థానంలో ఉండేలా చూడండి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**నవతెలంగాణ-సిటీబ్యూరో.**



ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషితో హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగి జిల్లా రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచిందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ హుమాయున్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. 8 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన డ్రింకింగ్ వాటర్, ప్లాట్ ఫామ్, ఎలక్ట్రిసిటీ ఫ్యాన్స్ ట్యూబులు, షెడ్ మరమ్మత్తు ఆయన పరిశీలించారు. పాఠశాలలో ఇంకా ఏమైనా సివిల్ వర్క్ పెండింగ్ లో ఉన్నాయా అని ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు.పాఠశాల ఆవరణలో ఎర్రటి మట్టితో గ్రీనరీ పెంచాలని సూచించారు. ప్రతి పాఠశాల తరగతిగది ఎదురుగా క్లాస్ రూమ్ కు సంబంధించిన నేమ్ ప్లేట్ అమర్చాలని అన్నారు. పాఠశాల హాజరు రిజిస్టర్ ను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు కృషి వల్ల విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు( ఎఫ్ ఆర్ ఎస్) లో హైదరాబాద్ జిల్లా 67.65 శాతం హాజరుతో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉందని తెలిపారు. గతంలో హాజరు శాతం చాలా తక్కువగా ఉండేదని, పాఠశాలలకు ప్రత్యేక అధికారుల నియామకం ,ప్రధానోపాధ్యా యుల కృషితో ఎఫ్ ఆర్ సి శాతం పెరిగిందని తెలిపారు. ప్రధానోపాధ్యా యులు మరింత కృషిచేసి ముఖ గుర్తింపు హాజరులో ప్రథమ స్థానంలో జిల్లాను నిలపాలని ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ కోరారు. పాఠశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిల్లలు వచ్చేలా చూడాలని అన్నారు. ఆధార్ కార్డు లేని విద్యార్థులకు వెంటనే ఆధార్ నమోదు చేయాలని తహసీల్దార్ కు సూచించారు. పాఠశాల లో ఉన్న స్క్రాప్ ను వెంటనే తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఆర్. రోహిణి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చలపతిరావు, డిప్యూటీ ఈవో రమణా రాజు, డిప్యూటీ ఐఓఎస్ ముస్తఫా, తహసిల్దార్, ప్రధానోపా ధ్యాయులు సయ్యద్ ముజ్తబ అలీ, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ప్రాఫిట్‌లో షేర్ పేరిట భారీ మోసం




- డీకేజెడ్ సొల్యూషన్‌తో పలువురి నుంచి కోట్లల్లో వసూళ్లు
- సీసీఎస్ ముందు బాధితుల ధర్నా

**నవతెలంగాణ-హిమాయత్ నగర్**

తమ కంపెనీలో ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని యూట్యూబ్ లో ప్రకటనలు చేసి పలువురు బాధితుల నుండి డీకేజెడ్ సొల్యూషన్స్ అనే సంస్థ కోట్లల్లో డబ్బులను దండుకుంది. కొద్ది నెలలు లాభాలు చెల్లిస్తూ ఒక్క సారిగా కోట్లాది రూపాయలతో సంస్థ ప్రతినిధులు బిచాన ఎత్తివేశారు.దాంతో బాధితులు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఈ నెల 2న ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి 10 రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ పలువురు బాధితులు శుక్రవారం బషీర్ బాగ్ లోని సీసీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నైకు చెందిన అషిఫాక్ రహిల్, ఏపీకి చెందిన మహ్మద్ ఇక్బాల్ 2018లో డీకేజెడ్ సొల్యూషన్స్ పేరిట మాదాపూర్‌లో కార్యాలయాన్ని ప్రారంభించారు.యూట్యూబ్‌లో కొంత మంది యూట్యూబర్స్‌తో ఈ కంపెనీలో ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ప్రకటనలు చేయించారు. దీంతో నమ్మిన బాధితులు వారి కంపెనీలో ఇన్వెస్ట్ మెంట్ చేశారు.ఇన్వెస్ట్మెంట్ పై వచ్చిన ప్రాఫిట్‌పై 10 నుంచి 12 శాతం వరకు లాభాలు ఇస్తామని తెలిపారు.మొదట లాభాలు ఇచ్చి నమ్మకం కలిగించారని.. తర్వాత ఇన్వెస్ట్మెంట్ చేసిన డబ్బులు ఇవ్వకుండా దాటవేస్తూ వచ్చారని బాధితులు చెప్పారు. లాభాలు వస్తున్నాయని లోన్స్ తీసుకుని, బంగారం తాకట్టు పెట్టి ఒక్కొక్కరు ఒక రూ.1 లక్ష నుంచి రూ.50 లక్షల వరకు ఇన్వెస్ట్ చేశామన్నారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి సుమారు 30 వేల మంది దాదాపు రూ.700 కోట్ల మేర ఇన్వెస్ట్ చేసినట్టు వివరించారు.గత నెల ఆగస్టులో మాదాపూర్ లోని కార్యాలయానికి తాళాలు వేసి, ఎండీలు ఇద్దరు పరారయ్యారని, దీంతో స్థానిక మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే, వారు సీసీఎస్‌కు వెళ్లాలని సూచించినట్టు తెలిపారు.ఇక్కడ ఫిర్యాదు చేసి 10 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు.ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు హకీమ్ షేక్, సల్మా ఖురేషి, రఫిక్, సుల్తానా బేగంలు వేడుకున్నారు.

# గణేష్ నిమజ్జనానికి 25 వేల మందితో భారీ బందోబస్తు

- ఈ ఏడాది అదనంగా 10 శాతం వినాయక విగ్రహాలు ఏర్పాటు
- నగర సీపీ సీవీ ఆనంద్

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే అనేక వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఈనెల 17న ఖైరతాబాద్ మహాగణపతితో పాటు పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనాలు జరుగనున్నాయి. ఇందుకోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 25 వేల మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ముందుకెళ్తున్నామని, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలలోపు పూర్తి అవుతుందని తెలిపారు. ఈ ఏడాది అదనంగా 10 శాతం వినాయక విగ్రహాలు ఏర్పాటయ్యాయన్నారు. అన్నిరకాల విగ్రహాలు కలిపి దాదాపు లక్ష వరకు ఉండొచ్చన్నారు. గణేష్ నిమజ్జనం, శోభయాత్ర నేపథ్యంలో నియమాలు పాటించాలన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను తీసుకెళ్లడానికి అవసరమైన వాహనాన్ని ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున సౌత్ జోన్ పరిధుల నుంచి విగ్రహాలను తీసుకెళ్లేవారు ముందుగానే బయలు దేరాలని, వాహనానికి ఏసీపీ కేటాయించిన నెంబర్‌ను ప్రదర్శించాలని తెలిపారు.



కంటోన్మెంట్ లోని ఐదో వార్డులో సంజీవయ్య నగర్ సెక్షన్ గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బస్తీవాసులు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నవతెలంగాణ-బేగంపేట

---

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD**

**O.S. No. 5751 OF 2023**

**Between:**
**Bank of Baroda,**
**PBB Banjara Hills Branch**
**Rep. by its Chief Manager**
**8-2-596/5, Road No.10,**
**Banjara Hills,**
**Hyderabad-500 034**
**...Plaintiff**

**AND**
**1. Jaithra Communications Another ...Defendants**

**SUMMONS**

**To**
**1. Jaithra Communications**
**Rep. by its Proprietor**
**Shri. Merugu Jai Hind,**
**Having place of business at 8-883/171, Phase-II,**
**Kamalapuri Colony,**
**Hyderabad-500073**
**2. Shri. Merugu Jaihind,**
**S/o. Mergu Rajesham**
**Aged about 41 years,**
**Occ: Business,**
**R/o. 8-883/171, Phase-II,**
**Kamalapuri Colony,**
**Hyderabad-500073**
**...Defendants**

Take Notice that the Plaintiff has filed the above O.S. for recovery of money of **Rs.9,28,361/-** along with cost and subsequent interest against you. The summons/ notices sent to you have been returned un-served now this Hon'ble Court doth order you to appear before this Hon'ble Court on **17-10-2024** at 10.30 A.M. either in person or through a pleader and show cause the prayer should not be considered failing which the O.S. will be decided as per law in your absence.

**//BY ORDER OF THE COURT//**
**Venkat Sri Maithreya**
**B. Narasinga Rao**
**Advocates**
**Flat No. 302, Green Rich Residency, Uppal Bhagyat, Uppal, Hyderabad-500039**

---

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT: RAJENDRANAGAR**
**O.S.NO.359 OF 2024**

**Between:**
1.Alli Sathamma W/o Alli Kurmaiah Aged about 78yrs, Occ:Household,
2.Alli Pushpa, D/o late Alli Ramulu, Aged about 23yrs, Occ:Household,
3.Alli Sai Kumar S/o late Alli Ramulu, Aged about 19 yrs, Occ: Student,
4.Alli Sangeetha D/o late Alli Ramulu, Aged about 15 years, Occ: Student,
(Being a Minor Rep by its Grand Mother Plaintiff No.1) All are R/o. H.No.6-6-18/1, Sai Baba Nagar, Kattedan, Rajendranagar Mandal, Ranga Reddy District, T.S-500077
...PLAINTIFFS

AND
The Tahsildar, Rajendranagar
...DEFENDANTS

All concerned

**NOTICE**

The plaintiff herein had filed the above suit for declaration to declare them as legal heirs of late Alli Ramulu @ Ramulu S/o Kurmaiah against all concerned (D2). The Hon'ble Court was pleased to order for substitute service for any objections from anybody and posted the matter **to 24-09-2024.**
Hence, if any one got any objections are requested to appear before the above said Hon'ble Court **at 10:30 a.m.** on the said date either personally or through your authorized counsel, for submitting your claim or otherwise the matter will be adjudicated as per law. Hence, this notice.

**(BY ORDER OF THE COURT)**
**P.RAJU BABU**
**ADVOCATE**
Upparpally, Hyderabad
9392466070.

---

**IN THE COURT OF THE HON'BLE V Th JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT:: AT:HYDERABAD**
**O.S.No.2864 of 2024**

**Between:**
1.Smt. Kanaparthi Padma @ Tummanapalli Padma W/o Late tummanapalli Naresh ,Age: 35 yrs Occ: house hold R/o H.no: 9-3-247,Srinagar colony, Karimnagar -505001 .
2.Baby Tummanapalli Ahaana Nandana,D/o Late Tummanapalli Naresh,age: 3 yrs: Occ: nill, R/o Hno:.9-3-247.srinagar colony .karimnagar-505001.
...Plaintiffs

And
1.The State Bank of India, Rep. by its Branch Manager, S.R.Nagar Branch,Ameerpet Mandal, Hyderabad
2.All Concerned.
...Defendants.

All Concerned.
...Defendant No.2.

Please take notice that the above . suit .was filed.to declare plaintiffs as legal heirs of Late Tummanapalli Naresh and the same is posted **to 26.09.2024 at 10:30am** for your appearance. You may appear either in person or through an advocate before the said court on the said date, failing which the matter will be decided ex-parte.

**(BY HON'BLE COURT ORDER)**
**Sd/**
**M/S.K.RANGA RAO,**
**Advocates,**
Counsels for the Plaintiffs
Hanuman Nagar, Chaitanyapuri, Dilsukhnagar, Hyderabad–60

---

**PUBLIC NOTICE**

**FOR ENVIRONMENT CLEAREANCE**

M/s.EIPL INFRA PROPERTIES has applied for Environment Clearances for EIPL Infra villas project sy.No.146/P, Kolluru (V), Ramachandrapuram (M), Sangareddy District, telangana State.
It is notified to inform the public that the project has been accorded Environment Clearance by SEIAA TELANGANA of India vide EC No.EC22B038TG175518 under the provision EIA notification dated 27th march 2022. Copy of clearance letter is available with telangana Pollution Control Board (TGPCB). A-3, Paryavaran Bhavan, Sanath Nagar Rd, Sanath Nagar Industrial Estate, Sanath Nagar, Hyderabad, Telangana 500018.

---

**IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVL COURT:: AT: HYDERABAD.**
**O.S.No.66 of 2024**

**Between:**
Jaligam Likitha.
...Plaintiffs.

AND
The Bank Manager and All Concern.
...Defendants.

**NOTICE**

TO,
1)The Bank Manager, M/s.State Bank of Hyderabad, D S Bhavan, Masab Tank Branch, Door No.10-5-21/23/15, Chacha Nehru, Hyderabad.
2) All Concern.
...Defendants

Please take notice that, the above said Plaintiffs has instituted Suit against the Defendants under Order VII Rule 1 to 6 R/w. Section 26 C.P.C. Suit FOR "DECELARTION OF LEGAL HEIR". As such you are directed to appear before the said court on **16.10.2024 at 10.30A.M**, either in person or through pleader. If you fail to appear before the said court, then the matter will be decided Ex-Parte.

**(By Order of Court)**
**RK ASSOCIATES**
**B.GANGADHAR RAO**
**B.VIJAYA LATA, ADVOCATES**
H.No: 1-6-53/5, Near Babu complex Chaitanyapuri, Dilsukhnagar, Hyderabad-500 060.
Ph: 9885595065, 9642952795

---

**IN THE HONOURABLE COURT OF ADDITIONAL FAMILY JUDGE AT: VISAKHAPATNAM**
**O.P.1549/2023**

**Between:**
Sri .Miriyala Sai Krishna
...Petitioner.

And:
Smt.Miriyala Naga Venkata Sai Saranya
...Respondent.

**NOTICE**

To,
The Respondent
Smt.Mada Naga venkata sai saranya @ Smt.Miriyala Naga venkata sai saranya, W/o Miriyala Sai Krishna, D/o Mada Venkata Subhramanyam. R/o Flat no.106, Plot no. 26, Rukmini Residency, Hi Rise Colony, Vasanth Nagar Colony, Essar Petrol Bunk Back Side Lane, Nizampet Village, Nizampet, Medchal, Malkajgiri District, Telangana- 500090
Please take notice that the above O.P.1549/2023 filed by the petitioner against the respondent for restitution of conjugal rights and the matter stands posted **to 15-10-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate **on 15-10-2024 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence.

**(By Order of the Hon'ble Court)**
**S.VASU**
**Advocate**
Visakhapatnam.
Cell: 9989154100

---

**IN THE COURT OF HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DIST. AT: HAYATHNAGAR**
**I.A.No. 662 of 2024**
**in**
**O.S.No.174 of 2018**

**BETWEEN:-**
S. Sudhakar Reddy
...Petitioner/ Plaintiff

AND
1)Smt.P.Vijaya Laxmi
...Respondent/ Defendant
2)Smt.Bonala Vijaya Kumari and others ...Resp/proposed Defendant No. 2 to 5

To,
1)Smt.Bonala Vijaya Kumari W/o. Paka Srinivas Aged 56 yrs, Occ: Govt. Employee, R/o.B-27, B-Blocks, New Malakpet Colony, Asmanghad, Malakpet, Hyd-36
2)Smt.Begari Punyamma W/o. B.Pentaiah Aged 53 yrs, Occ: House wife, R/o.H No.4-58/1, Raikode Village, Medak Town and District, Telangana.
(proposed Defendants No.2 and 3)
Please take notice that, the Plaintiffs have filed the above SUIT for specific performance of Agreement cum cash Receipt dated 21-17-2017 in respect of suit schedule property and subsequently filed the above IA against you in respect of suit schedule property and upon hearing the Plaintiff the Hon'ble Court was pleased to order the service of summons against you (proposed Defendants No. 2 and 3) by way of the publication and the matter has been posted **to 01-10-2024 at 10:30 AM** for your appearance. Hence, you are advised to appear before the Hon'ble Court on the said date and time, otherwise the matter will be decided against you.

**\\ By order of the court **
**M/s.K.Surender Reddy**
**Advocates**
Plot No. 31, Sushma Sai Nagar, Vanathalipuram, Hyderabad - 70
Cell : 9948092567

---

**IN THE COURT OF THE HON'BLE II Addl. JUNIOR CIVIL JUDGE cum VI AMM COURT, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: L.B.NAGAR**
**O.S.No.1612 of 2022**

**Between:**
Smt.T.Pushpalatha
...Plaintiff

And
E.Bhoopal Reddy
...Defendant

To,
E.Bhoopal reddy, S/o.E.Malla Reddy, R/o.Flat No.203, second floor.H.No.4-7-101/1, Galaxy Towers, Habsiguda, Uppal Mandal, Medchal-Malkajgiri District.

**PUBLIC NOTICE**

Whereas the plaintiff has filed the above suit for perpetual injunction against the defendant but the defendant is unable to receive the summons sent through court, as such the Hon'ble court has been pleased to order a paper publication calling the above said defendant, to appear before the Hon'ble court, **on 24-09-2024 at 10:30 AM,** either in person or through counsel otherwise the matter will be decided in your absence.

**// BY ORDER OF THE COURT //**
**M/s. B.RAJASEKHARA REDDY**
**ADVOCATE**
158, Keemthi Colony, Tarnaka, Secundrabad. 5000017.
Ph. 9848027299

---

**IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE: RANGA REEDY DISTRICT, AT: L.B.Nagar.**
**O.S.No.925/ 2022**

**Between:-**
Canara bank, Dilsukhnagar Branch, Represented by Sri Harish Kumar Kocherlakota, S/o.Sita Ramayya.
...Plaintiff

And
S.Rama, W/o.Saidulu, Age:35 yrs, Occ: Business, R/o.H.No.22-127/A Sarswathi Nagar, Gaddiannaram, Saroornaar, Ranga Reddy-500060
...Defendant.

To
S.Rama, W/o.Saidulu, Age:35 yrs, Occ: Business, R/o.H.No.22-127/A Sarswathi Nagar, Gaddiannaram, Saroornaar, Ranga Reddy-500060
Take notice that, plaintiff bank filed case for recovery of money against you for recovery of money for a sum of Rs. 2,02,842=00 (Rupees Two lakh and two thousand and eight hundred and forty two only) under loan account No. 11797 68000115 AND an amount of 40,254=00 (Rupees Forty thousand and two hundred and four only)under loan account No. 1179755000072 and same is coming up for your appearance before Hon'ble Principal Junior Civil Judge, L.B. Nagar, Ranga Reddy district and above said case is posted on 19-09-2024, you please make your appearance before Hon'ble III Additional Junior civil Judge, L.B. Nagar, Ranga Reddy district and above said case is posted **on 19-09-2024,at 10-30 A.M** failing to appear before above said Hon'ble court case will be heard and decided exparte.

**KAJA SREENIVASA RAO**
**ADVOCATE.**
Flat No.1, Yerram Towers, Street No.5, TARNAKA. SECUNDERBAD-500017.
Mobile: 9848516600

---

**IN THE COURT OF HON'BLE II ADDL. DISTRICT JUDGE RANGAREDDY DISTRICT AT : LBNAGAR**
**E.P.NO.7 OF 2015**
**IN**
**O.S.NO. 11 OF 2003**

Between:
Narayan Das Jhawar
.....DHR/Plaintiff

AND
M/s. Vijay Industries & Others
...JDR'S/Defendants

To
Vijay Prakash Vijay Varghee, S/o. Madanlal Vijay Varghee, Age 58 years, Occ: Business, R/o. 129/50, Road No.12, Opp: Rock Roof Apartments, Old Shaikpet Village, Banjara Hills, Hyderabad.

**SALE OF IMMOVABLE PROPERTY**

Whereas in the above mentioned EP the below mentioned property is brought for sale to realize the Decreetal amount of Rs.13,64,230/- plus interest and costs. Auction is going to be held on 04.10.2024 at Court premises at 10.30 AM. Therefore whoever is interested in purchasing the property can attend and participate in bid which opened to one and all.

**SCHEDULE OF PROPERTY**

All that part & parcel of Land in Survey No.172/A & 173/B, totally admeasuring 400 Sq.yards, consisting of roofed structure, situated at Gagan Pahad Village, Rajendra Nagar Mandal & Municipality, Rangareddy District, and bounded by
North : Road and Sy.No.173 Part
South : Sy.No.173 part of JDR
East : Sy.No.173 part and 172 part of JDR,
West : Sy No.173 part and 172 part and grave yard

**Terms and Conditions :**
1. Upset price will be fixed by the Hon'ble Court at the time of sale.
2. Highest bidder has to deposit 1/4th of sale amount immediately.

**//BY ORDER OF COURT//**
Sd/-
**Damodar Mundra**
**Dinesh Kumar Gilda**
**G. Venkatesh**
**Shreya Mundra**
**Divya Mundra**
Advocates,
102, KGN Plaza, Street No.8, Himayat Nagar, Hyderabad -29,
Ph: (O) 27676865

---

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో.
**H.M.O.P.No.77/2024**

వావిలాల లక్ష్మి
...పిటీషనర్

Vs
వావిలాల మహేష్ ఏ మల్లేశ్వరరావు
... రెస్పాండెంట్

**To:**
వావిలాల మహేష్ ఏ మల్లేశ్వరరావు, S/o.గురవయ్య మేనేజర్, మార్గదర్శి చిట్ ఫండ్ ప్రై. లిమిటెడ్, డోర్ నెం. 3-5-58/1, శ్రీనివాసనగర్ కాలనీ, సెయింట్ జోసఫ్ స్కూల్ దగ్గర, అంబర్పేట, ఉప్పల్, మేడ్చల్, మల్కాజ్గిరి జిల్లా, తెలంగాణ స్టేట్.
పై నెంబరు హెచ్.యం.ఓ.పి దావాను విడాకుల నిమిత్తము మీ మీద దాఖలు చేసియున్నాము. సదరు హెచ్.యం.ఓ.పి.లో శ్రీ కోర్టు వారు మీకు పలుమార్లు సమన్సు పంపగా, మీరు ఉద్దేశ్య పూర్వకంగా తీసుకోనందున, శ్రీకోర్టువారు మీకు ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తమై ఉత్తర్వులు జారీ చేసినందున ది.24-09-2024 వ తేదీ ఉ॥10-30 ని॥ లకు, మీరు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా వకీలు ద్వారాగాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపు కోవలసినది. లేనియెడల, మీ పరోక్షమందు, చట్ట ప్రకారము తీర్మానము చేయబడునని ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం.

వాయిదా తేది:
**24-09-2024**

శ్రీ కె.సీతారామాంజనేయులు
శ్రీ జి. గోపిరాజు,
పిటీషనర్ తరుపు అడ్వకేట్స్,
నరసరావుపేట.
సెల్:9390511530

---

**IN THE COURT OF THE CHIEF CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD**
**I.A.No.5699 of 2024**
**In**
**A.S.SR.No.20725 OF 2024**

**Between:**
Mr.Vungaralla Venkata Yungader
...Petitioner/Appellant

And
The Mandal Revenue Officer and All concerned
...Respondents/Respondents

Please take notice that the petitioner/appellant has filed the above Appeal in A.S.SR.No. 20725 of 2024 against the decree and judgment dated 03.07.2024 in OS No. 4199 of 2023 passed by the XIX Junior Civil Judge, City Civil Court at Hyderabad along with condone delay petition U/s 5 of Limitation Act vide I.A.No.5699 of 2024 before the Hon'ble Chief Judge, City Civil Court at Hyderabad in respect of the suit schedule property i.e., Muncipal house bearing No.1-8/B 16/F6, admeasuring 687.29 sft, Flat No. 6, Schedule of MIG II, Phase-II, Block-16, situated at Baghlingam pally, Amberpet Mandal (earlier Hyderabad Mandal), Hyderabad District and bounded by North: Open to sky, South: Block No. 16, Flat. No.7, East:Open to Sky, West: Block No.16, Flat.No.5. The above I.A.No.5699 of 2024 stands posted to dt. 27.09.2024 for appearance of All concerned. If any person/s have any objection or interest for the said claim of the Petitioner/Appellant should appear before the Hon'ble court in the next date of hearing i.e., **on 27.09.2024 at 10:30 AM** either in person or through counsel, failing which the said IA will be decided in your absence as per law.

**// BY ORDER OF THE COURT//**
**M.Jaya Kumar,**
**Advocate**
Plot No. 1188, Road No. 45, Jubilee Hills, Hyderabad.
Mobile No. 9885754399, 6303724109

---

**IN THE COURT OF THE HON'BLE III ADDL DISTRICT JUDGE, MEDCHAL-MALKAJGIR DISTRICT AT: KUKATPALLY**
**O.S.No.57 of 2024**

**Between:**
Marutham Venkata RamanaReddy
...Plaintiff

AND
The Tahasildar Kukatpally Mandal and others
...Defendants

**NOTICE**

General public is here by intimated through this notice that the above suit is filed by Plaintiff seeking for declaration of legal heirs for himself as he is sonf of deceased Late. M.V.Raghava Reddy and Marutham Devasena. For the plaintiff the father Late. M.V. Raghava Reddy had purchased schedule of property-A, all that the H.No.3-6-47 on plot No.2, admeasuring 288.88 Sq.yds or 241.53 Sq.mts, of the layout plan approved by HUDA through their letter No.5077/ MPU/ HUDA/82, Plinth Area 1100 Sq.fts, dated.16.05.1983, in Sy.No.118, Situated at Bagh Ameeri Village, Balnagar Mandal, (Now Kukatpally Mandal), Medchal-Malkajgiri District, (formerly Ranga Reddy District) Telangana and bounded by North: Plot Nos.8 & 7, South: 33'wide road, East: Plot No.3, West: Plot No.1 and Schedule Property –B, All that the House No. 445-HIG, on plot No.445, in Sy. No. 232, admeasuring 300 sq.yds or 250.08 sq.mts, Plinth area Ground +1 floor 3600 Sq.fts, Situated at Ramachandrapuram Village and Mandal, Sanga Reddy District (formerly Medak District) Telangana, and abounded by North: Plot No. 44, South: Plot No.446, Plot No. 438, West: 30' Wide Road, the above case posted for appearance **on 24.10.2024 at 10.30 a.m.** before the above said Hon'ble Court. If any person (s) are having any objections may appear in person or through counsel on the above mentioned date and before the Hon'ble court, If any objections not received before the Hon'ble court, the Hon'ble will decide the matter on merits.

**(By order of the Hon'ble Court)**
**Sri.S.RAJU GOUD,**
**Bhaskar voggu, Advocates,**
OFF.H.No.6-03/127, Gulmoharpark, Serilingampally, Ranga Reddy District,
Mob:9701732413
Counsel for Plaintiffs

## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన డిప్యూటీ మేయర్



**నవతెలంగాణ-బోడుప్పల్**

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని పీర్జాదిగూడ నగర డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ప్రధానంగా పీర్జాదిగూడ కమాన్ రోడ్డు విస్తరణ పనుల గురించి మంత్రికి వివరించారు. పనులు ఆలస్యం అవుతున్నందున్న పీర్జాదిగూడ ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, త్వరగా పూర్తి చేసే విధంగా సహకరించాలని డిప్యూటీ మేయర్ కుర్ర కోరారు. పీర్జాదిగూడ నగరంలో పెండింగ్‌లోని అభివృద్ధి పనులపై చర్చించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించారని, పనులు పూర్తయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్టు కుర్ర శివ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## లెప్రసీ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సాయం



**నవతెలంగాణ - జవహర్ నగర్**

లెప్రసీ వ్యాధిగ్రస్తులు ఇతరుల మీద ఆధారపడకుండా సొంతంగా జీవనోపాధి పొందాలని S-ILF ఆర్గనైజేషన్ సీఈఓ గౌరబ్ అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ మదర్ థెరిస్సా కాలనీలో కాలనీ అధ్యక్షులు బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో S-ILF ఆర్గనైజేషన్ సీఈవో గౌరబ్ సహకారంతో ఏడాదిగా 15 మంది లెప్రసీ వ్యాధిగ్రస్తుల జీవనోపాధికి కిరాణా షాపు, టైలరింగ్, కూరగాయలు, బట్టలు, గాజుల షాపు లాంటి వ్యాపారం కోసం ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ మెంబర్ శ్యాంబాబు, మణెమ్మ, స్లాబ్ ప్రెసిడెంట్ రమేష్, వైస్ ప్రెసిడెంట్ అనసూయ, మంజుల, గంగాధర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరనిలోటు



**నవతెలంగాణ-ఉప్పల్**

సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎం) ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె. వెంకన్న అన్నారు. శుక్రవారం ఉప్పల్ పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోయే వ్యక్తి సీతారాం ఏచూరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ కమిటీ సభ్యులు భీష్మాచారి, ఎండీ గౌస్, ఉపేందర్, పద్మ వై. వెంకటేశ్వర్లు, ఊర్మిళ, ఆంజనేయులు, వెంకటేష్, ఎల్లయ్య, సైదులు, పాల్గొన్నారు.

## స్ఫూర్తి గ్రూప్‌లో ఏచూరికి సంతాప సభ



**నవతెలంగాణ-కాప్రా**

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ పార్టీ ఆఫీసులో శుక్రవారం సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు అధ్యక్షత వహించారు. ముందుగా స్ఫూర్తి గ్రూపు నాయకులు శ్రీమన్నారాయణ, విజ్ఞాన వేత్త జయప్రకాష్‌లు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండి పోరాటాలలో పాల్గొని ఎమర్జెన్సీలో జైలు జీవితం అనుభవించారని తెలిపారు. భారతదేశ విముక్తికి మార్క్సిజమే సరైన మార్గమని భావించారన్నారు. శ్రీమన్నారాయణ మాటాడుతూ.. సీతారాం ఏచూరి చెన్నైలో జన్మించారని పేర్కొన్నారు. వారి కుటుంబం ఉద్యోగరీత్యా పలు ప్రాంతాలకు వెళ్ళటండంతో హైదరాబాదులో పదో తరగతి వరకు చదివారని తెలిపారు. మిగిలిన విద్యాభ్యాసం ఢిల్లీలో జేఎన్‌యూ యూనివర్సిటీలో పీజీ చేశారని, పీహెచ్‌డీ చదువుతున్న తరుణంలో ఎమర్జెన్సీ రావటంతో విద్యార్థి సంఘంలో కీలక బాధ్యతలు వహించారని చెప్పారు. ఎస్ఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షులుగా, జేఎన్‌యూకు మూడు పర్యాయాలు అధ్యక్షులుగా పని చేశారని పేర్కొన్నారు. ఆ సమయంలోనే సీపీఐ(ఎం) పార్టీలో సభ్యుడిగా చేరి అంచలంచెలుగా ప్రధాన కార్యదర్శి స్థాయికి చేరారని చెప్పారు. ఆయన జాతీయ, అంతర్జాతీయ విషయాల్లో, దేశ రాజకీయాలలో కీలకంగా వ్యవహరించగలిగారని తెలిపారు. అనంతరం ఉదయ భాస్కర్, శారద, జయరాజు, జి శివరామకృష్ణ, శివన్నారాయణ తదితరుల సభ్యులందరూ ఏచూరి ఫొటోకు పూలను వేసి రెడ్ సెల్యూట్ చెప్పి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాస్, సంతోష్, అరుణ్, వెంకట్, వెంకట్, జయ ప్రకాష్, గౌసియా, శోభ, వెంకటేశ్వరరావు, ఉదయ భాస్కర్, వెంకట రమణయ్య, విజయ్, బీమా, భాస్కర్, ఉన్నికృష్ణన్ పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏచూరికి నివాళి



**నవతెలంగాణ-కాప్రా**

ఎస్ఎఫ్ఐ జాతీయ మాజీ అధ్యక్షుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు కృషి చేస్తామని, అదే తమ లక్ష్యమని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. శుక్రవారం ఈసీఐఎల్ అంబేద్కర్ విగ్రహం దగ్గర సీతారాం ఏచూరికి చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ మేడ్చల్ కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతోష్‌రాథోడ్ మాట్లాడుతూ.. ఏచూరి మరణం యావత్ దేశానికే తీరని లోటన్నారు. మార్క్సిస్టు మేధావి, ఉత్తమ పార్లమెంటేరియన్, సామాజిక, ఆర్థిక, రాజకీయాంశాలపై అనర్గళంగా మాట్లాడే ఏచూరి కన్నుమూయటం బాధాకరం అన్నారు. దేశంలోని ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో ఆయన మరణంతో పెద్ద దిక్కును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 1974లో ఎస్ఎఫ్ఐలో చేరి జేఎన్‌యూ యూనివర్శిటీ సమస్యలపై పోరాడారని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థుల హక్కులపై పోరాడుతూనే నాటి ప్రధాని ఇందిరా గాంధీ ముందు ధైర్యంగా నిలబడి కొట్లాడారని, 1977-78 వరుసగా మూడు సార్లు జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తు చేశారు. 1984 లో జాతీయ అధ్యక్షులుగా పనిచేశారని పేర్కొన్నారు. అనంతరం దేశంలో అణగారిన వర్గాలకు రాజ్యాంగ ఇచ్చిన హక్కులు, సామాజిక తరగతుల హక్కులకై అలుపెరగని ఉద్యమాలు చేశారని, పార్లమెంటులో హక్కుల కోసం , రాజ్యాంగ రక్షణ కోసం పోరాడారని కొనియాడారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, నాయకులు సుమన్, బాబు, శ్రీకాంత్, రమేష, పిఎస్ఎం మాజీ జిల్లా కార్యదర్శి భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎర్ర సూరీడు సీతారాం ఏచూరికి జోహార్లు

**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**



సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణించడంతో ఆయనకు సంతాపంగా శుక్రవారం మల్కాజిగి మండల కమిటీ ఆధ్వర్యంలో మల్కాజి గిరి చౌరస్తాలో మల్కాజిగిరి మండల కార్యదర్శి ఎం. కృపాసాగర్ అధ్యక్షతన ఏచూరి చిత్రపటానికి పార్టీ నేతలతో పాటు పలువురు అఖిలపక్ష నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి మాట్లాడుతూ.. ఏచూరి విద్యార్థి దశలో అభ్యుదయ భావాలకు ఆకర్షితుడై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో చేరాడని, ఢిల్లీ జేఎన్‌యూలో మూడు సార్లు యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని తెలిపారు. అప్పుడే ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ ని తీవ్రంగా ఖండించారు. అనంతరం టీటీడీపీ నాయకులు గోపి, ఒగ్గు చంద్రశేఖర్ మాట్లాడుతూ..సీతారాం ఏచూరి లాంటి గొప్ప నాయకుడిని సమాజం కోల్పోయిందన్నారు.కాంగ్రెస్ నేత నవీన్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి లాంటి నాయకుడిని భవిష్యత్తులో చూడమేమో అని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేత ఖలీల్ మాట్లాడుతూ..ఏచూరి మరణం అభ్యుదయ వాదులకు, సెక్యులర్ పార్టీలకు తీరని లోటన్నారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి మాట్లాడుతూ ఏచూరిని కోల్పోవడం వామపక్ష ఉద్యమానికి తీరని నష్టం అన్నారు. బీఎస్పీ నాయకులు గౌతం రాజు, జనసేన నాయకులు రమేష్ గౌడ్ లు మాట్లాడుతూ.. దేశం గొప్ప నాయకుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) నాయకులు నాయకులు వెంకట్‌రెడ్డి, చిందం హరిలు మాట్లాడుతూ సీతారాం లాంటి గొప్ప నాయకున్ని కోల్పోయామంటే నమ్మబుద్ధి కావడం లేదన్నారు. మహిళా సంఘం నాయకులు మంగ, మీనా కుమారిలు మాట్లాడుతూ..మహిళా ఉద్యమానికి గొప్ప సూచనలు, సలహాలు ఇచ్చారని జోహార్లు తెపారు. కార్యక్రమంలో లక్ష్మణ్, కొండల్, సత్యనారాయణ, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు విజయ్ కుమార్, మురళి మోహన్, సూర్య కుమార్, ప్రదీప్ దాస్ గుప్తా, యువజన సంఘ నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్, సుమిత్ర, నాగమని పాల్గొన్నారు.

# దేవాలయ భూముల్లో యథేచ్ఛగా లే అవుట్లు

- అనుమతి లేకుండానే బ్లాస్టింగ్
- వెంచర్ ఏర్పాటులో డెవలపర్ దుశ్చర్య
- సర్వే చేసి చర్యలు తీసుకుంటాం : దేవాదాయ తహశీల్దారు



**నవతెలంగాణ-బోడుప్పల్**

ప్రభుత్వ భూముల రక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఓ వైపు ప్రకటనలు చేస్తూ ' హైడ్రా'ను ఏర్పాటు చేసింది. దీంతోనైనా కబ్జాలకు గురైన భూములు పోను మిగిలిన భూములైన కాపాడాలనే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానిది. ప్రభుత్వం ఇంత పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా అక్రమార్కులకు చీమకుట్టినట్టు కూడా లేదు. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్, చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 33/5 నుండి 33/10లో 30.23 ఎకరాల విస్తీర్ణంలో టీఎల్పీ ట్రస్ట్ భూమి (దేవాదాయ భూమి) ఉంది. ఈ భూమికి కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసుకొని క్రయవిక్రయాలు చేశారు. ఈ తతంగంపై కొందరు ట్రస్ట్ సభ్యులు కేసులు వేయడంతో న్యాయస్థానం క్రయవిక్రయాలు జరపకుండా ఆదేశాలు జారీ చేయాలని రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు ఇచ్చింది. కానీ అక్రమార్కులు మాత్రం అట్టి ఆదేశాలను పక్కన పెట్టి వారు అనుకున్న పనిలో నిమగ్నమై టీఎల్పీ ట్రస్ట్ భూమిలో యథేచ్ఛగా లే అవుట్లు చేశారు.

### స్వయంగా రేవంత్ రెడ్డే ఫిర్యాదు చేసిన..

బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలో ఉన్న టీఎల్పీ ట్రస్ట్ భూమిని కాపాడాలని నాటి ఎంపీ, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గతంలో అప్పటి మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు, దేవాదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. అప్పటి ప్రభుత్వ ఒత్తిడిల కారణంగా దేవాదాయ శాఖ అధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహరించారు. మరి ఇప్పుడు ప్రభుత్వ భూముల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రానైనా దీనిని కాపాడుతుందా లేదా చూడాలి.



### ఈ బ్లాస్టింగ్‌లు చేసి బండలు పగులకొట్టి

దేవాదాయ శాఖ భూములను ఆక్రమించి లే అవుట్ చేస్తున్నారని ఓ వైపు ఫిర్యాదులు రావడంతో దేవాదాయ శాఖ అధికారులు సర్వే చేస్తున్నారు. అధికారులు ఓ వైపు సర్వే చేస్తుండగా మరోవైపు కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న భూములలో వెంచర్లు చేస్తున్నారు. అందులోనే డిటోనేటర్లు పెట్టి బ్లాస్టింగ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయి. ఏదైన ఓ ప్రాంతంలో బండరాయి బ్లాస్ట్ చేయాలంటే స్థానిక పీఎస్ నుంచి ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ ఇక్కడ ఎవరూ చూడరులే అనే కోణంలో పెద్ద పెద్ద బండలను బ్లాస్టింగ్ చేయడం వెనుక ఎవరి హస్తం ఉందో తెలియాల్సి ఉంది. ఈ బ్లాసింగ్‌కు వాడిన డిటోనేటర్లు ఎక్కడ తెచ్చారు. ఇక్కడికి ఎలా వచ్చాయనేది మీకు చెప్పాల్సిన అవసరం లేదని స్వయంగా ఆ బండరాళ్ల పగుల కొట్టే కాంట్రాక్టు ఒప్పందం చేసుకున్న వ్యక్తి చెప్పడం గమనార్హం.

వెంచర్‌లోని అవినీతి భాగోతం బయటకు రాకుండా ఉండేందుకు, బ్లాస్టింగ్‌ల అంశం వెలుగులోకి రాకుండా ఉండేందుకు గ్రేటర్ హైదరాబాదు కు చెందిన పార్టీ మారిన ఎమ్మెల్యే నుండి పోలీసు ఉన్నతాధికారులకు పలు మార్లు ఫోన్ రావడం చుస్తుంటే దీని వెనక ఎవరెవరు ఉన్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### అనుమతులున్నాయా?

వెంచర్ ఏర్పాటు కోసం డెవలపర్లు అనుమతులు తీసుకున్నారా లేదా అనేది అధికారులను అడగ్గా వారి నుండి ఏలాంటి సమాధానం లేదు. ఒకవేళ అనుమతి వచ్చినా వివాదంలో ఉన్న స్థలానికి వెంచర్ ఏర్పాటు అనుమతి ఏలా వస్తుంది అనేది తెలాల్సిన అంశం. ఓ వైపు అధికారులు సర్వే ప్రారంభించి ఉన్నతాధికారులకు ఎలాంటి నివేదిక రాక మునుపే హడావుడిగా వెంచర్ పూర్తి చేయడం వెనుక ఉన్న అర్థం ఏమిటో తెలియాలి.

### వెలుగులోకి ఇలా...

టీఎల్పీ చారిటబుల్ ట్రస్ట్ భూముల కబ్జాలపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అనేక సార్లు దేవాదాయ శాఖ అధికారులకు, మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన దేవాదాయ శాఖ కమిషనర్ సర్వే చేయడానికి తహశీల్దారు తో పాటు ముగ్గురు సర్వేయర్లను నియమించింది.

### కాంప్రేషర్ ట్రాక్టరు సీజ్ చేసిన పోలీసులు

అనుమతి లేకుండా బ్లాస్ట్ చేస్తున్నారనే సమాచారంతో రంగంలోకి దిగిన మేడిపల్లి పోలీసులు కాంప్రేషర్ ట్రాక్టరు, దాని యజమానిని అదుపులోకి తీసుకున్నారు. బండ పగుల కొట్టేందుకు వాడిన డిటోనేటర్లు ఎక్కడ దాచారు, ఎక్కడి నుండి తెచ్చారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని మేడిపల్లి సీఐ గోవింద్‌రెడ్డి తెలిపారు.

### సర్వే చేసి చర్యలు తీసుకుంటాం



బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 33/5 నుండి 33/10 వరకు గల భూమిలో ఉన్న 30.23 ఎకరాల విస్తీర్ణంలో టీఎల్పీ చారిటి ట్రస్ట్ భూమి ఉంది దానికి తగిన అదారాలు అన్ని ఉన్నాయి. టీఎల్పీ చారిటబుల్ ట్రస్ట్ భూమి అన్యాక్రంతం అయ్యిందని ఫిర్యాదు వచ్చింది. వచ్చిన ఫిర్యాదుల అధారంగా సర్వే చేస్తున్నాము సర్వే చేసి హద్దులు నిర్ధారించి టీఎల్పీ చారిటబుల్ ట్రస్ట్ భూమిని ఖచ్చితంగా కాపాడుతాం.

-ఎన్.విజయలక్ష్మి, తహశీల్దారు దేవాదాయ శాఖ

## ఆర్యవైశ్య సంఘ సభ్యులకు చేయూతనివ్వాలి



- రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ
- బెలిదే రమేష్, బల్లి శ్రీనివాస్

**నవతెలంగాణ-జవహర్‌నగర్**

ఆర్యవైశ్య సంఘం సభ్యులకు చేయూత నందించాలని రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బల్లి శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షులు బెల్దే రమేష్ గుప్తా, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మహాసభ అధ్యక్షులు మాట్లాడుతూ మహాసభ ద్వారా ఓటు వేసి మిమ్మల్ని గెలిపించిన ఆర్యవైశ్య సంఘ సభ్యులందరికీ చేయూతనందిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు పార్శి ప్రకాష్ గుప్తా, కాప్రా మండల అధ్యక్షులు బాల మహేష్ గుప్తా, బాలాజీ నగర్ అధ్యక్షులు చిరంజీ రవీందర్ గుప్తా, బల్లి శ్రీధర్, పెద్ది మురళి, సంతోష్, బాలాజీ నగర్, అంబేద్కర్ నగర్ ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు పరిశీలించిన మేయర్



**నవతెలంగాణ-బోడుప్పల్**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎచ్ఎండీఏ నిధులతో చేపట్టిన పీర్జాదిగూడ, పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనులను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్, ఎచ్ఎండీఏ అధికారులుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా పీర్జాదిగూడ రోడ్డు విస్తీర్ణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోడిగే కృష్ణ, యసారం మహేశ్, తావిటి ప్రశాంత్,సాయి జగన్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



**నవతెలంగాణ - జవహర్‌నగర్**

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జవహర్ నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్, 8వ డివిజన్, విఘ్నేశ్వర కాలనీలో ఏకదంతా యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి మేయర్, డిప్యూటీ మేయర్, హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలంతా ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు మేలు జరుగుతదన్నారు. ఈ వైద్య శిబిరంలో మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి , డాక్టర్ ఆర్యాస్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి, ఆర్వి డయాగ్నస్టిక్స్ వారు ఉచితంగా పరీక్షలు చేసిన ఆస్పత్రి వారికి ధన్యవాదాలు తెలిపారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 200 మందికిపైగా చికిత్సలు చేయించిన ఏకదంతా యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కోటేష్ గౌడ్ , డివిజన్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి , సుబ్రహ్మణ్యం, భాస్కర్, ప్రేమ్ రాజ్ , యూత్ కమిటీ సభ్యులు ప్రదీప్, ప్రసన్న, బన్నీ, కరుణాకర్, ప్రవీణ్, మాక్షివిజన్ మార్కెటింగ్ మేనేజర్ మహేందర్, కౌన్సిలర్ శ్రీలేఖ, ఆప్టోమెట్రిస్ట్ హిమబిందు, టెక్నిషియేష్ అమీన్, ఆర్యాస్ డెంటల్ డాక్టర్ విజయ్, ఆర్వి డయాగ్నోస్టిక్స్ టెక్నిషియన్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి పెద్ద పీట : మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీత



**నవతెలంగాణ-కీసర**

అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తున్నామని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలో 8వ వార్డు ఇందిరమ్మ కాలనీలో రూ.8 లక్షలతో, 9వ వార్డు భవానీ కాలనీలో రూ.30 లక్షలతో, 15వ వార్డులో రూ.17 లక్షలతో సాయి శ్రీనివాస్ నగర్ ఎక్స్ టెన్షన్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణాలకు ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.55 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో అభివృద్ధి చేస్తున్నామని చైర్ పర్సన్ తెలిపారు. మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి, వైస్ చైర్మెన్ నరేందర్ రెడ్డి, డీఈఈ చిరంజీవులు, వార్డు కౌన్సిలర్లు మాదిరెడ్డి నరసింహ రెడ్డి ,సంపంన్ బోల్ స్వప్న హరి గౌడ్, సరిత ఉన్నారు.

## నేటి నుంచి జేవీవీ రాష్ట్ర మహాసభలు

**నవతెలంగాణ-కాప్రా**

కాప్రా పరిధిలోని ఏఎస్‌రావు నగర్‌లో ఈ నెల శని, ఆదివారాల్లో (14,15) తేదీల్లో నిర్వహించే జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా నాయకులు ఎం.శ్రీనివాస్, పి.నాగరాజు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ప్రజా వైద్యులు జతీన్‌కుమార్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, పాత్రికేయులు కె.శ్రీనివాస్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్, పర్యావరణ కార్యకర్త డా.లుబ్నా సార్వత్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ పాల్గొంటారని పేర్కొన్నారు. జేవీవీ మహాసభలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. జేవీవీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయడానికి ఆగష్టు 12న ఈసీఐఎల్‌లో 96 మందితో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మహాసభలకు హాజరయ్యే వారు విడిది చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఇందులో భాగంగా శనివారం విద్యావిధానం-వక్రీకరణ అంశంపై ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న అంశంపై పాత్రికేయులు కె.శ్రీనివాస్ ప్రసంగిస్తారన్నారు. ప్రజా ఆరోగ్యం - ప్రభుత్వాల బాధ్యత అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్, పర్యావరణ-అభివృద్ధి అంశంపై డా.లుబ్నా సార్వత్ మాట్లాడుతారన్నారు. 15న ముగింపు సభలో మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ ప్రసంగిస్తారన్నారు. ప్రజానీకంలో శాస్త్రవిజ్ఞాన ప్రచారం, శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించటంతో పాటు శాస్త్రవిజ్ఞానం ద్వారా మూఢవిశ్వాసాలను, ఛాందసభావాలను అరికట్టటానికి జేవీవీ కృషి చేస్తోందన్నారు. ప్రజా సమస్యలపై అవగాహనను పెంపొందించడం, పరిష్కారాలను అన్వేషించడం, సత్యాన్వేషణకు, దేశ స్వావలంబనకు, సమగ్రతకు, ప్రపంచ శాంతికి, సామాజిక అభివృద్ధికి, సాంస్కృతిక వికాసానికి జేవీవీ పని చేస్తోందన్నారు. ప్రకృతి వనరుల సంరక్షణ, పర్యావరణ కాలుష్య నివారణ, జీవవైవిధ్యాన్ని కాపాడుటకు కృషి చేయడంలో ఉద్యమించే సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆరు లక్షల మందికి పైగా విద్యార్థులతో చెకుముకి సైన్స్ సంబరాల నిర్వహించినట్లు తెలిపారు. శాస్త్ర పరిశోధనలకు నిధుల లేమిని పరిష్కరించాలని కోరుతూ 'మార్చ్ ఫర్ సైన్స్' నిర్వహించామన్నారు. గ్రామాలు, బస్తీలు, పట్టణాల్లో బీపీ, షుగర్ పేషెంట్స్‌కి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో వివిధ అంశాలపై సెమినార్లు, వేసవిలో సైన్సు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని కోరుతూ. ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

## సంపులో పడి యువకుడు మృతి

**నవతెలంగాణ - జవహర్ నగర్**



మృతుడు నవీన్ (ఫైల్)

సంపులో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, కౌకూర్ ఓం శ్రీ హైట్స్ అపార్ట్మెంట్ వద్ద ఉన్న సంపులో పడి నవీన్ (21) మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరు కున్న పోలీసు లు మృతుడు జవహర్ నగర్ శాంతి నగర్‌కు చెందిన వాసిగా గుర్తించారు. నవీన్ శరీరంపై గాయాలు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్యనా, లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## అన్నదానం గొప్పది : ఎమ్మెల్యే



**నవతెలంగాణ-ఉప్పల్**

అన్ని దానాల కన్న అన్నదానం గొప్పదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డీసీ ఆంజనేయులు , చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ , హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ చేతన హరీష్, రమంతా పూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## చీర్యాల లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న నాగమణి



**నవతెలంగాణ-కీసర**

చీర్యాల లక్ష్మీనరసింహస్వామి వారిని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి, డీఈ చిరంజీవి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఫౌండర్, చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిలు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు స్వామివారి చిత్రపటం అందజేసి వేద పండితులతో ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో చీర్యాల పంచాయతీ కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

## గణపతికి కార్పొరేటర్ పూజలు



**నవతెలంగాణ-కాప్రా**

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ ఇంద్రానగర్, మంగాపురం, హెచ్‌బీ కాలనీఫేజ్-2లో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాలను కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు మండపం నిర్వాహకులు కార్పొరేటర్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రామకృష్ణ, శివాజీ, అశోక్ రెడ్డి, నిస్సార్, నరేందర్ పాల్గొన్నారు.

## రూ.61 వేలకు వినాయక లడ్డు దక్కించుకున్న నరేందర్‌రెడ్డి



**నవతెలంగాణ-కీసర**

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగారం మున్సిపాలిటీ 20 వార్డులోని సాయిశ్రీజ కాలనీలో నిర్వహించిన లడ్డు వేలం పాటలో వ్యాపారవేత్త దాసరి నరేందర్ రెడ్డి పాల్గొని రూ.61 వేలకు దక్కించుకున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కాలనీ వాసులు సకుటుంబ సపరివార సమేతంగా స్వామి వారికి నిత్యం పూజాది కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ చేసి స్వామివారి సేవలో పాల్గొన్నారు.


## కామ్రేడ్ లక్ష్మీ దేవమ్మకు జోహార్లు



**నవతెలంగాణ-ఉప్పల్**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్ లక్ష్మీ దేవమ్మ అనారోగ్యంతో శుక్రవారం మరణించడం చాలా బాధాకరమని సీపీఐ(ఎం) ఉప్పల్ నాయకులు జె వెంకన్న, మహమ్మద్ గౌస్, భీష్మాచారి అన్నారు. వారికి విప్లవ జోహార్లు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఉద్యమ నిర్మాణంలో కార్యకర్తలు, నాయకులను తయారు చేశారని తెలిపారు. కార్యకర్తలపై వారు చూపించే ప్రేమ, అభిమానం మరువలేనిదని పేర్కొన్నారు. వారికి మరోసారి ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ తరపున విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని చెప్పారు.

తెలంగాణ రైతాంగ పోరాటం ఎందరిలోనో చైతన్యం నింపింది. పోరాటంవైపు నడిపింది. ముఖ్యంగా పరదాల చాటున నాలుగ్గోడలకే పరిమితమైన తెలంగాణ మహిళల్లో ఉత్తేజాన్ని నింపింది. సాంప్రదాయ సంకెళ్లను తెంచుకుని ఎర్రజెండా చేతబట్టే ధైర్యాన్ని ఇచ్చింది. అభ్యుదయ భావాలతో పెరిగిన వారికి సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ధైర్యంగా ఎదిరించే శక్తిని ఇచ్చింది. అలాంటి వ్యక్తే ప్రియంవద.



# ఎదిరించే శక్తి పార్టీనే ఇచ్చింది

ప్రియంవద పుట్టింది నల్గొండ జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గం. తండ్రి రామకృష్టారెడ్డి, తల్లి లక్ష్మమ్మ. వీరిది మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. నాలుగవ తరగతి వరకు చదువుకున్నారు. నాడు స్త్రీలకు విద్య అంతంతమాత్రమే. భాగవతం, భారతం గురించి తాతయ్య ఆమెకు బోధించేవారు. దీంతో చదవడం అలవాటు చేసుకున్నారు. హిందీకూడా నేర్చుకున్నారు. చిన్నతనం నుండే కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంతాలు, రష్యన్ సాహిత్యం, గోర్కి నవలలు చదివేవాళ్లు. అన్నయ్య దాయం రాజిరెడ్డి అప్పటికే ఉద్యమంలో ఉన్నారు. వదిన, ఇతర బంధువులంతా సాయుధపోరాటంలో పాలుపంచుకోవడంతో ఈమే ఉద్యమం వైపుకు ఆకర్షింపబడ్డారు.

### నిషేధ కాలంలో...

ఆనాడు పార్టీ నాయకులంతా బాల్య వివాహాలు, స్త్రీల సమస్యలు, రైతు కూలీల సమస్యలపై ఉద్యమం చేసేవారు. ఆంధ్రమహాసభలో అడుగుపెట్టాక జీవితం, సమాజం అంటే ఏమిటో అర్థచేసుకున్నారు. ఆ రోజుల్లో తిరుగుబాటు ఉప్పెనలా ఉప్పొంగుతుండేది. దీంతో పటేళ్లు, దేశముఖ్‌లు ఉద్యమకారుల గురించి చెడుగా ప్రచారం చేసేవారు. పార్టీపై నిషేధం పెరగడంతో వీరంతా విజయవాడకు వెళ్లారు. అక్కడ కూడా ఊరికే కూర్చోలేదు. తెలంగాణా సాయుధపోరాటం ఎందుకు జరుగుతోందో అక్కడి ప్రజలకు వివరించేందుకు ప్రచారం మొదలెట్టారు. ఆయుధాలు పట్టి కాల్చడం కూడా నేర్చుకున్నారు.

### తండ్రికి తెలియకుండా...

రెండవ ప్రపంచ యుద్ధం గురించి వెలువడే పుస్తకాలను చదివేవారు. దీంతో నాటి పరిస్థితిని అర్థం చేసుకోగలిగారు. ప్రజల సమస్యలనూ ఇట్టే అర్థసుకునేవారు. తండ్రి నుండి క్రమశిక్షణ నేర్చుకున్నారు. 'నాన్న ఓ సారి ఊరుకెళ్లడంతో భువనగిరిలో జరిగే ఆంధ్రమహాసభకు అన్న, వదిన శశిరేఖతో పాటు నేనూ వెళ్లాను. ఉద్యమంలో పేరొందిన భీమిరెడ్డి నర్సింహారెడ్డి మా వదినకు అన్నయ్య. ఇలా మా బంధువర్గమంతా ఉద్యమంలో వుండేది. పార్టీ అప్పుడప్పుడే ఎదుగుతోంది. ఆంధ్రమహాసభకు వెళ్లొచ్చిన విషయం నాన్నకు తెలిసింది. అయితే నాన్న పరిస్థితి అర్థంచేసుకున్నారు' అంటూ ఆమె 'వీర తెలంగాణ మాది' పుస్తకంలో పంచుకున్నారు.

### మూడేండ్లు జైలు జీవితం

ప్రియంవద దళంలో ప్రత్యక్షంగా పాల్గొనలేదు. పరోక్షంగా మాత్రమే సహాయం అందించారు. ఉద్యమంలో భాగంగా తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసేటప్పుడు ప్రియంవద ఎర్రజెండా పట్టి ఊరు గుట్టపై నిలబడి సెంట్రీగా పని చేశారు. ఓసారి దళంతో కలిసి ప్రచారానికి వెళ్లారు. పోలీసులు ఆ సమయంలో వీరిని వెంబడించారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎలాగో తప్పించుకోగలిగారు. తూర్పుగూడెంలో ప్రియంవద సొంత ఇల్లువుండేది. అక్కడ ఉన్నప్పుడే 1947లో ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. మూడేండ్లు జైలు జీవితం గడిపారు. తరువాత పార్టీ చీలిన తర్వాత ఎన్నికల వరకు మాత్రమే ఈమె పార్టీలో పనిచేశాను.

### అభివృద్ధిపై దృష్టి పెడితేనే...

ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొనేశక్తి కమ్యూనిస్టు పార్టీ ద్వారానే తనకు వచ్చిందని ఆమె చెప్పుకునే వారు. మట్టిలోని మాణిక్యాలు ఈ ఉద్యమం ద్వారా బయటకు వచ్చాయంటారు. ధర్మభిక్షం, రాఘవేంద్ర, దేవులపల్లి వెంకటేశ్వరరావు, ప్రతాపరెడ్డిలతో ఈమెకు పరిచయం వుంది. అలాగే శశిరేఖ, స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, లలితమ్మ, సుశీలాదేవి ఈమెకు సహచరులు. నేటి పాలకులు ప్రజల కోసం గాక అధికారం కోసం పనిచేస్తున్నారని ఆమె ఆవేదన చెందేవారు. నాటి నిజాం కాలం పరిస్థితులే నేటికి కనిపిస్తున్నాయని తనని కలిసేందుకు వచ్చిన పార్టీ కార్యకర్తలతో, నాయకులతో ఆమె అంటుండేవారు. అలాగే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం జరుగుతున్న సమయంలో 'రాష్ట్ర విభజన జరిగినా ఇదే పాలకులు, ఇవే విధానాలుంటాయి. దీని కంటే తెలంగాణ ప్రాంత అభివృద్ధి గురించి దృష్టిసారిస్తే సరిపోతుంది' అంటూ ఆమె తన అనుభవాల నుండి సూచనలు చేసేవారు. ■

## కొన్న పిండి స్వచ్ఛమైనదేనా?



నేటి రోజుల్లో ప్రతీదీ కల్తీమయమే. ఏది నిజమో, ఏది నకిలీదో అర్థం చేసుకోవడం అంత తేలికైన పని కాదు. మార్కెట్‌లో దొరికే పప్పు ఉప్పుల నుంచి అధిక ధరలతో కొనే నిత్యావసర వస్తువుల వరకు అన్నింటిలో కల్తీ రాయుళ్లు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. కల్తీ, అనారోగ్యకరమైన, విషపూరితమైన ఆహారాలు తినడం వల్ల మనకు తెలియకుండానే శరీరాన్ని రోగాల మయం చేస్తుంది. ముఖ్యంగా మార్కెట్లో ఏదైనా పిండి కొనుగోలు చేస్తే.. అది మంచిదా చెడ్డదా, అది ఎంత నాణ్యమైనదో ఇలా తెలుసుకోండి.

ఈ రోజుల్లో రాగి పిండి నుండి బోరిక్ యాసిడ్ వరకు వివిధ రకాల కల్తీలు కలుపుతున్నారు. ఇలాంటి కల్తీ పిండి తింటే పొట్టకు తీవ్రమైన హాని కలిగిస్తుంది. తరచూ కడుపు నొప్పిని కూడా కలిగిస్తుంది. క్రమంగా మూత్రపిండాలు కూడా దెబ్బతినడం ఖాయం. అందుకే భారత ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీ పిండి కల్తీ కాదా అని తెలుసుకోవడానికి సులభమైన మార్గాన్ని కనిపెట్టింది. ఎలాగో చూద్దాం..

కొనుగోలు చేసి తెచ్చిన పిండిలోని ఒక స్పూను పిండిని గ్లాసు శుభ్రమైన నీటిలో కలపాలి. ఆ పిండిని స్పూనుతో కలిపిన తర్వాత పిండి నీళ్లపైన తేలితే అది కల్తీ అని అర్థం చేసుకోవాలి. కల్తీ ఉంటే పిండి మొత్తం నీటిలో కరగదు.. పైకి తేలుతుంది. పిండి స్వచ్ఛమైనదైతేనే అది నీటిలో కలుస్తుంది.

పిండిలో కల్తీకి ప్రత్యేక పరీక్ష కూడా ఉంది. ముందుగా టెస్ట్ ట్యూబ్ తీసుకోవాలి. ఆ ట్యూబ్‌లో 1 గ్రాము పిండిని తీసుకుని, ఆ పిండిలో 5 ఎంజీల నీళ్లతో బాగా కలపాలి. ఇప్పుడు దానికి కొన్ని చుక్కల సాంద్రీకత హైడ్రోక్లోరిక్ యాసిడ్ కలపాలి. ఈ మిశ్రమంలో పసుపు పేపర్ స్ట్రిప్‌ను ముంచాలి. పసుపు పేపర్ స్ట్రిప్ రంగు అస్సలు మారకపోతే పిండిలో కల్తీ లేదని అర్థం చేసుకోవాలి.

పసుపు పేపర్ స్ట్రిప్ రంగు ఎర్రగా మారితే పిండిలో కల్తీ ఉందని అర్థం చేసుకోవాలి. ఇది జాగ్రత్తగా పరీక్షించి తెలుసుకోవాలి. కల్తీ ఉన్నట్లు తెలితే ఆ స్టోర్ గురించి పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ■

## పిల్లలకు డ్రాగన్ ఫ్రూట్ పెట్టొచ్చా..

డ్రాగన్ ఫ్రూట్‌లో అనేక పోషకాలు ఉంటాయి. ప్రస్తుత కాలంలో చాలా మంది డ్రాగన్ ఫ్రూట్ తింటున్నారు. మరి పిల్లలకు ఈ పండు పెట్టొచ్చా? పెడితే ఎలాంటి లాభాలు ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.

### విటమిన్ సి మెండుగా

డ్రాగన్ ఫ్రూట్‌లో విటమిన్ సి అధికంగా లభిస్తుంది. దీని వల్ల చాలా రకాల హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో, రోగ నిరోధక శక్తిని పెంచడంలో సహాయ పడుతుంది.

### రోగ నిరోధక శక్తిని పెంచుతుంది

డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల శరీరంలో ఇమ్యూనిటీ వ్యవస్థ అనేది బలంగా మారుతుంది. విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచడంలో హెల్ప్ చేస్తుంది. ముఖ్యంగా పిల్లలకు విటమిన్ సి చాలా అవసరం. రోగాలు త్వరగా ఎటాక్ కాకుండా చూస్తుంది.



### జీర్ణ క్రియ మెరుగ్గా ఉంటుంది

డ్రాగన్ ఫ్రూట్‌లో ప్రీబయోటిక్ ఫైబర్ ఉంటుంది. ఇది ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహి స్తుంది. అలాగే ఆరోగ్యకరమైన జీర్ణక్రియకు సహాయ పడు తుంది. ముఖ్యంగా శిశువులలో ఉండే మలబద్ధకాన్ని నివారిస్తుంది.

### యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ

డ్రాగన్ ఫ్రూట్‌లో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇవి పిల్లలను హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించడంలో సహాయపడతాయి. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. వారి మొత్తం ఆరోగ్యానికి తోడ్పడతాయి.

### స్కిన్ అలెర్జీలను తగ్గిస్తుంది

పిల్లలకు డ్రాగన్ ఫ్రూట్ తినిపించడం వల్ల చర్మ అలర్జీలను తగ్గించవచ్చు. ఇందులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పిల్లల చర్మానికి రక్షణగా ఉంటాయి. ■

## ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్..

(మొదటిపేజీ తరువాయి)

విచారణ కోసం ట్రయల్ కోర్టు ఎదుట హాజరుకావాలని, ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లకూడదని, అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయకూడదని స్పష్టం చేసింది.

**సుదీర్ఘ జైలు శిక్ష అన్యాయంగా స్వేచ్ఛను హరించడమే : జస్టిస్ సూర్యకాంత్**

న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సుదీర్ఘ జైలు శిక్ష "అన్యాయంగా స్వేచ్ఛను హరించడమే" అని అన్నారు. అయితే కేజ్రీవాల్ అరెస్టు చెల్లుబాటు అవుతోందని, విధానపరమైన అక్రమాలకు గురికాలేదని అభిప్రాయపడ్డారు. విచారణ పట్టాలు తప్పినప్పుడు న్యాయస్థానం స్వేచ్ఛ వైపు వంగి ఉంటుందని జస్టిస్ కాంత్ అన్నారు. "బెయిల్ అనేది నియమం. జైలు మినహాయింపు" అనే చట్టపరమైన ప్రమాణాన్ని నొక్కి చెప్పారు.

సీబీఐ పంజరంలో ఉన్న చిలుక అనే భావనను తొలగించాలని, దానిని పంజరం లేని చిలుకగా చూపించాలని సూచించారు. సీబీఐ అనుమానాలకు అతీతంగా సీజర్ భార్యలా ఉండాలని జస్టిస్ భుయాన్ అన్నారు. బొగ్గు బ్లాకుల కేటాయింపుపై తన నివేదికలో ప్రభుత్వం జోక్యం చేసుకున్నందుకు సీబీఐని 11 ఏండ్ల క్రితం సుప్రీంకోర్టు నిలదీస్తున్న సమయంలో 'పంజరం చిలుక' వ్యాఖ్యను మొదటిసారిగా చేసింది. ఈ కేసును మీడియా 'కోల్‌గేట్' అని పిలిచింది. న్యాయమూర్తి ఆర్ఎం లోధా మాట్లాడుతూ సీబీఐని పంజరంలో బంధించిన చిలుక అని, అది మాస్టర్ వాయిస్‌లో మాట్లాడుతుందని అన్నారు. మళ్లీ ఇప్పుడు అదే వ్యాఖ్య సుప్రీం కోర్టు చేసింది.



కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. కేజ్రీవాల్‌ని సీబీఐ అరెస్టు చేయడాన్ని ఇన్సురెన్స్ అరెస్టుగా పేర్కొన్నారు. సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వాదనలు వినిపించారు. మద్యం స్కాం కేసులోని సొత్తును 2022లో గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపయో గించిందని తెలిపారు. సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ వేయడంపై సైతం అభ్యంతరం తెలిపారు. బెయిల్ కోసం ముఖ్యమంత్రి ఎప్పుడూ ట్రయల్ కోర్టును ఆశ్రయించలేదన్నారు. కేజ్రీవాల్ పిటిషన్లపై ఇప్పటికే ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం సెప్టెంబర్ 5న కేజ్రీవాల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. తాజాగా తీర్పును వెలువరించింది. కేజ్రీవాల్‌కు గతంలో సుప్రీంకోర్టు ఈడీ కేసులో బెయిల్ ఇచ్చింది.

**సీబీఐ పంజరంలో ఉన్న చిలుకలా పని చేయొద్దు : జస్టిస్ ఉజ్జల్ భుయాన్**

జస్టిస్ ఉజ్జల్ భుయాన్ భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సీబీఐ అరెస్టు "అన్యాయమైనది" అని అన్నారు. సీబీఐ పంజరంలో బంధించిన చిలుకలా పని చేయకూడదని, అన్ని అనుమానాలకు అతీతంగా ఉండాలని తెలిపారు. మరోవైపు, ఈడీ కేసులో బెయిల్ పొందిన తరువాత కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ఆప్ చీఫ్ జైలు నుంచి విడుదలను నిరాశపరిచేందుకు మాత్రమే అని జస్టిస్ భుయాన్ సీబీఐపై తీవ్రంగా మండిపడ్డారు. 22 నెలలుగా కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేయలేదని, ఈడీ కేసులో విడుదలైన నేపథ్యంలోనే ముఖ్యమంత్రిని అరెస్టు చేసిందని ఆయన పేర్కొన్నారు. " సీబీఐ ఇటువంటి చర్య అరెస్టు సమయం గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. సీబీఐ అరెస్టు ఈడీ కేసులో మంజూరు చేయబడిన బెయిల్‌ను నిరాశపరచడానికి మాత్రమే" అని జస్టిస్ భుయాన్ అన్నారు.

## అదానీ సొమ్ము రూ.2600 కోట్లు జప్తు

(మొదటిపేజీ తరువాయి)

అత్యధికంగా 2.55 శాతం చొప్పున నష్టపోగా.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 0.76 శాతం, అదానీ పోర్ట్స్ 1.37 శాతం చొప్పున విలువ కోల్పోయాయి.

## మంకీపాక్స్‌కు తొలి వ్యాక్సిన్

(మొదటిపేజీ తరువాయి)

ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్‌ను అత్యవసరమైన కమ్యూనిటీల్లో ఇవ్వడానికి చూస్తున్నారు. తమ ప్రీ క్వాలిఫికేషన్ జాబితాలో ఈ వ్యాక్సిన్‌ను చేర్చినట్టు డబ్ల్యూహెచ్‌ఓ శుక్రవారం ప్రకటించింది. వ్యాక్సిన తయారీదారు బవేరియన్ నార్డిక్ అందచేసిన సమాచారం, యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ ఇచ్చిన సమీక్ష ప్రాతిపదికన ప్రీ క్వాలిఫికేషన్ ప్రక్రియ చేపడతారు. వ్యాక్సిన్లను వేగంగా సమీకరించడం, పంపిణీ చేయడానికి ఉద్దేశించిందే ఈ ప్రీ క్వాలిఫికేషన్ ప్రక్రియ. ప్రస్తుతం చెలరేగుతున్న మంకీపాక్స్ వైరస్‌పై పోరాటంలో ఇది కీలక చర్య అని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అదనామ్ గెబ్రెయెసెస్ వ్యాఖ్యానించారు. అవసరమున్న అందరికీ సమానంగా పంపిణీ అయ్యేలా వ్యాక్సిన్ల ఉత్పత్తిని పెంచాల్సి వుందని ఆయన పిలుపిచ్చారు. ఈ వ్యాధిని అదుపు చేసేందుకు ఇతరత్రా చర్యలు తీసుకోవడంతో పాటూ ఈ వ్యాక్సిన్ వేయడం వల్ల ఇన్ఫెక్షన్లను నివారించడానికి దోహదపడుతుందని, సంక్రమణ నిలిచిపోతుందని, ప్రాణాలను కాపాడగలుగుతామని ఆయన పేర్కొన్నారు. నాలుగు వారాల తేడాలో రెండు డోసులుగా ఈ వ్యాక్సిన్‌ను అందచేస్తారు. 18ఏండ్లు పైబడిన వారికి మాత్రమే ప్రస్తుతం ఆమోదించారు. వైరస్ సోకడానికి ముందుగానే ఈ వ్యాక్సిన్ ఒక డోస్‌ను ఇచ్చినట్లైతే 76శాతం మేరకు రక్షణ కల్పించినట్లేనని ప్రస్తుతం అందుబాటులోని డేటా తెలియచేస్తోంది. ఇక రెండు డోసులు ఇస్తే 82శాతం మేరా సమర్ధవంతంగా పనిచేస్తుందని డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది.

## జీఎస్టీపై విమర్శలు.. నిర్మలా సీతారామన్‌కు క్షమాపణలు

**చెన్నయ్ హోటల్ యజమాని వీడియో వైరల్**

**బీజేపీ బెదిరింపులు వల్లే అంటూ ఖర్గే విమర్శలు**



న్యూఢిల్లీ : ఆహార పదార్థాలపై జీఎస్టీ విషయంలో తమిళనాడుకు చెందిన 'శ్రీ అన్నపూర్ణ రెస్టారెంట్' యజమాని శ్రీనివాసన్ ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జీఎస్టీ గురించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను ఆయన నిలదీశారు. దేశంలో రెస్టారెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావించిన ఆయన జీఎస్టీ పెంచుకుంటూ పోతే వాటి మనుగడ కూడా కష్టంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే జీఎస్టీ పై ఆందోళన వ్యక్తం చేసిన ఇదే శ్రీనివాసన్ ఓ ప్రయివేటు కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి తన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. అన్నపూర్ణ రెస్టారెంట్ చైన్ యజమాని వ్యవహారంలో నిర్మలా సీతారామన్ తీరు అవమానకరమైనదని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. పేద మధ్యతరగతి ప్రజల పట్ల జీఎస్‌టీ భూతంలా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వ చర్యలతో చిన్న వ్యాపారాల యజమానులు ఆర్థిక దాడులకు గురవుతున్నారని వాపోయారు. అధికార అహంకారంతో బీజేపీ నేతలు ఇలాంటి బెదిరింపు వైఖరిని ప్రదర్శిస్తున్నారని తప్పుబట్టారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా దీనిపై స్పందించారు. తన బిలియనీర్ స్నేహితులు నిబంధనలను వక్రీకరించడానికి, చట్టాలను మార్చడానికి, జాతీయ ఆస్తులను సొంతం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు ప్రధాని వారికి రెడ్ కార్పెట్ పరుస్తారని, ఇలాంటి చిన్న వ్యాపారులు మాత్రం నోట్ల రద్దులు, పన్ను దోపిడులు, జీఎస్టీలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి అవమానాలు కూడా వారికేనంటూ కేంద్రం తీరును తీవ్రంగా ఆక్షేపించారు. ఈ వీడియోపై తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో తమిళనాడు బీజేపీ చీఫ్ కె అన్నామలై బహిరంగ క్షమాపణలు చెప్పారు.



## ఎమర్జెన్సీని తలపిస్తోన్న రేవంత్ పాలన

(మొదటిపేజీ తరువాయి)

ఎఫ్ఆర్ఐ నమోదు కాలేదన్నారు. గతంలో నల్లగొండలో తమ బస్సుపై, సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంపై దాడి చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడులు చేయించారన్నారు. సమైక్యాంధ్రలో కూడా తాము ఇన్నీ నిర్బంధాలు ఎదుర్కోలేదని చెప్పారు. కౌశిక్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసినట్టే.. గాంధీని అరెస్టు చేసి ఉంటే ఈ గొడవ జరిగేదే కాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పదేండ్లపాటు అందరినీ కలుపుకొని పనిచేశారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా 16వ ఆర్థిక సంఘం ఎదుట తమ వాదనలు వినిపించినట్టు తెలిపారు. పీఏసీ చైర్మెన్ ఎన్నిక ఎలక్షన్ ద్వారా జరగలేదని.. సెలక్షన్ ద్వారా జరిగిందన్నారు. ఢిల్లీలో సీఎం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. ఎన్నిక ద్వారా పీఏసీ చైర్మెన్‌ను ఎన్నుకున్నామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రివ్యూ చేయాల్సింది ఈ ఘటనపై కాదని.. తమ పాలనపై అని చెప్పారు. గతంలో యూట్యూబ్ ఛానల్స్ రేవంత్‌కు గొప్పగా కనిపించాయని, ఇప్పుడు ఎందుకో నచ్చడం లేదన్నారు. దానం, గాంధీ.. కేసీఆర్ నాయకత్వంలో పని చేసినప్పుడు ఎలా ఉన్నారు.. ఇప్పుడు ఎలా ఉన్నారో చెప్పాలన్నారు. పోలీసులు లా అండ్ ఆర్డర్‌ను కాపాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ ఎమ్మెల్యే లను, నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని ఖండించారు. అంతకుముందు హరీశ్‌రావు ఇంటికి వచ్చిన పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు.

## పాడి కౌశిక్..ఒళ్లు దగ్గర పెట్టుకో


నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేలా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాడి కౌశిక్‌రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. సీపీ ఆఫీస్‌లో ధర్నా చేయకుండా అక్కడ రౌడీయిజం చేస్తారా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యను సృష్టించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలోగల సీఎల్పీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాసరెడ్డి, మేడిపల్లి సత్యం, కె. నాగరాజు, మెఘారెడ్డి తదితరులు వేర్వేరుగా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పాలన అందించడంలో ప్రభుత్వం, శాంతిభద్రతలను నియంత్రించడంలో పోలీసులు విఫలమైనట్టు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలకు చీర, గాజులు పంపిస్తామంటూ కౌశిక్‌రెడ్డి మహిళలను కించపరిచేలా మొదట మాట్లాడారని విమర్శించారు. అరికెపూడిగాంధీ ఇంటికి వస్తానంటూ ఆయనను రెచ్చగొట్టారని చెప్పారు. కేటీఆర్, హరీశ్‌రావు దుర్మార్గమైన ఆలోచనతోనే ఆయన రెచ్చిపోతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో హరీశ్‌రావు ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారిపై దాడి చేశారని గుర్తు చేశారు. కేటీఆర్ ఓ సీఐని ఘోరమైన పదజాలంతో దూషించారని చెప్పారు. ఇతరులను బెదిరించడం, దాడులకు తెగబడటం వారికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కేసీఆర్ హయాంలో డ్రోన్లు ఉపయోగించారంటూ రేవంత్‌రెడ్డిని 14 రోజులు జైల్లో పెట్టారని తెలిపారు. అరికెపూడి గాంధీతోపాటు 19 మందిపై పోలీసులు కేసులు పెట్టారని తెలిపారు. ప్రభుత్వంపై వారు ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు తప్పుడు పద్ధతుల్లో ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కౌశిక్ రెడ్డి ఆంధ్రా సెటిలర్లపై చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రుణమాఫీపై రైతులను రెచ్చగొట్టేందుకు చేసిన వారి ప్రయత్నాలు ఫలించలేదని తెలిపారు.

గతంలో కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి బెదిరించి రెండు పార్టీలను నిర్వీర్యం చేయాలని ప్రయత్నించారని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులపై ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ నీతులు చెబుతున్నదని ఎద్దేవా చేశారు. ప్రజాపద్దుల సంఘం(పీఏసీ) చైర్మెన్ పదవిని ఆనవాయితీ ప్రకారమే ప్రతిపక్ష పార్టీ నేతకు ఇచ్చామని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు పెట్టుబడులు రాకుండా బీఆర్ఎస్ నేతలు భయానక వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రమాణ స్వీకారానికి ముందే ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ బీఆర్ఎస్ నేతలు బలుపు మాటలు మాట్లాడుతున్నారని చెప్పారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొంత మంది కాంగ్రెస్‌లోకి వస్తారని వెల్లడించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోతుందంటూ హరీశ్‌రావు దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. కల్వకుంట్ల కుటుంబానికి సన్నిహితంగా ఉన్న బిల్డర్లతో ఆ విషయాన్ని చెప్పించాలని సూచించారు.

## నేడు ఏకేజీ భవన్‌కు భౌతిక కాయం

(మొదటిపేజీ తరువాయి)



ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కి బదిలీ చేస్తారు. ఏచూరి తల్లి కల్పక మృతదేహాన్ని 2021లో ఎయిమ్స్‌కు అప్పగించారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా మూడు వారాలకుపైగా ఎయిమ్స్‌లో చికిత్స పొందిన ఏచూరి గురువారం సాయంత్రం కన్నుమూశారు. జేఎన్‌యూ స్టూడెంట్ యూనియన్ హాలులో ఉంచిన ఏచూరి భౌతికకాయానికి వందలాది మంది భావోద్వేగంతో వీడ్కోలు పలికారు. ఏచూరి మూడు పర్యాయాలు అధ్యక్షుడిగా ఉన్న జేఎన్‌యూ విద్యార్థి సంఘం నేటి పాదయాత్రలో మాజీ నేతకు పిడికిలి ఎత్తి నినాదాలు చేస్తూ నివాళులర్పించింది. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్‌కరత్, బృందాకరత్, ఎంఎ బేబి, నీలోత్‌పాల్ బసు తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని ఏచూరి వసంత్ కుంజ్ నివాసానికి తరలించారు. నివాళులర్పించేందుకు సీపీఐ(ఎం), వివిధ వర్గ సంఘాల నాయకులు ఇక్కడికి వచ్చారు. ఏచూరి భార్య సీమా చిస్తి, ఆయన పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, బృందాకరత్, ఎంఎ బేబి, ఎ. విజయరాఘవన్, నీలోత్‌పాల్ బసు, కేంద్ర కమిటీ సభ్యులు ఇపి జయరాజన్, పికె శ్రీమతి, సీనియర్ నేత పి. కరుణాకరన్, ఎంపిలు జాన్ బ్రిటాస్, వి. శివదాసన్, ఎఎ రహీమ్ కూడా ఏచూరి నివాసానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ ఏచూరి నివాసానికి వెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నివాళులర్పించారు. కేంద్ర ఆరోగ్య మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ కూడా ఏచూరి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి నివాళి అర్పించారు.

# అరుణ తారకు అరుణాంజలి


హిమాచల్ ప్రదేశ్‌లో...


ఆస్పత్రిలో ఏచూరి భౌతిక కాయంపై అరుణ పతాకాన్ని కప్పుతున్న ప్రకాశ్ కరత్


విద్యార్థుల రెడ్ సెల్యూట్


ఏచూరి కుటుంబ సభ్యులతో చంద్రబాబు






ఏచూరికి సెల్యూట్ చేస్తున్న బి. వెంకట్, జూలకంటి రంగారెడ్డి, సుధాకర్ రెడ్డి, వీరారెడ్డి


జేఎన్‌యూలో...

# విద్యార్థి దశలోనే నేతగా ప్రతిభ

## జేఎన్‌యూలో అందరూ స్నేహితులే | విద్యా వ్యవస్థలో సామాజిక మార్పు కోసం ఆందోళన

**ఏ స్థాయికి చేరినా సహచరులను మరువని ఏచూరి**





**న్యూఢిల్లీ :** సీతారాం ఏచూరి 1973లో న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో చేరారు. అప్పుడు తరగతులను 'పాత క్యాంపస్'లో నిర్వహించే వారు. ఆ భవనం నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందినది. నూతనంగా నిర్మిస్తున్న క్యాంపస్‌లో డార్మెటరీలు ఉన్నాయి. వాటికి దేశంలోని నదుల పేర్లు పెట్టారు. నిర్మాణంలో ఉన్న నూతన శాశ్వత క్యాంపస్‌కు చేరుకోవడానికి పాత క్యాంపస్ నుండి పది నిమిషాల సమయం పట్టేది. జవహర్‌లాల్ నెహ్రూను నిరంతరం గుర్తు చేయడం కోసం యూనివర్సిటీ విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చేశారు. నెహ్రూతో అనుబంధం ఉన్న ఆధునిక జాతీయ, అంతర్జాతీయ ఆత్మను మరింత ముందుకు తీసికెళ్లేందుకు జేఎన్‌యూ కంకణం కట్టుకుంది.

### మిత్రులతో చర్చా గోష్ఠులు

ఇలాంటి వాతావరణంలో ఏచూరి వివిధ సబ్జెక్టులకు చెందిన విద్యార్థులతో సమావేశమయ్యే వారు. విద్యాభ్యాసం ఎలా చేయాలో, ప్రపంచంలో ఎలా మెలగాలో చర్చించుకునే వారు. యూనివర్సిటీలో వివిధ నేపథ్యాలు కలిగిన, వివిధ ప్రాంతాలకు చెందిన, వేర్వేరు భాషలు మాట్లాడే విద్యార్థులు ఉండే వారు. తెలుగు వాడైన సీతారాం ఏచూరి (అందరూ ఆయనను సీత అని పిలిచే వారు) హిందీ, ఆంగ్ల భాషలను అనర్గళంగా మాట్లాడే వారు. సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న ఏచూరి, ఆర్థిక శాస్త్రాన్ని బాగా బోధించే ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌ను ఎంపిక చేసుకోలేదు. దానికి బదులుగా జేఎన్‌యూని ఎంచుకున్నారు. ఎందుకంటే అందులో ఆర్థిక శాస్త్రాన్ని కొత్త కోణంలో బోధించే వారు. ఏచూరి ప్రారంభంలో ఏ రాజకీయ విద్యార్థి విభాగంతోనూ సంబంధాలు నెరపలేదు. అయితే రాజకీయ పరమైన ప్రశ్నలపై ఆసక్తి చూపే వారు. మిత్రులతో రాత్రంతా రాజకీయాలపై చర్చించే వారు. ఆ చర్చలో జాతీయ, అంతర్జాతీయ అంశాలెన్నో ప్రస్తావనకు వచ్చేవి.

### విద్యార్థి రాజకీయాలతో అనుబంధం

ఆ తర్వాత కొద్ది కాలానికే ఏచూరి జేఎన్‌యూలో విద్యార్థి రాజకీయాలతో అనుబంధం ఏర్పరచుకున్నారు. క్యాంపస్‌లో ఎస్ఎఫ్ఐ ప్రాబల్యం అధికంగా ఉండేది. ఆ సమయంలోనే క్యాంపస్‌లో 'ఫ్రీ థింకర్స్' అనే సంస్థ ఏర్పడింది. రాజకీయాలతో, పార్టీలతో సంబంధం లేని వారందరూ అందులో భాగస్వాములయ్యారు. అయినప్పటికీ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ కూటమిగా ఏర్పడి విద్యార్థి సంఘం ఎన్నికలలో విజయం సాధించాయి. ఏచూరిని ఏఐఎస్ఎఫ్‌లో చేర్చేందుకు కొందరు ప్రయత్నించారు. అయితే ఆ సంస్థ ఇందిరా గాంధీకి మద్దతు ఇస్తోందన్న అభిప్రాయం బలపడడంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. అనంతరం ఏచూరి ఎస్ఎఫ్ఐలో చేరారు. ఆ సంఘం రాజకీయ సిద్ధాంతం, కార్యక్రమం ఆయనను ఆకర్షించాయి. ఎస్ఎఫ్ఐలో చేరినప్పటికీ ఇతర సంఘాలకు చెందిన విద్యార్థులతో ఆయన స్నేహం అలాగే కొనసాగింది.

### అటు చదువు...ఇటు ఆందోళన

ఏ సంఘానికి చెందిన వారైనా ఏచూరి వారితో కలిసి టీ తాగేవారు. సినిమాలు చూసే వారు. వివిధ పుస్తకాలపై చర్చించే వారు. ఆయన వాదనలు పదునుగా ఉండేవి. తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసేందుకు ఎన్నడూ సిగ్గుపడే వారు కాదు. అభిప్రాయ బేధాన్ని వ్యక్తిగతంగా తీసుకునే వారు కాదు. ఎప్పుడూ నవ్వుతూ ఉండే ఏచూరికి అనేక మంది స్నేహితులుగా మారిపోయారు. సామాజికంగా, ఆర్థికంగా అట్టడుగున ఉన్న అభ్యర్థులకు ప్రవేశాలలో ప్రాధాన్యత కల్పించేలా యూనివర్సిటీ తన విధానాలను మార్చుకోవాలంటూ 1974లో విద్యార్థి సంఘం సమ్మె చేసింది. 'చదువు...పోరాటం సాగించు' అన్న యూనియన్ పిలుపుతో విద్యార్థులు లైబ్రరీకి, ప్రదర్శన స్థలానికి మధ్య పరుగులు పెడుతుండే వారు. ఏచూరి కూడా లైబ్రరీలో చదువుకొని, ఆ తర్వాత అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట ప్రదర్శనలో పాల్గొనే వారు. అప్పుడు యూనివర్సిటీ ఛాన్సలర్‌గా ఉన్న మాజీ దౌత్యవేత్త జి. పార్థసారధి విద్యార్థుల డిమాండ్లను అంగీకరించారు. జేఎన్‌యూ పరిసరాల డీఎస్‌ఏలో సామాజిక మార్పు దానితోనే ప్రారంభమైంది. ఆ సందర్భంగా జరిగిన విజయోత్సవంలో ఏచూరి కూడా భాగస్వామి అయ్యారు.

**ఎంత ఎదిగినా**
### ఒదిగే ఉంటూ...

అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో 1976లో జేఎన్‌యూ విద్యార్థి సంఘానికి ఏచూరి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆయన అత్యంత వేగంగా ఎస్ఎఫ్ఐ నాయకత్వ నిచ్చెనను అధిరోహించారు. అనంతరం సీపీఐ (ఎం)లోనూ అగ్ర స్థానానికి చేరుకున్నారు. ఇదేమీ ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే ప్రజలతో మమేకం కావడానికి, వారికి నేతృత్వం వహించడానికి ఆయన మేధస్సు, నైపుణ్యం తోడ్పడింది. ఏ స్థాయిలో ఉన్నా ఏచూరి తన స్నేహితులను ఆదరించే వారు. వారితో ముచ్చటించే వారు. వారి పట్ల ప్రేమాభిమానాలు కనబరిచే వారు.

**మిత్రునికి తుది సందేశం**

జేఎన్‌యూలో విద్యాభ్యాసం చేసినప్పటి నుండి ఏచూరికి జ్ఞాన్ ప్రకాష్ అనే స్నేహితుడు ఉండే వారు. ఆయన రచించిన ఓ పుస్తకానికి సంబంధించిన హిందీ అనువాదాన్ని విడుదల చేసిన సందర్భంగా గత నెల 18న ఏచూరి ఓ నోట్ పంపారు. పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరవుదామని అనుకున్నానని, అయితే కాటరాక్ట్ ఆపరేషన్ జరగడంతో రాలేకపోయానని, బయట తిరగవద్దని వైద్యులు సలహా ఇచ్చారని జ్ఞాన్ ప్రకాష్‌కు తెలియజేశారు. అదే తన మిత్రుడికి ఏచూరి పంపిన చివరి సందేశం. జ్ఞాన్ ప్రకాష్ అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.


ఏచూరి నివాసంలో భౌతికకాయం


మరియం ధావలే, అశోక్ ధావలే




అగర్తలలో...


ఏచూరికి నివాళి...

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.